మంగళవారం
10•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 165
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE









## అభివృద్ధిని చూసి గర్వపడుతున్నా..

- దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ
- ఆరోగ్య తెలంగాణకు సమిష్టిగా కృషిచేయాలి
- యాదాద్రి, వరంగల్ పర్యటనలో గవర్నర్ తమిళిసై

3


సోమవారం యాదాద్రిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ దంపతులతో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్, ఆలయ అర్చకులు, అధికారులు

## కన్నడనాట కమలవిజయం

అసెంబ్లీ ఉపఎన్నికల్లో బీజేపీ జయభేరి

- 15 స్థానాలకుగాను 12 స్థానాలు కైవసం
- యెడియూరప్ప సర్కార్‌కు తప్పిన గండం
- అసెంబ్లీలో మెజార్టీని కూడగట్టుకున్న బీజేపీ
- రెండు నియోజకవర్గాలకే పరిమితమైన కాంగ్రెస్
- జేడీఎస్ డీలా.. ఒకచోట బీజేపీ రెబల్ గెలుపు

5



యెడియూరప్పకు స్వీటు తినిపిస్తున్న ఆయన కుమారుడు విజయేంద్ర

## రష్యాకు డోపింగ్ దెబ్బ

నాలుగేండ్లు నిషేధం విధించిన 'వాడా'

ఒలింపిక్స్, ఫిఫా వరల్డ్‌కప్ టోర్నీకి దూరం

అప్పీల్‌కు వెళ్లనున్న రష్యా



వివరాలు ఆటలో

## హ్యాట్సాఫ్ టు కేసీఆర్

తెలంగాణ పోలీసులకు అభినందనలు • దిశ నిందితుల ఎన్‌కౌంటర్ తప్పేకాదు

లైంగికదాడుల కేసులలో నిందితులకు 21 రోజుల్లో శిక్షపడేలా చట్టం తెస్తాం

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆ రాష్ట్ర సీఎం జగన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లైంగికదాడులకు పాల్పడిన నిందితులకు ఏ శిక్షపడితే బాధితురాలి తల్లిదండ్రులు ఉపశమనం పొందుతారో అటువంటి చర్యలనే తెలంగాణ ప్రభుత్వం అమలుచేసిందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఇందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును, తెలంగాణ పోలీసులను అభినందిస్తున్నానని చెప్పారు. సోమవారం ఏపీ అసెంబ్లీలో.. మహిళా భద్రతపై స్వల్పకాలిక చర్చలో సీఎం జగన్ ఉద్వేగపూరితంగా మాట్లాడారు. మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడిన కేసులలో నిందితులకు సత్వరమే శిక్షపడేలా చట్టాల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. 'దిశ ఘటన, ఆమె తల్లిదండ్రులు పడుతున్న బాధ, ఆవేదన చూసిన తర్వాత.. నిందితులను కాల్చివేసినా తప్పులేదని అందరం అనుకున్నాం. నాకు ఇద్దరు అమ్మాయిలు, భార్య, చెల్లి ఉన్నారు. ఆడపిల్లల తండ్రిగా, వారికి ఎవరైనా ఏదైనాచేస్తే ఒక తండ్రిగా ఎలా స్పందించాలి? వాళ్లకు ఏరకమైన శిక్షపడితే వెంటనే ఉపశమనం కలుగుతుందనుకుంటానో దాన్నే తెలంగాణ ప్రభుత్వం అమలుచేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారికి, తెలంగాణ పోలీస్ అధికారులకు హ్యాట్సాఫ్' అని చెప్పారు. దిశ కేసు నిందితులను ఎన్‌కౌంటర్ చేస్తే ఎన్‌హెచ్చార్సీ ఎందుకు వచ్చి నిలదీస్తున్నదని ఆయన ప్రశ్నించారు. నిర్భయ కేసులో నిందితులకు ఇంకా శిక్ష పడకపోవడంపై వారు ఏం చెప్తారని నిలదీశారు. అనివార్య పరిస్థితుల్లోనే దిశ నిందితుల



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో

# పౌరసత్వ బిల్లు పాస్

| లోక్‌సభలో ఓటింగ్.. | |
|---|---|
| అనుకూలం : | 311 |
| వ్యతిరేకం : | 80 |

ఏడు గంటల సుదీర్ఘచర్చ అనంతరం లోక్‌సభ ఆమోదం

సవరణ

- భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులను ఆదుకునేందుకే ఈ బిల్లు
- దేశంలోని ముస్లింలకు ఎలాంటి నష్టం ఉండదు: హోంమంత్రి అమిత్‌షా
- మైనార్టీలకు విఘాతమన్న కాంగ్రెస్.. బిల్లును వ్యతిరేకించిన టీఆర్‌ఎస్ సహా పలు పార్టీలు
- బిల్లుకు నిరసనగా ఈశాన్యరాష్ట్రాల్లో పెల్లుబికిన ఆగ్రహజ్వాలలు

**వివాదాస్పద** 'పౌరసత్వ (సవరణ) బిల్లు-2019'కు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రతిపక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లో మతపరమైన దాడులకు గురై భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులను ఆదుకునేందుకే ఈ బిల్లును రూపొందించామని స్పష్టంచేశారు. మన దేశంలోని ముస్లింలకు ఈ బిల్లుతో ఎలాంటి నష్టం కలుగదని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఆందోళన చెందవద్దని, ఇన్నర్ లైన్ పర్మిట్ (ఐఎల్‌పీ) కింద ఆయా రాష్ట్రాలకు ఈ బిల్లు నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు అమిత్‌షా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం సమయంలో దేశాన్ని మతం ప్రాతిపదికన విభజించిందని, అలా జరుగకపోయి ఉంటే ఈ బిల్లు తేవాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. రోహింగ్యా ముస్లింలను భారత్‌లోకి అనుమతించే ప్రసక్తే లేదని, వారంతా బంగ్లాదేశ్ నుంచి చొరబడుతున్నారని పేర్కొన్నారు. ఏడు గంటలకుపైగా జరిగిన చర్చ అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 311 మంది, వ్యతిరేకంగా 80 మంది ఓటేశారు. దీంతో బిల్లు ఆమోదం పొందినట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అంతకుముందు ఈ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. ఇది దేశంలోని మైనార్టీలకు వ్యతిరేకంగా ఉన్నదని కాంగ్రెస్ విమర్శించింది. దేశంలో ముస్లింలకు నీడ లేకుండా చేస్తారా? అని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ఈ బిల్లుతో అమిత్ షా హిట్లర్ సరసన నిలుస్తారని తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ బిల్లు ప్రతులను చించివేశారు. ఈ బిల్లును కాంగ్రెస్, టీఆర్‌ఎస్, ఎంఐఎం, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ, ఆర్జేడీ, బీజేడీ, వామపక్ష పార్టీలు, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఐయూఎంఎల్ తదితర పార్టీలు వ్యతిరేకించగా, అకాలీదళ్, జేడీయూ, ఎన్డీడీపీ, ఎన్‌ఎఫ్‌ఎఫ్, మిజో నేషనల్ ఫ్రంట్, ఎల్‌జేపీ, వైసీపీ తదితర పార్టీలు మద్దతు తెలిపాయి. మరోవైపు ఈ బిల్లుపై నిరసనలు చెలరేగాయి. ముఖ్యంగా ఈశాన్యరాష్ట్రాల్లో రాస్తారోకోలు, భారీ ర్యాలీలు నిర్వహించారు.

5



సోమవారం లోక్‌సభలో పౌరసత్వ సవరణ బిల్లును ప్రవేశపెట్టి ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి అమిత్ షా



కేంద్రప్రభుత్వ పౌరసత్వ సవరణ బిల్లుకు నిరసనగా సోమవారం రాత్రి గువాహటిలో కాగడాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆందోళనకారులు

### ఇది రాజ్యాంగ మూల సిద్ధాంతానికి విరుద్ధం

బిల్లులో ముస్లింలను కూడా చేర్చాలి

లేదంటే బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తాం



5

టీఆర్‌ఎస్ సెక్యులర్ పార్టీ

లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు

### ముస్లింలకు నీడలేకుండా చేస్తారా?

ఈ బిల్లు దేశంలోని ముస్లింలను నియంత్రించడానికే

ఇది స్వాతంత్ర్య సమరయోధులను అవమానించేదిగా ఉన్నది: ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్

5



లోక్‌సభలో పౌరసత్వ బిల్లు ప్రతులను చించివేస్తున్న ఎంపీ అసదుద్దీన్

# ఎన్‌కౌంటర్ కేసు విచారణ వాయిదా

సుప్రీంకోర్టులో పిల్స్ నేపథ్యంలో ధర్మాసనం నిర్ణయం

- గురువారం విచారణ చేపడుతామని వెల్లడి
- శుక్రవారందాకా మృతదేహాల సంరక్షణకు ఆదేశం
- కోర్టు ఆదేశాలతో గాంధీ దవాఖానకు మృతదేహాల తరలింపు
- అమికస్ క్యూరీగా డీ ప్రకాశ్‌రెడ్డి నియామకం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు విచారణను హైకోర్టు గురువారానికి వాయిదావేసింది. ఈ కేసులో అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టులో కూడా ఇదే అంశంపై పిల్స్ దాఖలయ్యాయని, వాటిపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టనున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో హైకోర్టులో కేసు విచారణను గురువారానికి వాయిదా వేయాలని విజ్ఞప్తిచేశారు. దీనిని ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నది. శుక్రవారం వరకు మృతదేహాలను సంరక్షించాలని చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. ఈ మేరకు మృతదేహాలను సోమవారం రాత్రి గాంధీ దవాఖానకు తరలించి.. భద్రపరిచారు. దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై హక్కుల కార్యకర్తలు రాసిన లేఖను శుక్రవారం సూమోటోగా విచారణకు స్వీకరించిన హైకోర్టు.. సోమవారం మరోమారు విచారణ చేపట్టింది. 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసులో ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని, వాటిని పాటించారా? అని హైకోర్టు అడ్వకేట్ జనరల్ బండా శివానందప్రసాద్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. నూతనంగా పార్లమెంట్ ఏదైనా

మిగతా 2వ పేజీలో

# కృష్ణమ్మ వెలుగులు

- తెలంగాణలో తొలిసారి భారీగా జలవిద్యుత్ ఉత్పత్తి
- ఈ సీజన్‌లో ఇప్పటికే 4వేల మిలియన్ యూనిట్లు
- భారీగా వరదలు వచ్చిన నాలుగునెలల్లో గరిష్ఠంగా..
- రాష్ట్ర అవసరాలు తీర్చిన కృష్ణమ్మ జలవిద్యుత్

నాగార్జునసాగర్ విద్యుత్ కేంద్రం (ఫైల్)



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఈ సంవత్సరం వర్షాకాలం సీజన్‌లో అందరి అంచనాలను తల్లకిందులు చేస్తూ.. కృష్ణమ్మ పరవళ్ళతో భారీస్థాయిలో జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఏర్పడింది. ఫలితంగా గడిచిన ఐదారునెలలకాలంలో.. అధికధరకు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం కొంతమేర తగ్గిందని అధికారులు అంటున్నారు. నిజానికి రాష్ట్రంలో రెండు జీవనదులు పారుతున్నా.. జలవిద్యుత్ ప్రాజెక్టుల విషయంలో కృష్ణానదిపైనే దాదాపు పూర్తిభారం ఉన్నది. కృష్ణానదిపైనే 97శాతానికిపైగా జలవిద్యుత్ ప్రాజెక్టులు ఉండగా.. గోదావరి, దాని ఉపనదులపై నామమాత్రంగా (3 శాతం లోపే) ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణకు మొత్తం 40 జల విద్యుత్ యూనిట్లు వచ్చాయి. వీటి ద్వారా మొత్తం 2441 మెగావాట్ల (ఇందులో 11.5 మెగావాట్ల మినీ హైడల్ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి) విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నది. ఇందులో ఎగువ జూరాల (234 మెగావాట్లు), దిగువ జూరాల (240 మె.వా.), శ్రీశైలం (900 మె.వా.), నాగార్జునసాగర్

మిగతా 6వ పేజీలో

## స్నేహబంధమూ ఎంత మధురమూ..

- ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి స్నేహితుడిని కలిసిన రాష్ట్రపతి
- మాజీ ఎంపీ వీరభద్రసింగ్‌కు కోవింద్ ఆత్మీయ పలకరింపు
- ఉత్కళ్ విశ్వవిద్యాలయం సమావేశంలో అరుదైన సన్నివేశం

III

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 80.00 | రిటైల్ లైవ్ | 102.00 |
| డ్రెస్‌డ్ | 148.00 | స్కిన్‌లెస్ | 168.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 431.00 | రంగారెడ్డి | 431.00 |
| మెదక్ | 431.00 | కరీంనగర్ | 434.00 |
| వరంగల్ | 434.00 | డజన్ ధర | 66.00 |

# ఆర్టీసీ ఉద్యోగినికి.. చెర్రీ కలర్ ఏప్రన్

రాత్రి 8 గంటల్లోపే విధులు పూర్తి

- రెండ్రోజుల్లో చైల్డ్‌కేర్ లీవ్ ఆదేశాలు
- కార్మికులు కాదు.. ఉద్యోగులే..
- సర్క్యులర్ జారీచేయనున్న ఆర్టీసీ
- ఉద్యోగుల తల్లిదండ్రులకు బస్‌పాసులు
- కార్యరూపంలోకి సీఎం కేసీఆర్ హామీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'దయచేసి కార్మికులని పిలవొద్దు.. ఉద్యోగులు అనే పిలవాలి. ఇక నుంచి అందరూ టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులే. విభజన రేఖ చెరిపేయాలి. పనికూడా అలా జరుగాలి' అంటూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు డిసెంబర్1న ప్రగతిభవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమక్షంలో వ్యాఖ్యానించారు. నిర్దేశించిన సమయంలోగా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆదేశించారు. దీంతో ఇప్పటికే సీఎం ప్రకటించిన పలు వరాలను వాస్తవరూపంలోకి తెచ్చిన అధికారులు మిగిలినవి వీలైనంత త్వరలో చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆర్టీసీలో పనిచేసే మహిళా ఉద్యోగుల డ్రెస్‌కోడ్ మారనున్నది. ఖాకీ డ్రెస్ స్థానంలో మరో రంగు డ్రెస్ ధరించేలా చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ సూచించిన నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం

మిగతా 6వ పేజీలో

## 16న నిర్భయ దోషులకు ఉరి?

ఆమెపై పాశవికకాండ జరిగిన రోజునే శిక్షకు కేంద్ర యోచన


పది ఉరితాళ్లు సిద్ధంచేయాలని బక్సర్ జైలుకు ఆదేశం!

5

## ఎస్బీఐ రుణాలు మరింత చౌక

వడ్డీరేట్లు 10 బేసిస్ పాయింట్ల తగ్గింపు

9

# 26న రాష్ట్రపతి హైదరాబాద్‌కు రాక



- బొల్లారంలో శీతాకాలపు విడిది
- ఏర్పాట్లపై మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ ఎంవీరెడ్డి సమీక్ష

**మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** రాష్ట్రపతి రాంనాథ్‌కోవింద్ శీతాకాలపు విడిదిలో భాగంగా ఈ నెల 26న బొల్లారంలోని రాష్ట్రపతిభవన్‌కు రానున్నారు. రాష్ట్రపతి విడిదికి పక్కాగా ఏర్పాట్లుచేయాలని వివిధశాఖల అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఎంవీరెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మల్కాజిగిరి ఆర్డీవో మధుసూదన్‌ను నోడల్ అధికారిగా నియమించారు. రాష్ట్రపతి 26వ తేదీన హకీంపేట ఎయిర్‌పోర్ట్‌కు వస్తారని, ఆయన ప్రయాణించనున్న ప్రాంతాలను అందంగా తీర్చిదిద్ది, విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలను అందంగా అలంకరించాలని అటవీశాఖ అధికారులను, వైద్యశిబిరంతోపాటు 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిని, భోజనవసతి ఏర్పాటుచేయాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిని ఆదేశించారు. పాసుల కోసం అధికారులు ఎంప్లాయి ఐడీ, ఆధార్‌కార్డు, ఫొటోలను నార్త్ జోన్ డీసీపీ, బేగంపేట ఏసీపీకి అందజేయాలన్నారు.



2009లో డిసెంబర్ 9న తొలిసారి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన వెలువడిన రోజును పురస్కరించుకొని సోమవారం కరీంనగర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్‌ఎస్వీ నేత పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, జీకే యూత్ అధ్యక్షుడు మొగిలోజు వెంకట్ తదితరులు

# బీచుపల్లి వద్ద ఆధునిక రైతుమార్కెట్

రెండెకరాల భూమిని కేటాయించిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్-కర్నూలు హైవే పక్కన బీచుపల్లి వద్ద ఆధునిక రైతు మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దీని నిర్మాణం కోసం వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ.. తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన రెండెకరాలను కేటాయించింది. భూకేటాయింపుపై సత్వర చర్యలు తీసుకోవాలని సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్కెట్ జోగుళాంబ గద్వాల జిల్లా రైతులు పండించిన కూరగాయలు విక్రయించేందుకు ఎంతగానో ఉపయోగపడనున్నది. జిల్లాలో ఎంపికచేసిన రైతులు తాము పండించిన కూరగాయలను రైతు మార్కెట్‌లో నేరుగా అమ్ముకోవచ్చు. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి త్వరలోనే ఈ మార్కెట్ పనులను ప్రారంభించనున్నారు.



# గర్వించేలా గజ్వేల్ అభివృద్ధి

- 135 కోట్లతో ఉద్యాన వర్సిటీ
- 75 కోట్లతో అటవీ కళాశాల
- 22.85 కోట్లతో సమీకృత మార్కెట్
- 42.50 కోట్లతో సమీకృత కార్యాలయ భవన సముదాయం
- రేపు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- పలు అభివృద్ధి పనులకూ శంకుస్థాపనలు



గజ్వేల్ పట్టణంలో సిద్ధమైన సమీకృత కార్యాలయ భవనం



గజ్వేల్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్



గజ్వేల్ పట్టణంలో అందంగా రూపుదిద్దుకున్న మహతి ఆడిటోరియం

**సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ప్రారంభోత్సవాలు జరుగనున్నాయి. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు రాష్ట్రం గర్వించేలా నిలిచాయి. దీంతో గజ్వేల్‌కు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు రానున్నది. ఐదేండ్లలోనే 70 ఏండ్ల అభివృద్ధిని చేసి చూపిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కింది. కోట్ల రూపాయలతో ములుగులో నిర్మించిన అటవీ కళాశాల, ఉద్యాన వర్సిటీ, గజ్వేల్ పట్టణంలో సమీకృత మార్కెట్, సమీకృత కార్యాలయ భవన సముదాయం, మహతి ఆడిటోరియంను సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. వీటితోపాటు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో రూ.100 కోట్లతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, రూ.21 కోట్లతో నిర్మించే మాతా శిశు సంరక్షణ దవాఖానతోపాటు విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయ భవనాలకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారు.

### 16 ఎకరాల్లో ఉద్యాన విశ్వవిద్యాలయం

ములుగులో రూ.135 కోట్ల ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) నిధులతో 16 ఎకరాల్లో ఉద్యాన వర్సిటీని ఏర్పాటుచేశారు. ఈ వర్సిటీలో నాలుగు అంతస్తుల్లో అకాడమిక్ బ్లాక్‌లు మూడు, నాలుగు అంతస్తుల్లో అడ్మినిస్ట్రేషన్ బ్లాకులను నిర్మించారు. విద్యార్థిని, విద్యార్థులకు వేరువేరుగా వసతి గదులను, గెస్ట్‌హౌస్, స్టాఫ్ క్వార్టర్స్, ఆడిటోరియం నిర్మించారు. ఇందులో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ఉద్యానశాస్త్రంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు ఉంటాయి.

### అంతర్జాతీయ ప్రమాణాలతో అటవీ కాలేజీ

ములుగులో రూ.75 కోట్లతో 20 ఎకరాల్లో జీప్లస్-2 పద్ధతిన అటవీ కళాశాలను నిర్మించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడ్మినిస్ట్రేటివ్ భవనం, విశాలమైన తరగతి గదులు, ల్యాబ్‌లు, మ్యూజియం, ఆడిటోరియంలను నిర్మించారు. దేశంలోనే మొదటి ఫారెస్ట్ కళాశాల తమిళనాడు రాష్ట్రంలో ఉండగా, రెండోది ములుగు వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణమైనది. ఇందులో అటవి శాస్త్రంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ప్రవేశపెట్టనున్నారు. 2019-20 విద్యాసంవత్సరానికి గాను ములుగులో ప్రారంభం కానున్న బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీలో కలిపి మొత్తం 104 సీట్లు ఉంటాయి.

### సమీకృత మార్కెట్‌యార్డు

గజ్వేల్‌లో 6.24 ఎకరాల్లో రూ.22.85 కోట్లతో అత్యాధునిక సమీకృత మార్కెట్ యార్డును నిర్మించారు. ఇందులో కూరగాయలు, మాంసం దుకాణాలను నిర్మించారు. వీటిలో 156 కూరగాయల, 52 నాన్‌వెజ్, 38 పండ్లు, పూల దుకాణాలు ఉన్నాయి. లాటరీ పద్ధతిలో వీటిని కేటాయించారు. సూపర్ మార్కెట్‌తోపాటు ఐదు టన్నుల సామర్థ్యం కలిగిన కోల్డ్ స్టోరేజీని నిర్మించారు. వినియోగదారులు సేద తీరడానికి ఆహ్లాదకరమైన వాతావరణం, వాహనాల పార్కింగ్‌కు స్థలం, రైతుల జీవన చిత్రాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటుచేశారు.

### అన్ని శాఖల కార్యాలయాలు ఒకేచోట

గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలకు అన్ని ప్రభుత్వశాఖల కార్యాలయాలు అందుబాటులో ఉండేలా భవ న సముదాయాలను ఒకేచోట నిర్మించారు. సుమారు 6.20 ఎకరా ల్లో రూ.42.50 కోట్లతో సమీకృత కార్యాలయ భవన సముదాయం నిర్మించారు. గజ్వేల్ డివిజన్ కేంద్రంలోని 42 శాఖల కార్యాలయాలు ఇందులోకి వస్తాయి.



ములుగులో నిర్మించిన శ్రీకొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన వర్సిటీ

### రూ.19.47 కోట్లతో మహతి ఆడిటోరియం

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, లలిత కళాతోరణం తదితర వేదికల కంటే మరింత అధునాతనంగా గజ్వేల్ పట్టణంలో మహతి ఆడిటోరియంను నిర్మించారు. రెండెకరాల విస్తీర్ణంలో ఈ సమావేశ మందిరాన్ని రూ.19.47 కోట్లతో నిర్మించారు. సుమారు 1,100 మంది కూర్చునేందుకు వీటుగా సీట్లు ఏర్పాటుచేశారు. పక్కనే మరో 200 మంది కూర్చునేలా మినీ హాల్ నిర్మించారు.

## సీఎం కేసీఆర్ పర్యటనపై సమీక్ష



ఉద్యాన వర్సిటీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

**అన్ని ఏర్పాట్లుచేయండి: మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్**

**ములుగు:** సీఎం కేసీఆర్ గజ్వేల్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్.. సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, కలెక్టర్ వెంకట్రాంరెడ్డి, సంబంధిత ఉన్నతాధికారులతో సోమవారం ములుగులో సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు అటవీ కళాశాల, ఉద్యాన వర్సిటీని పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారథి, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ మునీంద్ర, అటవీ కళాశాల డీన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ రవీందర్‌రెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రెడ్డి, జేసీ పద్మాకర్, సీపీ జోయల్ డెవిస్, ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, గడా ఓఎస్డీ ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట ఠాణాలో సీనియర్ కాంగ్రెస్ నేత కత్తి వెంకటస్వామి కుమారుడు చాణక్య

## డ్రగ్స్ కేసులో కాంగ్రెస్ నేత కొడుకు అరెస్ట్

- 60 వేల విలువైన ఎల్‌ఎస్డీ స్వాధీనం
- అంబర్‌పేట ఠాణాలో కేసు నమోదు

**గోల్నాక:** సీనియర్ కాంగ్రెస్ నేత కత్తి వెంకటస్వామి కుమారుడు చాణక్య (33) డ్రగ్స్ కేసులో పోలీసులకు పట్టుబడ్డాడు. హైదరాబాద్ అంబర్‌పేటలో ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు చాణక్య అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. నల్లకుంట బాయమ్మ గల్లీలో ఉండే కొందరు వ్యక్తులకు చాణక్య డ్రగ్స్ అమ్మడంతోపాటు అతను కూడా వాడుతున్నట్టు ఈ విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. అతని నుంచి రూ.60 వేలు విలువైన 824 మిల్లీగ్రాముల ఎల్‌ఎస్డీ మాదకద్రవ్యాన్ని స్వాధీనంచేసుకున్నామని తెలిపారు. చాణక్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. బీటెక్ చదివిన చాణక్య అంబర్‌పేట ఖాద్రీబాగ్‌లోని హ్యాపీహోమ్స్‌లో నివసిస్తున్నాడని, మాదకద్రవ్యాలకు అలవాటుపడిన అతను కొంతకాలం క్రితం గోవా వెళ్లి అక్కడ పరిచయమైన ఓ వ్యక్తితో డ్రగ్స్ విక్రయానికి ఒప్పందం కుదుర్చుకొన్నాడని డీఐ బిక్కి రమేశ్ తెలిపారు. ఆ వ్యక్తి గత కొన్ని నెలలుగా జమ్ముకశ్మీర్ నుంచి రిజిస్టర్‌పోస్టు ద్వారా చాణక్యకు డ్రగ్స్ సరఫరాచేస్తున్నాడని, ఇందుకు చెల్లించాల్సిన మొత్తాన్ని చాణక్య గూగుల్‌పే ద్వారా ఆ వ్యక్తికి బదిలీ చేస్తున్నాడని రమేశ్ వివరించారు.

# ఎన్‌కౌంటర్ స్థలంలో త్రీడీ స్కానింగ్

- శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలు సేకరణ
- ఘటనాస్థలంలో కొనసాగుతున్న పోలీస్ పహారా

**హైదరాబాద్ సిటీబ్యూరో/ షాద్‌నగర్, నమస్తే తెలంగాణ:**

దిశ నిందితులు ఎదురుకాల్పుల్లో మృతిచెందిన స్థలంలో పోలీసులు సోమవారం త్రీడీ స్కానర్‌తో ఆధారాలను సేకరించారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు అక్కడ ప్రతి అంగుళాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఆధారాలు భద్రపరుస్తారు. ఇందుకోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తున్నారు. ఘటన స్థలాన్ని త్రీడీ స్కానర్‌తో స్కాన్ చేయడంవల్ల ఆధారాలు భద్రంగా ఉంటాయి. ఈ క్రమంలోనే చటాన్‌పల్లి శివారులో దిశను నిందితులు దహనం చేసిన స్థలాన్ని, పోలీసుల ఎదురుకాల్పుల్లో వారు చనిపోయిన ప్రాంతాన్ని పక్కనే ఉన్న జాతీయ రహదారి నుంచి క్లూస్ టీమ్ సిబ్బంది త్రీడీ స్కాన్ చేశారు. ప్రధాన రోడ్డుకు, ఎన్‌కౌంటర్ జరిగిన చోటుకు ఎంత దూరం ఉన్నది? ఘటనాస్థలంలో పోలీసులు, నిందితులు ఎంతదూరం నుంచి కాల్పులు జరిపారు అనే విషయంలో శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలు సేకరిస్తున్నారు. ఎక్కువగా తుపాకీ కాల్పులు జరిగినప్పుడు ఈ స్కానర్‌ను పోలీసులు ఉపయోగిస్తుంటారు. ఎన్‌కౌంటర్ ప్రదేశంలో ఎలాంటి కొత్త ఆధారాలను గుర్తించలేదని, కేవలం ఫొటోలు, వీడియోలను మాత్రమే తీశామని క్లూస్ టీంలోని ఓ అధికారి తెలిపారు.

### కొనసాగుతున్న పహారా

దిశ నిందితుల ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో పోలీసుల పహారా కొనసాగుతున్నది. సోమవారం చటాన్‌పల్లి బైపాస్ రోడ్డు సమీపంలో సుమారు 30 మందికి పైగా పోలీసులు పహారా నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు, ఇతర సాధారణ వ్యక్తులు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.



చటాన్‌పల్లి ఘటనాస్థలిలో త్రీడీ స్కానర్

## నేడు ఘటనాస్థలానికి సిట్!

- దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై కార్యాచరణ ప్రారంభం
- ఏడుగురు సభ్యులకు పని విభజనచేసిన సిట్ చీఫ్ మహేశ్‌భగవత్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దిశ ఘటనలో నలుగురు నిందితుల ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రంగంలోకి దిగింది. నిందితులు ఈ నెల 6న చటాన్‌పల్లి వద్ద పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్ కేసు దర్యాప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాచకొండ సీపీ మహేశ్‌భగవత్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో సిట్‌ను ఏర్పాటుచేసింది. సిట్ సభ్యులతో సీపీ సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎవరెవరు ఏ బాధ్యతలు నిర్వర్తించాలన్నదానిపై స్పష్టతనిచ్చినట్టు తెలిసింది. మంగళవారం ఉదయం సిట్ బృందం ఎన్‌కౌంటర్ ప్రదేశాన్ని సందర్శించే అవకాశం ఉన్నది.

## కొనసాగిన హెచ్చార్సీ విచారణ

- పంచనామా వివరాల సేకరణ
- ఎన్‌కౌంటర్‌లో గాయపడిన ఎస్సై, కానిస్టేబుల్ మెడికల్ రికార్డుల పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దిశ హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్ ఘటనపై వరుసగా మూడోరోజు ఎన్‌హెచ్చార్సీ విచారణ కొనసాగింది. నిందితుల మృతదేహాలకు పంచనామా నిర్వహించిన నలుగురు తాసిల్దార్లను సోమవారం మరోసారి పోలీస్ అకాడమీకి పిలిపించినట్టు సమాచారం. మృతదేహాలకు పంచనామాపై నలుగురు తాసిల్దార్లను ప్రశ్నించి, వారి సమాధానాలను రికార్డుచేసినట్టు తెలిసింది. ఎన్‌కౌంటర్‌పై మీడియాలో వచ్చిన కథనాలనూ సేకరించినట్టు సమాచారం. గచ్చిబౌలి కేర్ దవాఖానలో చికిత్సపొందుతున్న నందిగామ ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ అరవింద్‌గౌడ్‌ను ఎన్‌హెచ్చార్సీ బృందం కలిసి పలు వివరాలు తెలుసుకున్నది. డాక్టర్లతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని వాకబుచేసింది. ఎస్సై, కానిస్టేబుల్ హెల్త్‌రికార్డులను పరిశీలించినట్టు సమాచారం. ఎన్‌కౌంటర్ సమయంలో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిని విచారించిన అనంతరం మంగళవారం సాయంత్రం ఎన్‌హెచ్చార్సీ బృందం ఢిల్లీకి తిరుగు ప్రయాణం అయ్యే అవకాశాలున్నట్టు తెలిసింది.

## 'దిశ' లారీ దృశ్యాలు విడుదల

దిశ ఘటన, ఎన్‌కౌంటర్‌పై ఎన్‌హెచ్చార్సీకి పోలీసుల నివేదిక!

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దిశ ఘటనలో నిందితులు ఉపయోగించిన లారీకి సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజ్‌ను సైబరాబాద్ పోలీసులు సోమవారం విడుదలచేశారు. 27వ తేదీ రాత్రి దిశపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితులు, ఆమెను హతమార్చి, మృతదేహాన్ని ఇదే లారీలో తీసికెళ్లారు. ఈ ఘటనలో పోలీసులు 250 సీసీ కెమెరాల ఫుటేజ్ సేకరించారు. ఒక్కో సీసీ కెమెరానుంచి కనీసం ఎనిమిది గంటల ఫుటేజ్‌ను విశ్లేషించారు. వాటి ద్వారా సేకరించిన ఆధారాలతోనే నిందితులను గుర్తించి, 24 గంటల్లో అరెస్ట్‌చేశారు. తాజాగా లారీకి సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలు పోలీసులు విడుదల చేశారు.



పోలీసులు విడుదలచేసిన దిశ ఘటనలో నిందితులు వాడిన లారీ సీసీటీవీ ఫుటేజీ

### ఎన్‌హెచ్చార్సీకి నివేదిక

దిశ ఘటన, ఆ కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌పై సైబరాబాద్ పోలీసులు ఒక నివేదికను ఎన్‌హెచ్చార్సీ బృందానికి అందించినట్టు తెలిసింది. దిశపై అఘాయిత్యం చేసిన నిందితులు విచారణలో వెల్లడించిన అంశాలు, పోలీసులు సేకరించిన శాస్త్రీయ ఆధారాలు, కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకొని రెండు రోజులపాటు విచారించిన అంశాలను ఈ నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. దిశను దహనం చేసిన ప్రాంతానికి ఆరోతేదీ తెల్లవారుజామున నిందితులను ఎందుకు తీసికెళ్లాల్సి వచ్చింది? అక్కడ నిందితులు పోలీసులపై ఎలా తిరగబడ్డారు? ఆ తర్వాత పరిణామాలకు సంబంధించిన అన్ని అంశాలను నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది.



దిశ ఘటన నేపథ్యంలో సోమవారం పంజాబ్ లూధియానాలో హైదరాబాద్ పోలీసులకు మద్దతు తెలుపుతున్న అకాలీదళ్ నేత గురుదీప్‌సింగ్

**ముహూర్తం**

**సూర్యోదయం:** 6.38 గంటలకు

**సూర్యాస్తమయం:** 5.34 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం త్రయోదశి ఉదయం 10.44 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: కృత్తిక బుధవారం ఉదయం 5.58 వరకు, తదుపరి రోహిణి, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 2.50 నుంచి సాయంత్రం 4.11 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.49 నుంచి 9.33 వరకు, తిరిగి మధ్యాహ్నం 1.54 నుంచి 2.39 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.29 నుంచి రాత్రి 7.08 వరకు.

**లోకం పోకడ**



ఎన్ని బిందెలు పోయమంటారు? సారీ.. ఎన్ని లీటర్లు పోయమంటారు?

# ఎన్‌కౌంటర్ కేసు విచారణ వాయిదా

మొదటిపేజీ తరువాయి...

చట్టం చేసేవరకు ఆర్టికల్ 141 ప్రకారం సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను చట్టంలా అమలుచేయాల్సి ఉంటుందని గుర్తుచేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పోలీసులపై ఎఫ్‌ఐఆర్ నమోదుచేశారా? ఎప్పు డు నమోదుచేశారు? ఎఫ్‌ఐఆర్ కాపీ సమర్పించారా? అని ప్రశ్నించింది. అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టులో కూడా ఇదే అంశంపై పిల్స్ దాఖలయ్యాయని తెలిపారు. సుప్రీంకోర్టు కేసులను బుధవారానికి వాయిదా వేసినందున.. హైకోర్టు విచారణను గురువారానికి వాయిదావేయాలని, రాష్ట్రం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారని తెలిపారు. ఈ మేరకు ధర్మాసనం విచారణను బుధవారానికి వాయిదావేసింది. ఈ కేసులో హైకోర్టుకు సహాయం చేసేందుకు సీనియర్ న్యాయవాది డీ ప్రకాశ్‌రెడ్డిని అమికస్‌క్యూరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. 'పీయూసీఎల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలుచేసినట్లు ఆధారాలు సమర్పించాలని స్పష్టంచేసింది. మహబూబ్‌నగర్‌లో సరైన వసతులు లేకపోతే హైదరాబాద్ గాంధీ హాస్పిటల్‌కు నిందితుల మృతదేహాలను తరలించాలని, తరలింపులో మృతదేహాలు కుళ్లిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అడ్వకేట్ జనరల్‌కు సూచించింది. హైదరాబాద్‌కు తరలించే క్రమంలో ఏసీ అంబులెన్స్‌లను వినియోగించాలని ఆదేశించింది.

### న్యాయవాదుల మధ్య వాగ్వాదం

హైకోర్టులో దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై విచారణ తర్వాత హక్కుల కార్యకర్తల తరఫు న్యాయవాదులు.. ఎన్‌కౌంటర్‌ను సమర్థిస్తున్న న్యాయవాదుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా కేసు దాఖలుచేసిన న్యాయవాదులపై ఇతర న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసు వేయడానికి తమకు హక్కు ఉన్నదని, తమను ఎలా అడ్డుకుంటారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. ఇరువర్గాల మధ్య అరుపులు, కేకలు చోటుచేసుకోవడంతో.. కోర్టు అధికారులు వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు.

### సుప్రీంకోర్టు విచారణ బుధవారానికి వాయిదా

దిశ నిందితులను ఎన్‌కౌంటర్‌చేసిన పోలీసులపై సిట్ లేదా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ చేపట్టాలని దాఖలైన పిటిషన్లను బుధవారం విచారణకు స్వీకరిస్తామని సుప్రీంకోర్టు పేర్కొన్నది. సోమవారం విచారణ సందర్భంగా న్యాయవాదులు జీఎస్ మణి, ఎంఎల్ శర్మ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్‌ఏ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ఈ కేసులను ప్రస్తావించారు. వీటిని బుధవారం విచారణకు స్వీకరిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది.

## గాంధీ దవాఖానకు నిందితుల మృతదేహాలు



దిశ నిందితుల మృతదేహాలను గాంధీ దవాఖానకు తరలిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ క్రైం:** దిశ హత్య కేసులో నలుగురు నిందితుల మృతదేహాలను హైకోర్టు ఆదేశాల మేరకు హైదరాబాదులోని గాంధీ దవాఖానకు తరలించారు. మహబూబ్‌నగర్ దవాఖాన నుంచి సోమవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో జిల్లా ఎస్పీ రెమా రాజేశ్వరి పర్యవేక్షణలో ప్రత్యేక ఏసీ అంబులెన్స్‌లో పటిష్ట భద్రత నడుమ తరలించారు. మృతదేహాలను హైదరాబాద్‌కు తరలించే నేపథ్యంలో అవి పాడవకుండా వైద్యాధికారులు, పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు.

# హ్యాట్సాఫ్ టు కేసీఆర్

మొదటిపేజీ తరువాయి...

ఎన్‌కౌంటర్ జరిగిందని చెప్పారు. 'సినిమాల్లో హీరో ఇటువంటివారిని ఎన్‌కౌంటర్‌లో చంపితే మనం చప్పట్లు కొడుతాం. అదే నిజజీవితంలో ఎవరైనా దమ్మున్నోడు ఈ పనిచేస్తే ఢిల్లీ నుంచి మానవహక్కుల పేరుతో కొందరు దిగుతారు. ఇది తప్పు.. ఇలా జరుగకూడదు అంటారు. ఎందుకు ఇలాచేశారని ప్రశ్నిస్తారు' అని ఆయన విమర్శించారు. దిశవంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు అమలుచేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఇలాంటి ఘటనలు జరిగితే వారంలో విచారణ, రెండో వారంలో ట్రయల్, మూడో వారంలో శిక్షపడేలా ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఏపీ చట్టంలో మార్పులు తీసుకువస్తామని జగన్ ప్రకటించారు.

## ప్రవీణ్‌కు మరణశిక్ష తగ్గింపుపై సుప్రీంకు

- తొమ్మిదినెలల పాపపై లైంగికదాడి ఘటనలో వరంగల్ పోలీసుల కీలక నిర్ణయం

**వరంగల్ క్రైం:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన తొమ్మిది నెలల పాపపై లైంగికదాడి, హత్య కేసులో దోషి పోలెపాక ప్రవీణ్‌కు శిక్ష తగ్గింపును సవాలు చేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ వీ రవీందర్ నిర్ణయించారు. ఈ కేసులో ప్రవీణ్‌కు వరంగల్ ప్రత్యేక కోర్టు మరణశిక్ష విధించగా.. దానిని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. శిక్షను తగ్గించి.. యావజ్జీవ ఖైదుగా సవరించింది. దీనిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

## తెలంగాణలో పర్యావరణ పరిరక్షణ భేష్

అమెరికా ప్రభుత్వ ప్రతినిధి
సరా లిట్కే కితాబు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, ప్రత్యేకించి హరితహారం, అటవీ పునరుజ్జీవన కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని అమెరికా ప్రభుత్వ ప్రతినిధి, దక్షిణాసియా ప్రాంతీయ శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ, వైద్యాధికారి సరా లిట్కే ప్రశంసించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పర్యటిస్తున్న సరా నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సోమవారం అరణ్యభవన్‌లో పీసీసీఎఫ్ ఆర్‌శోభతో మర్యాదపూర్వకంగా సమావేశమైంది. పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషితో పాటు కంపా నిధులతో చేపట్టిన అటవీ పునరుజ్జీవన చర్యలు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధి, ప్రత్యామ్నాయ అడవుల పెంపకం గురించి శోభ ఈ సందర్భంగా వారికి వివరించారు. ఈ సమావేశంలో అటవీశాఖ ఉన్నతాధికారులు లోకేశ్‌జైస్వాల్, స్వర్గం శ్రీనివాస్, ఆర్‌ఎం డోబ్రియల్, ఎంసీ పర్గెయిన్, సునీతాభగవత్, అమెరికా కాన్సులేట్ ప్రతినిధి సిబాప్రసాదత్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.



దక్షిణాఫ్రికా సుందరి జోజిబిని టుంజీకి మిస్ యూనివర్స్ కిరీటాన్ని అలంకరిస్తున్న క్యాట్రియోనా గ్రే

## దక్షిణాఫ్రికా సుందరి మిస్ యూనివర్స్

జోజిబిని టుంజీని వరించిన కిరీటం

**అట్లాంటా, డిసెంబర్ 9:** దక్షిణాఫ్రికాకు చెందిన జోజిబిని టుంజీ (26) ఈ ఏడాది విశ్వసుందరి (మిస్ యూనివర్స్) కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. అమెరికాలోని జార్జియా రాష్ట్ర రాజధాని అట్లాంటాలో ఆదివారం రాత్రి నిర్వహించిన తుది పోటీల్లో టుంజీ విజేతగా నిలిచారు. ప్యూర్టో రికో సుందరి మ్యాడిసన్ అండర్సన్ రెండో స్థానంలో నిలువగా, మెక్సికో భామ ఆష్లే ఆల్విడ్రెజ్ మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. భారత్‌కు చెందిన (మిస్ ఇండియా) వర్తికా సింగ్ టాప్ 20లో కూడా చోటు దక్కించుకోలేకపోయారు. గతేడాది విశ్వసుందరిగా నిలిచిన ఫిలిప్పీన్స్ భామ క్యాట్రియోనా గ్రే.. టుంజీకి కిరీటాన్ని అలంకరించారు. తన విజయంపై టుంజీ ట్విట్టర్‌లో హర్షం వ్యక్తంచేశారు. 'ఈ రాత్రి ఒక ద్వారం తెరుచుకుంది. ఈ క్షణాన్ని దర్శించిన ప్రతి బాలిక కూడా తన కలలకు ఉన్న శక్తిని ఎప్పటికీ విశ్వసించొచ్చు. వారు నాలో తమను తాము చూసుకోవచ్చు. నేను విశ్వసుందరి–2019ని' అని టుంజీ ట్వీట్ చేశారు. కిరీటాన్ని ధరించిన ఫొటోను కూడా షేర్ చేశారు. టుంజీ స్వస్థలం దక్షిణాఫ్రికాలోని సోసో. లింగ వివక్షకు వ్యతిరేకంగా ఆమె పోరాటం చేస్తున్నారు. 'నేటితరం బాలికలకు మీరు చెప్పాలనుకుంటున్న ముఖ్యమైన సందేశం ఏమిటి?' అన్న చివరి ప్రశ్నకు టుంజీ ఇచ్చిన సమాధానమే ఆమెను విశ్వసుందరిగా నిలబెట్టింది. ఈసారి కొత్తగా ప్రతి ఒక్క పోటీదారుకు చివరి సందేశం ఇచ్చేందుకు అవకాశమిచ్చారు. 'నా లాంటి రంగు, చర్మం, జుట్టు కలిగిన మహిళను అందంగా పరిగణించని ప్రపంచంలో నేను పెరిగా. ఇక దీనికి ముగింపు పలికే సమయం ఇదేనని నేను భావిస్తున్నా. చిన్నారులు నావైపు చూడాలనుకుంటున్నా. నా ముఖాన్ని చూసి, నాలో ప్రతిబింబిస్తున్న వారి ముఖాలను చూడాలని కోరుకుంటున్నా' అని టుంజీ తన సందేశంలో పేర్కొన్నారు.





## మూగజీవాల తరలింపులో నిబంధనలు

- వాహనాల్లో ప్రత్యేక ఏర్పాట్లుచేయాలి
- ఇష్టానుసారంగా తీసుకెళ్తే కఠినచర్యలు
- ఆదేశాలు జారీ చేసిన రవాణాశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మూగజీవాల తరలింపునకు వినియోగించే వాహనాలకు నిబంధనలు విధిస్తూ రవాణాశాఖ ఆదేశాలు జారీచేసింది. వాహనాల్లో ఇరుకు ఇరుకుగా జీవాలను తరలిస్తే కేసు నమోదుచేయాలని నిర్ణయించింది. సోమవారం జిల్లాల రవాణాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా ఈ మేరకు ఆదేశాలిచ్చారు. రెండ్రోజుల్లో వాహనాల యజమానులు, అసోసియేషన్లతో సమావేశం ఏర్పాటుచేసి నిబంధనలు వివరించాలని సూచించారు. పదిరోజుల్లో నిబంధనలను అమలుచేయాలని స్పష్టంచేశారు. జీవాల శరీర పరిమాణం ప్రకారం వాహనాల్లో అవి తిరిగేంత ప్రదేశం, గాలి, ఆహారం తీసుకునేలా ఏర్పాట్లు ఉండాలి.. ఆ విధంగా లేకపోతే సదరు వాహనాల యజమానులపై చర్యలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయా రకాల జీవాలకు వినియోగించే వాహనాల కోసం పరిమాణాలను వివరించారు. ఆవులు, గేదెలు తరలించే వాహనాల పరిమాణంలో 2 స్క్వేర్ మీటర్లు (ఒక్కో జీవానికి) ఉండాలని సూచించారు. అదేవిధంగా గుర్రాలకు 2.25, మేకలు, గొర్రెలు 0.3, పందులకు 0.6 స్క్వేర్ మీటర్లు, కోళ్లకు 40 సెంటీమీటర్లతో ఉండాలని పేర్కొన్నారు. మూగ జీవాలను తరలించే వాహనాలను కేవలం వాటి కోసమే వినియోగించాలని, ఇతర వస్తువులు తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామని సూచించారు. ఇందుకోసం రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సైతం అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు సందీప్‌కుమార్ సుల్తానియా వివరించారు.

## నెలాఖరులోగా వర్సిటీలకు ఈసీలు, వీసీలు

కసరత్తు వేగవంతంచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు పాలకమండళ్లను ఏర్పాటుచేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రక్రియ వేగవంతమవడంతో సంబంధిత ఫైలు త్వరలోనే ఆమోదం పొందుతుందని, ఈ నెలాఖరు నాటికి ఈసీలతోపాటు వైస్‌చాన్సలర్ల నియామకం పూర్తవుతుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు భావిస్తున్నారు. ఉస్మానియా, మహాత్మాగాంధీ, పాలమూరు, తెలంగాణ, శాతవాహన, జేఎన్టీయూహెచ్, పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీతోపాటు ప్రత్యేక యూనివర్సిటీకి ఈసీలను, వీసీలను నియమించేందుకు విశ్వవిద్యాలయాలవారీగా ప్రముఖ వ్యక్తుల గుర్తింపు ప్రక్రియ చివరి దశకు చేరుకున్నట్టు తెలుస్తున్నది. ఈసీలు, వీసీల నియామకం పూర్తయిన తర్వాత వర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీచేయనున్నట్టు అధికారులు తెలిపారు.

# అభివృద్ధిని చూసి గర్వపడుతున్నా

- దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ
- ఆరోగ్య తెలంగాణకు సమిష్టిగా కృషిచేయాలి
- ఆరోగ్యశ్రీలో తలసేమియాను చేర్చడం హర్షణీయం
- యాదాద్రి ఆలయ నిర్మాణపనులు భేష్
- యాదాద్రి, వరంగల్ పర్యటనలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్





వరంగల్ నగరంలోని వేయి స్తంభాల గుడిని సందర్శించిన గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ దంపతులు.. భద్రకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న గవర్నర్



ఖిలా వరంగల్‌లో లేజర్ షోకు హాజరైన గవర్నర్ దంపతులకు నీటిలో తేలియాడే రామప్ప ఇటుకను చూపుతున్న ప్రొఫెసర్ పాండురంగారావు

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి/ వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ ఖిలావరంగల్/ రెడ్డికాలనీ(వరంగల్):** తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి గర్వపడుతున్నానని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. దేశంలోని అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తలసేమియా బాధితులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్యతెలంగాణ కోసం అందరూ సమిష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. మూడ్రోజుల రాష్ట్ర పర్యటనలో భాగం గా గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ సోమవారం యాదాద్రి భువనగిరి, వరంగల్ జిల్లాల్లో పర్యటించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి నేరుగా యాదాద్రికి చేరుకున్న గవర్నర్ దంపతులకు మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్ స్వాగతం పలికారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధానార్చకులు నల్లంతిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపూడి నర్సింహాచార్యులు ఆలయం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న అనంతరం ముఖమండపంలో ఆశీర్వచనం జరిపారు. ఆలయ ఈవో ఎన్ గీత గవర్నర్ దంపతులకు శ్రీవారి ప్రసాదం అందజేశారు. అనంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తున్నదని అన్నారు. 'ప్రౌడ్ ఆఫ్ తెలంగాణ డెవలప్‌మెంట్' అని వ్యాఖ్యానించారు. యాదాద్రి లక్ష్మీనరసింహుడు ఎంతో మహిమాన్వితుడని.. ఆలయ నిర్మాణ పనులు భేషుగ్గా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

### వరంగల్ నగరంలో పర్యటన

యాదాద్రి సందర్శన అనంతరం గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ చారిత్రక వరంగల్ నగరంలో పర్యటించారు. హరితకాకతీయ హోటల్‌కు చేరుకున్న గవర్నర్ దంపతులకు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ గుండా ప్రకాశ్‌రావు, ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అరూరి రమేశ్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ అర్బన్, రూరల్ కలెక్టర్లు ప్రశాంత్ జీవన్‌పాటిల్, హరిత తదితరులు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్.. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ అర్బన్‌శాఖ ఆధ్వర్యంలో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్‌లో బ్లడ్‌బ్యాంక్, తలసేమియా వ్యాధులకు మెరుగైన చికిత్స అందించడంతోపాటు తగినన్ని పరికరాలు, సౌకర్యాలు ఉండటం గొప్ప విషయమని చెప్పారు. జిల్లాలో తలసేమియా పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. రాష్ట్రప్రభుత్వం తలసేమియా వ్యాధిని ఆరోగ్యశ్రీ ఎంపానెల్‌మెంట్‌లో చేర్చడంపై హర్షం వ్యక్తంచేస్తూ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా తలసేమియా, బోన్‌మ్యారో చికిత్సకు అవకాశముందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం కాకతీయుల హయాంలో నిర్మించిన వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించిన గవర్నర్ తమిళిసైకి ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పాండురంగారావు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆలయ ఈవో పీ వేణుగోపాల్ స్వామివారి చిత్రపటాన్ని గవర్నర్ దంపతులకు అందజేశారు. ఈ నెల 15 నుంచి వరంగల్‌లో నిర్వహించే అతిరుద్ర యాగానికి రావాల్సిందిగా నిర్వాహకులు ఆహ్వానించారు. వేయిస్తంభాలగుడి ప్రాశస్త్యాన్ని వివరిస్తున్న క్రమంలో.. ఇక్కడి శిల్పాలు చాలా అద్భుతంగా ఉన్నాయని గవర్నర్ తెలిపారు. ఆలయ ప్రదక్షిణ పదంపై ప్రత్యేకంగా, నందీశ్వరుని సన్నిధిలో అధికారులతో, పాత్రికేయులతో ఫొటోలు దిగారు. అనంతరం ఖిలావరంగల్‌లో ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్స్‌షోను వీక్షించారు. వీరోచిత పోరాటాలు..ఆటలు.. పాటలు.. విజయోత్సవ సంబురాలు తదితర ఘట్టాలను రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో వీక్షించారు. అనంతరం నీటిలో తేలియాడే ఇటుకను పట్టుకున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు.

### నేడు భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో పర్యటన

**జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ మంగళవారం జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 9.15 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చేరుకొని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన లక్ష్మీబరాజ్, సరస్వతి బరాజ్, కన్నెపల్లి పంపుహౌజ్‌లను సందర్శిస్తారు. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. అంతకుముందు కాటారం మండలం బోడగూడెంలో ఆదివాసీలతో ముఖాముఖిలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు పెద్దపల్లి జిల్లా రామగుండం చేరుకొని.. రాత్రికి ఎన్టీపీసీ గెస్ట్‌హౌస్‌లో బసచేస్తారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ శ్రీదేవసేన పరిశీలించారు.



ప్రగతిభవన్‌లో తనను కలిసిన సౌదీ అరేబియా రాయబారి సౌద్ బిన్ మహ్మద్ అల్ సతికి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో హోంమంత్రి మహమూద్‌అలీ కూడా ఉన్నారు.

## ఐదేండ్లలో అద్భుత ప్రగతి

- సౌదీ రాయబారికి వివరించిన మంత్రి కేటీఆర్
- సౌదీ అరేబియా పారిశ్రామికవర్గాల్లో తెలంగాణను ప్రస్తావించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రం గత ఐదేండ్లలో అద్భుత ప్రగతిని సాధించిందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. సోమవారం సౌదీ అరేబియా రాయబారి సౌద్ బిన్ మహ్మద్ అల్ సతి ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్ ఐపాస్ విధానం ద్వారా ఇప్పటికే ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడంలో విజయం సాధించిందని తెలిపారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు సౌదీ అరేబియా పారిశ్రామికవర్గాల్లో తెలంగాణ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలని విజ్ఞప్తిచేశారు. ఇందుకోసం అవసరమైతే సౌదీలో పర్యటిస్తామని చెప్పారు. ఈ విషయంలో సహకరించాలని సౌదీ రాయబారిని కోరారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్లలో తెలంగాణ అగ్రస్థానంలో కొనసాగుతూ వస్తున్నదని, జీవించడానికి భారతదేశంలో ఉన్న అత్యుత్తమ నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉన్నదని మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో సౌదీ కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. సమావేశంలో హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్‌అలీ, ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ పాల్గొన్నారు.

# రాజధానిలో డబుల్‌డెక్కర్ ఫ్లైఓవర్లు

- భవిష్యత్ అవసరాల కోసం నాగ్‌పూర్ మాదిరి వంతెనలు
- నాసిక్ తరహా ద్వితీయ శ్రేణి నగరాల్లో మెట్రోనియో
- మహామెట్రో సంస్థ ప్రతిపాదనలపై అధ్యయం చేయండి
- మెట్రో, జీహెచ్‌ఎంసీ అధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశం
- మంత్రితో మహామెట్రో సంస్థ ప్రతినిధుల భేటీ



మహామెట్రో సంస్థ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మహామెట్రో ఎండీ బ్రిజేశదీక్షిత్, మేయర్ బొంతు రామ్మోహన్, ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్, ఎన్వీఎస్ రెడ్డి ఉన్నారు.

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తక్కువ ఖర్చుతో కూడిన మెట్రోనియో లాంటి ప్రతిపాదనలు తెలంగాణలోని ద్వితీయశ్రేణి నగరాలకు అనుగుణంగా ఉంటాయని, నాగ్‌పూర్‌లో మెట్రో, రోడ్డు మార్గాలకోసం డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ల నిర్మాణం చేస్తున్నందున, హైదరాబాద్‌లోనూ ఇలాంటి అంశాన్ని పరిశీలించాలని ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు.. మెట్రో, జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. మహారాష్ట్రలోని పలు నగరాల్లో మెట్రో ఏర్పాటు బాధ్యతలు చేపట్టిన మహామెట్రో సంస్థ అధికారులతో మంత్రి కేటీఆర్ సోమవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. మహారాష్ట్ర నాసిక్, పుణె, నాగ్‌పూర్ వంటి నగరాల్లో మెట్రోను తామే ఏర్పాటుచేస్తున్నామని, ఇందుకు సంబంధించిన వివరాలతో మహామెట్రో అధికారులు సమగ్ర ప్రజంటేషన్ ద్వారా కేటీఆర్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న మెట్రో వ్యవస్థకు కొంత భిన్నంగా, అతి తక్కువ ఖర్చుతో 'మెట్రో నియో' పేరుతో నాసిక్‌లో చేపడుతున్న ప్రాజెక్టు వివరాలను అందించారు. ప్రస్తుతం తాము సిద్ధంచేస్తున్న ఈ ప్రతిపాదనలతో ప్రాజెక్టు వ్యయం గణనీయంగా తగ్గుతుందని, స్వల్పకాలంలోనే ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. సంప్రదాయ మెట్రోలో రైల్వే కోచ్‌లు ఉపయోగిస్తుండగా, ప్రస్తుతం తాము ప్రతిపాదించిన మెట్రోలో ఎలక్ట్రిక్ బస్సు కోచ్‌లను ఉపయోగించనున్నట్టు వెల్లడించారు. ఎలివేటెడ్ కారిడార్లతోపాటు ఇప్పుడున్న రోడ్లపై కూడా ఈ మెట్రో నడుస్తుందని చెప్పారు. 350 నుంచి 400 మంది ఒకేసారి ప్రయాణించేసేందుకు వీలు కలుగుతుందన్నారు. నాసిక్‌లో తమ ప్రతిపాదనల్లో ప్రతి 10 నిమిషాలకు ఒక మెట్రోరైలు వచ్చేందుకు అవకాశం ఉన్నదని, రెండు నిమిషాలకు ఒకటి వచ్చేలా చేసేందుకు కూడా వీలున్నదని తెలిపారు. ప్రస్తుతం తాము నిర్మిస్తున్న ఎలివేటెడ్ ఫ్లైఓవర్‌ను పట్టణ అవసరాలు, ప్రయాణికుల రద్దీ పెరిగితే భవిష్యత్ దీనిని సాధారణ మెట్రోమార్గంగా మార్చుకొనేందుకు కూడా వీలుండేలా తమ ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. నాసిక్ మెట్రో కోసం సిద్ధంచేసిన ప్రతిపాదనలతోపాటు వాటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక వనరుల వివరాలను కూడా వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి సుమారు 25శాతం నిధులు అందే అవకాశం ఉన్నదని చెప్పారు.

### మహామెట్రో సంస్థతో కలిసి పనిచేయండి

మహామెట్రో అధికారులు అందించిన ప్రజంటేషన్‌పై హర్షం వ్యక్తంచేసిన మంత్రి కేటీఆర్.. ఈ మధ్య కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిని కలిసినప్పుడు 'కేంద్రం ద్వితీయ శ్రేణి పట్టణాలకు మెట్రోలైట్, మెట్రోనియా వంటి ప్రతిపాదనలకు సహాయం అందించేందుకు సుముఖంగా ఉన్నది' అని తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో కూడిన మెట్రోనియో లాంటి ప్రతిపాదనలు తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలకు అనుగుణంగా ఉంటాయని మంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేయాలనుకుంటున్న ఎలివేటెడ్, బీఆర్టీఎస్ (బస్ రాపిడ్ ట్రాసిట్ సిస్టమ్) ప్రతిపాదన రూపకల్పనలో మహామెట్రో సంస్థ అధికారులతో కలిసి పనిచేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. మహామెట్రో సంస్థ పాటిస్తున్న 100శాతం లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పద్ధతులు, మెట్రో స్టేషన్లపైన సోలార్ విద్యుత్ ఉత్పాదన, తక్కువ భూసేకరణ ఖర్చు వంటి అంశాలను ఈ ప్రతిపాదనల్లో పరిశీలించాలని చెప్పారు. పశ్చిమ హైదరాబాద్‌లోని జనసాంద్రత కలిగిన ప్రాంతాల్లోనూ ఎలివేటెడ్, ఎలక్ట్రిక్ బీఆర్టీఎస్ కోసం ప్రయత్నాలుచేస్తున్న నేపథ్యంలో ఇదే పద్ధతిలో నాసిక్‌లో ఏర్పాటుచేస్తున్న మెట్రోనియోను అధ్యయనంచేయాలని మెట్రో రైల్ సంస్థను ఆదేశించారు. సమగ్ర ప్రతిపాదనలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని కోరారు. దీంతోపాటు నగరంలో ఉన్న ఆర్టీసీ, మెట్రో, ఎంఎంటీఎస్, భవిష్యత్‌లో రానున్న మెట్రో రెండో దశ మార్గాలు, ఇంటర్ సిటీ బస్ టెర్మినళ్లను, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలను కలిపేందుకు ఉన్న అవకాశాలను, మార్గాలను అధ్యయనంచేయాలని అధికారులను కోరారు. హైదరాబాద్‌లోనూ భవిష్యత్ అవసరాల కోసం నాగ్‌పూర్ మాదిరి డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చెప్పారు. దీని వల్ల భూసేకరణ ఖర్చు తగ్గుతుందని, భవిష్యత్‌లో మెట్రో మార్గాల ఏర్పాటు సులభమవుతుందన్నారు. ఈ సమావేశంలో మహామెట్రో ఎండీ బ్రిజేశ్ దీక్షిత్, సంస్థ ప్రతినిధులు, హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భారత ప్రభుత్వం
కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ
పోస్టల్ విభాగం . పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్
పబ్లిక్ నోటిఫికేషన్
Lapsed PLI / RPLI పాలసీల విధానాల పునరుద్ధరణ
తపాలా జీవిత భీమా Lapsed పాలసీల రివైవల్ గురించి

భారత ప్రభుత్వ తపాలా శాఖ వారు అందించే పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మరియు రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ వినియోగదారులకు తెలియజేయునది ఏమనగా సవరించబడిన తపాలా జీవిత భీమా నియమనిబంధనలు మరియు షరతులకు లోబడి తపాలా జీవిత భీమా / గ్రామీణ తపాలా జీవిత భీమా పాలసీలు చివరి ప్రీమియం చెల్లించిన నెల నుండి ఐదు సంవత్సరములు దాటిన పాలసీలను 01.01.2020 తేదీ నుండి తిరిగి పునరుద్ధరించబడవు. చివరి ప్రీమియం చెల్లించిన నెల నుండి ఐదు సంవత్సరాలు పూర్తయిన పాలసీలను సరైన ఆరోగ్య ధ్రువీకరణ పత్రముతో తిరిగి పునరుద్ధరించుకొనుటకు 31.12.2019 తేదీ వరకు మరొక అవకాశము ఇవ్వడమైనది. PLI / RPLI పాలసీదారులు భీమా ప్రయోజనాలు పొందదానికి వెంటనే మీ దగ్గరలో ఉన్న ఏదైనా తపాలా కార్యాలయములో పునరుద్ధరించుకోగలరు (రివైవల్), లేనిచో అర్హతలేని (Lapse అయిన) పాలసీలను 31.12.2019 తరువాత ఎటువంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా తొలగించ బడును . పూర్తి వివరములకై మీ దగ్గరలోని ఏదేని తపాలా కార్యాలయాన్ని సంప్రదించగలరు . ఈ సదావకాశమును PLI మరియు RPLI పాలసీదారులు వినియోగించుకోగలరు.

గమనిక: తేదీ 31.12.2019 మరియు తదుపరి నిలిపివేసిన పాలసీలు తిరిగి పునరిద్ధరించబడవు సరిగదా నియమ నిభందనలననుసరించి పూర్తిగా రద్దయిన పాలసీలుగా పరిగణించబడును.

Sd/-
చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్,
తెలంగాణ సర్కిల్, హైదరాబాద్– 500 001.


## విద్యుత్ ఉద్యోగాల పరీక్షకు ఏర్పాట్లు

15, 22న రాత పరీక్షలు..

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** టీఎస్ఎస్పీడీసీఎల్ పరిధిలో పలు ఉద్యోగాల భర్తీకి నిర్వహించే రాత పరీక్షలకు సర్వం సిద్ధమైంది. 3,025 ఉద్యోగాలను భర్తీచేసేందుకు నోటిఫికేషన్ జారీకాగా, ఈ నెల 15, 22 తేదీల్లో రాత పరీక్షలు నిర్వహించనున్నారు. జూనియర్ లైన్‌మెన్, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ దరఖాస్తుదారులకు ఈ నెల 15న, జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ దరఖాస్తుదారులకు 22వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తారు. 15న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు జూనియర్ లైన్‌మెన్ అభ్యర్థులకు, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 గంటలవరకు పరీక్ష జరుగుతుంది. జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ అభ్యర్థులకు 22న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఉస్మానియా వర్సిటీకి అప్పగించగా కేంద్రాలను గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఏర్పాటుచేస్తున్నారు.

# 'సమత'కు సత్వర న్యాయం

- ఆసిఫాబాద్ హత్యాచార బాధితురాలి పేరు మార్పు
- కేసు విచారణ కోసం త్వరలోనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు
- బాధితురాలి కుటుంబానికి రూ.4.12 లక్షల ఆర్థికసాయం
- ఆమె భర్తకు ఉద్యోగం, పింఛన్, డబుల్‌బెడ్‌రూం ఇల్లు





నిందితులను మీడియాకు చూపుతున్న పోలీసులు (ఫైల్) .. ఎస్పీ మల్లారెడ్డి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో ఇటీవల లైంగికదాడి, హత్యకు గురైన మహిళ పేరును సమతగా మార్చినట్టు జిల్లా ఎస్పీ మల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై మీడియాలో ఆ పేరుతోనే పేర్కొనాలని సూచించారు. లింగాపూర్ మండలం ఎల్లాపటార్ గ్రామ శివారులో గత నెల 24వ తేదీన జరిగిన ఈ కేసుకు సంబంధించిన ముగ్గురు నిందితులను వెంటనే అరెస్టుచేసి, అన్ని సాక్ష్యాధారాలను సేకరించినట్టు తెలిపారు. నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఫోరెన్సిక్ నివేదిక రాగానే కోర్టులో చార్జిషీట్ దాఖలుచేస్తామన్నారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా కలెక్టర్ పంపిన నివేదిక ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని, ఒకట్రెండురోజుల్లో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ఆదేశాలు వెలువడే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

### మూడ్రోజుల్లోనే నిందితుల అరెస్టు

దళిత మహిళ సమత గత నెల 24వ తేదీన బుగ్గలను అమ్ముకునేందుకు ఎల్లాపటార్‌కు వెళ్తుండగా మార్గమధ్యంలో ముగ్గురు దుండగులు అడవిలోకి లాక్కెళ్లి లైంగికదాడి చేశారు. అనంతరం కత్తితో ఆమె గొంతుకోసి హత్యచేశారు. అదేరోజు రాత్రి లింగాపూర్ ఠాణాలో ఆమె భర్త చేసిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసిన పోలీసులు.. మురుసటిరోజు ఉదయం రామునాక్‌తండా సమీపంలోని అటవీప్రాంతంలో సమత మృతదేహాన్ని గుర్తించారు. ఆమెపై లైంగికదాడి జరిపి, హత్య చేసినట్టుగా నిర్ధారించారు. కేసు విచారణను పకడ్బందీగా చేపట్టిన పోలీసులు మూడు రోజుల్లోనే ముగ్గురు నిందితులు షేక్ బాబు, షేక్ షాబొద్దీన్, షేక్ మక్లును 28వ తేదీన అరెస్టుచేశారు.

### బాధిత కుటుంబానికి అండ

అత్యంత పాశవికంగా లైంగికదాడి, హత్యకు గురైన సమత కేసులో నేరస్థులకు త్వరగా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్న పోలీసులు.. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకునేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే బాధిత కుటుంబానికి రూ.4.12 లక్షల ఆర్థిక సాయం అందించారు. చార్జిషీట్ దాఖలుకాగానే మరి కొంత ఆర్థికసాయం అందించనున్నట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. సమత ఇద్దరి పిల్లలను స్థానిక సాంఘిక, సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నారు. మృతురాలి భర్తకు ఉద్యోగం, పింఛన్, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



కర్ణాటక ప్రజల తీర్పును కాంగ్రెస్ పార్టీ దొడ్డిదారిన దొంగిలించడానికి ప్రయత్నించింది. కానీ ప్రజలు ఇప్పుడు ఆ పార్టీకి గుణపాఠం చెప్పారు. రాజకీయ స్థిరత్వం కోసం దేశ ప్రజలు బీజేపీని ఎంతగా విశ్వసిస్తున్నరో ఈ ఫలితాలే ఉదాహరణ.

**నరేంద్ర మోదీ, ప్రధాని**

బీజేపీ ప్రభుత్వం వాళ్ల ‘ధనిక స్నేహితుల’ 5.5 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసింది. ఆరు ఎయిపోర్టులను వాళ్ల ధనిక మిత్రులకు ఇచ్చింది. కానీ పాఠశాల విద్యకు మాత్రం మూడు వేల కోట్ల కోత విధించింది. దీని అర్థం పెద్దవాళ్లు రసగుల్ల తింటారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు మధ్యాహ్న భోజనంలో రొట్టె, ఉప్పు తింటారు.

**ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి**



**చరిత్రలో నేడు**



**1799**

ఫ్రాన్స్‌లో మెట్రిక్ సిస్టంను ప్రవేశపెట్టిన ఫ్రాన్స్.

**1898**

ప్యారిస్ ఒప్పందంతో స్పానిష్- అమెరికా యుద్ధం ముగింపు. ఫిలిపీన్స్, పోర్టో రికో, గువామ్‌ను స్వాధీనం చేసుకున్న అమెరికా.






**1964**

ఓస్లోలో డాక్టర్ మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్‌కు నోబెల్ శాంతి బహుమతి బహూకరణ.

కాఠ్మండులో నగరీకరణ పెరిగే కొద్దీ నిర్మాణం రంగం వృద్ధి చెందుతున్నది. దీనివల్ల ఇటుకలు, ఇతర నిర్మాణ సామాగ్రి తయారీ వల్ల కాలుష్యం భరించ రానిదిగా తయారైంది. అనేకమందికి శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి. ఇటుకల తయారీ కార్మికుల ఆరోగ్యం కూడా దెబ్బ తింటున్నది. ఇటుకల తయారీలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం వచ్చింది. వెర్టికల్ షిఫ్ట్ బ్రిక్ కిల్న్, టనెల్ కిల్న్, హైబ్రిడ్ హాఫ్‌మన్ కిల్న్ వంటి కొత్త విధానాలు పర్యావరణప రంగా స్వచ్ఛమైనవి. 32 శాతం ఇంధనం ఆదా అవుతుంది.

**ది హిమాలయన్ టైమ్స్**

బంగ్లాదేశ్‌లోని సిల్హెట్‌లోని ఉపజిల్లాల్లో బండలను పగులగొడుతున్న తీరు ఆందోళనకరంగా ఉన్నది. ఇక్కడ నడుస్తున్న వేలాది స్టోన్ క్రషన్లన్నీ అనుమతి లేనివే. హైకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వం చర్య తీసుకోవడం లేదు. ప్రభుత్వ అనుమతి లేకుండా సుర్మా నదీతీరమంతా విధ్వంసం సాగడం సాధ్యమా? అక్రమంగా బండలు పగులగొట్టడాన్ని అరికట్టాలె. పర్యావరణ సమస్య తలెత్తకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలె. నదీ తీరాల సహజత్వాన్ని, పచ్చదనాన్ని దెబ్బ కొట్టడం అంటే ప్రజల ప్రాణాలను హరించడమే.

**ది డైలీ స్టార్**



# అగ్నిప్రమాదం

ఢిల్లీ ఉత్తర ప్రాంతంలో ఆదివారం జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో నలభై మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. 1997లో ఇదే ఢిల్లీ నగరంలో ఉపాహార్ ప్రమాదంలో 59 మంది మరణించగా, మరో వందమంది గాయపడ్డారు. ఆ తర్వాత ఇది మరో భారీ ప్రమాదం. నాలుగు అంతస్తుల భవనంలో బ్యాగులు తదితర సామాగ్రిని తయారుచేసే చోటు కనుక బట్టలు, ప్యాకేజింగ్ వస్తువులు ఇతర సామాగ్రి కుప్పలు కుప్పలుగా ఉన్నది. ఈ వస్తువులన్నీ అంటుకోగానే మండే రకం కనుక ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉన్నది. ఇందులో పడుకున్నవారంతా రోజంతా పనిచేసి అలసిపోయి గాఢనిద్రలో ఉన్నారు. మంటల వల్లనే కాకుండా పొగ వల్ల ఊపిరాడక మరణించినవారు ఎక్కువగానే ఉన్నారు. అగ్నిప్రమాద సమాచారం అందిన వెంటనే మంటలార్పే సిబ్బంది వెంటనే రంగప్రవేశం చేసినట్టు తెలుస్తున్నది. దాదాపు ముప్పై మంటలార్పే వాహనాలతో 150 మంది సిబ్బంది మంటలను అదుపులోకి తేవడంతో పాటు పలువురిని బయటకు తీయగలిగారు. కానీ ఈ ఫ్యాక్టరీ ఉన్న సందు ఇరుకుగా ఉండటం వల్ల సహాయ చర్యలకు ఇబ్బందులు ఏర్పడినట్టు తెలుస్తున్నది. మరణించిన వారిలో పలువురు బాల కార్మికులు కూడా ఉండటం మనసును మరింత కలిచివేసేదిగా ఉన్నది. ఈ అగ్ని ప్రమాదానికి అనేక కారణాలు దోహదపడ్డాయని ఈ విషాదాన్ని గమనిస్తే అర్థమవుతుంది.

**నగరాలలో ఇరుకు సందుల సమస్యపై చర్చించరెందుకు? ఒక పార్టీ పరిష్కరించబోతే మరో పార్టీ ఆందోళనలతో అడ్డుపుల్ల వేస్తుంది. బతుకుదెరువు కోసం పొట్ట చేతిలో పట్టుకొని నగరానికి వచ్చిన పేద పిల్లల పరిస్థితి ఎంత విషాదకరంగా ఉన్నదో ఈ దుర్ఘటన ద్వారా మరోసారి వెల్లడైంది. రాజధాని ఢిల్లీలోనే బాల కార్మికులను పనిలో పెట్టుకుంటుంటే ఆయా ప్రాంతాలలోని రాజకీయపక్షాలు ఏమి చేస్తున్నట్టు? సమాజంలో ఏమి జరుగుతున్నదో ఈ నాయకులకు తెలువదా? ఫ్యాక్టరీ యజమానుల ప్రలోభాలకు అధికార యంత్రాంగం, రాజకీయపక్షాలు లోనవుతున్నాయనే అనిపిస్తున్నది.**

రాజధాని ఢిల్లీలో జరిగిన ఈ విషాదం పట్ల రాజకీయపక్షాలు రివాజుగా స్పందించిన తీరు ఆశ్చర్యాన్ని బాధను కలిగిస్తున్నది. ఢిల్లీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ. అందువల్ల బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు విమర్శించడానికి ఒక విషాదం అందివచ్చింది. 1997 ఉపాహార్ విషాదం నుంచి ఆప్ సర్కారు గుణపాఠం నేర్చుకోలేదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. అక్రమంగా అనేక భవనాల్లో వేలాది కర్మాగారాలు నడవడమనే అవినీతి వ్యవహారంపై దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేసింది. ఇంత పెద్ద విషాదం జరిగిన తర్వాత సీఎం కేజ్రీవాల్ మరో కార్యక్రమానికి వెళ్లడం ఏమిటని బీజేపీ తప్పుబట్టింది. ప్రతిపక్షాలు కనుక చీమ కుట్టినా ప్రభుత్వాన్ని తప్పు పట్టాలనే మూస ధోరణి ఇది. ప్రమాదంలో ప్రభుత్వం బాధ్యత ఎంతనేది తెలిసి కూడా ఆరోపణలు కుమ్మరించడం వల్ల ప్రయోజనం ఏమిటి? రాజకీయపక్షాలు విషాదాన్ని రాజకీయంగా సొమ్ము చేసుకోవాలనే నీచమైన సంస్కృతి నుంచి బయటపడితే బాగుండు. విషాదం జరిగిన పరిస్థితిని అన్ని కోణాల్లో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలె. ఢిల్లీ రాష్ట్రాన్ని గతంలో కాంగ్రెస్ పాలించింది. బీజేపీకి కూడా ఢిల్లీని పాలించిన చరిత్ర ఉన్నది. ఆప్ సర్కార్ వచ్చిన తర్వాత పరిస్థితి మారకపోవచ్చు. కానీ ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులు ఈ రెండు పార్టీల కాలం నుంచీ అనేక భవనాల్లో ఉన్నవే. ప్రమాదం జరిగిన భవనం మృత్యుకుహరం మాదిరిగా ఉన్నది. కింది అంతస్తులో బొమ్మల ఫ్యాక్టరీ ఉంటే, పై అంతస్తులో బ్యాగులు తయారవుతున్నాయి. అన్నీ మంటలకు సులభంగా ఆహుతయ్యేవే. లోపల గాలి వెలుతురు వచ్చే ఏర్పాట్లు లేవు. ప్రమాదం జరిగితే దిగడానికి ఉండే రెండు మెట్ల దారుల్లో ఒకటి సామానులతో నిండిపోయి ఉన్నది. ఇంత ప్రమాదకర పరిస్థితుల్లో ఫ్యాక్టరీలు నడుస్తుంటే వచ్చి చూసిన వారు లేరు, అడిగిన వారూ లేరు.

ఏ రాజకీయ పక్షం అధికారంలో ఉన్నా ఢిల్లీలో నివాస భవనాల్లో అనుమతులు లేకుండా అనేక ఫ్యాక్టరీలు నడుస్తున్నాయనేది బహిరంగ రహస్యం. ఒక్క ఢిల్లీలోనే కాదు దేశవ్యాప్తంగా నగరాల్లో ఇదే పరిస్థితి ఉన్నది. ముంబయి గురించి అయితే ఇక చెప్పనవసరం లేదు. ఈ విషాదం సందర్భంగానైనా వీటిపై చర్చ జరుపకూడదా ఇరుకు సందుల్లో, కిక్కిరిసిన భవనాల్లో నడపవలసి రావడానికి కారణాలు ఏమిటి, పరిష్కారాలు ఏమిటి? తక్కువ వేతనాలతో ఎందుకు నెట్టుకు వస్తున్నాయి? లాభాల కోసం కక్కుర్తి పడుతున్నారా, లేక గిట్టుబాటు కావడం లేదా? ఈ పరిస్థితిని మార్చాలంటే నిబంధనలను కఠినంగా అమలుచేయడం ఒక్కటే మార్గమా, ప్రోత్సాహకాలు ఇవ్వాలా? ఆయా ఫ్యాక్టరీలను ఇతరచోట్లకు తరలించడానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పరిస్థితులు మార్చవచ్చా? ఇవన్నీ రాజకీయపక్షాలు ఆలోచించకూడదా? నగరాలలో ఇరుకు సందుల సమస్యపై చర్చించరెందుకు? ఒక పార్టీ పరిష్కరించబోతే మరో పార్టీ ఆందోళనలతో అడ్డుపుల్ల వేస్తుంది. బతుకుదెరువు కోసం పొట్ట చేతిలో పట్టుకొని నగరానికి వచ్చిన పేద పిల్లల పరిస్థితి ఎంత విషాదకరంగా ఉన్నదో ఈ దుర్ఘటన ద్వారా మరోసారి వెల్లడైంది. రాజధాని ఢిల్లీలోనే బాల కార్మికులను పనిలో పెట్టుకుంటుంటే ఆయా ప్రాంతాలలోని రాజకీయపక్షాలు ఏమి చేస్తున్నట్టు? సమాజంలో ఏమి జరుగుతున్నదో ఈ నాయకులకు తెలువదా? ఫ్యాక్టరీ యజమానుల ప్రలోభాలకు అధికార యంత్రాంగం, రాజకీయపక్షాలు లోనవుతున్నాయనే అనిపిస్తున్నది. ఢిల్లీలో అధికారాలన్నీ తమకే ఉండాలంటున్న కేంద్ర ప్రభుత్వం, ఐదేండ్లుగా పాలిస్తున్న ఆప్ సర్కారు, అనేక పర్యాయాలు అధికారానికి వచ్చి, ఇప్పుడు అస్తిత్వం కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీ అన్నీ బాధ్యతాయుతంగా వ్యవహరించడం నేర్చుకోవాలె. విషాదాన్ని సొమ్ముచేసుకోవడం కాదు, పరిష్కారాలు అన్వేషించాలె.

**జనగళం**

## జాతీయ సదస్సు

హైదరాబాద్‌లోని సురభారతి, ఉస్మానియా యూనివర్సిటీలో డిసెంబర్ 10, 11 తేదీలలో మూసీ సాహిత్య ధార, తెలంగాణ అకాడమి సంయుక్త నిర్వహణలో బి.ఎస్.శాస్త్రి సాహిత్యం–సమాలోచనం జాతీయ సదస్సు జరుగనున్నది. ప్రారంభ సమావేశంతో పాటు మొత్తం ఆరు సమావేశాల్లో ఈ సదస్సు జరుగనున్నది. ప్రారంభ సమావేశానికి సభాధ్యక్షులుగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి వ్యవహరిస్తుండగా ముఖ్య అతిథిగా డాక్టర్ నందిని సిధారెడ్డి , ఆత్మీయ అతిథిగా దేశపతి శ్రీనివాస్, గౌరవ అతిథిగా డాక్టర్ రాపాక ఏకాంబరాచార్యులు, డాక్టర్ సాగి కమలాకరశర్మ, టి.లక్ష్మీనారాయణతో పాటు తదితరులు పాల్గొననున్నారు. ఈ ప్రారంభసభలో శిలాక్షరం గ్రంథం ఆవిష్కారం కానున్నది.

**- ఎ.శ్రీనాథ్**


## సరైన న్యాయం

ఉత్తరప్రదేశ్‌లో ‘ఉన్నావ్’ బాధితురాలు మృతిచెందింది. మార్చిలో ఆమె ‘లైంగికదాడికి’ గురైందామె. న్యాయం కోసం పోరాడుతుందని ఆమెకు దుండగులు నిప్పంటించారు. తీవ్ర గాయాలతో ఆమె పరిస్థితి విషమించి దవాఖానలో మృతిచెందింది. మరోవైపు ‘దిశ’ కేసు దేశవ్యాప్తంగా సంచలనం అవుతున్న క్రమంలోనే ‘ఉన్నావ్’ బాధితురాలిపై దాడిచేయడం మరింత కలచివేస్తున్నది. నిజానికి ఇలాంటి కేసుల్లో కేసు నిష్పక్షపాతంగా జరుగాల్సిన అవసరం ఉంది. అధికారుల జాప్యం, రాజకీయ నాయకులు పాత్ర, నాయకులే నిందితులుగా, నేరస్థులుగా ఉన్నప్పుడు పారదర్శకమైన న్యాయాన్ని ఆశించలేం. కాబట్టి ఇలాంటి వైరుధ్యమైన ఘటనలను చూడాల్సి వస్తుంది. ఈ ఘటనలను జరుగకుండా చూడడానికి కఠిన శిక్షలు, సత్వర న్యాయాలు మాత్రమే సరిపోవు. సుదీర్ఘమైన పరిష్కారాలను కనుక్కోవడం ముఖ్యం. మన దేశాన్ని తల్లిగా భావించే ఈ నేల మీదే రోజు రోజుకూ మహిళలపై అకృత్యాలు జరుగుతున్నాయి. కేసుల్లో జాప్యం జరుగుతున్నది. నేటికీ బాధితులకు సరైన న్యాయం జరుగడం లేదు. ఇట్లా అకృత్యాలతో స్త్రీ బాధితురాలిని చేయడమే తప్పు. ఆ బాధితురాలికి సరైన న్యాయం చేకూరకపోవడం బాధాకరం. కారకులైన వారికి వత్తాసు పలుకడం శోచనీయం.

**- శంకర్ అలాల, మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా**


**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118


**ఆర్థికం**



**దేవ్ కర్**

# సుస్థిరాభివృద్ధికి అవినీతి గండం

అభివృద్ధి ప్రజలందరికీ చేరలేదు. పైనున్న ఒక్క శాతం ప్రజలు జాతీయ సంపదలో 22 శాతం ఆర్జిస్తున్నారు. పైనున్న 10 శాతం, 56 శాతం సంపన్నులు అభివృద్ధి ఫలాలు అందుకుంటున్నారు. ఈ ఆర్థికాభివృద్ధి గనుక సమ్మిళితమైనది అయినట్టయితే ఆదాయాలు, అవకాశాలు అన్నివర్గాల వారికి పంపిణీ అయ్యేవి. దీనివల్ల ఆర్థిక అసమానతలు తగ్గిపోయేవి. సమ్మిళిత వృద్ధి సాధించడం ఆర్థికాభివృద్ధి సాధించినంత సులభం కాదు.

రఘురాం రాజన్, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా పదవీ విరమణ పొందుతున్న తరుణంలో కరణ్ థాపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత్, సుస్థిర వృద్ధి బాటలో ఉన్నదని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇది మరీ తొందరపాటు వ్యాఖ్య. కానీ రెండేండ్ల తరువాత 2018–19 మొద టి త్రైమాసికం నాటికి మన దేశ ఆర్థిక వ్యవస్థలోని బలహీనతలు బయటపడ్డాయి. గత ఆరు త్రైమాసికాలుగా జీడీపీ వృద్ధి దిగజారుతూనే ఉన్నది. 2019–20 రెండో త్రైమాసికం నాటికి 4.5 శాతానికి దిగజారింది. ఈ పతనం ఇక్కడితో ఆగుతున్న సూచనలు లేవు. ఒక వంతెన నిర్మాణా న్ని పరిశీలించిన ఇంజినీర్లు నిర్మాణపరంగా బలహీనంగా ఉన్నదని, భద్రతలేదని చెప్పగలరు. కానీ అది ఎప్పుడు కూలిపోతుందో చెప్పలేరు. ఇదేవిధంగా ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలోని ఉన్న బలహీనతలను విశ్లేషకులు వెల్లడించగలరు. కానీ ఎప్పుడు కుప్పకూలుతుందనేది చెప్పలేరు. మన దేశ సుస్థిర వృద్ధి పట్ల ఆర్థికవేత్తలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభించిన తరువాత దేశ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు రేకెత్తాయి. సంస్కరణలకు ముందుకాలంలో 3.5 శాతం వార్షిక వృద్ధి ఉండేది. ఆర్థిక వ్యవస్థ అంతంతమాత్రమే అభివృద్ధిని చవిచూసింది. తరచూ ఉత్థాన పతనాలు ఉండేవి. రాజ్య ప్రమేయం లేకుండా వ్యాపారాభివృద్ధి కోసం సంస్కరణలు చేపట్టారు. ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరువడం వల్ల పరిస్థితి మారింది. దీంతో వార్షిక సగటు వృద్ధి 7 శాతానికి చేరుకున్నది. సంక్షోభాలు కూడా లేవు.

ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం ప్రకారం 2005–06 మొదలుకొని 2016–17 మధ్యకాలంలో 271 మిలియన్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. సిస్కో, సిటీ, పీడబ్ల్యూసీ మొదలైన అమెరికా బహుళజాతి కంపెనీలు అందించిన నివేదిక ప్రకారం 2050 నాటికి భారత్, చైనా తరువాత అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఆవిర్భవిస్తుందని వెల్లడైంది. ఈ దిశగా సాగుతున్న ఆర్థికాభివృద్ధి ప్రశంసించదగినది. కానీ ఈ అభివృద్ధి ప్రజలందరికీ చేరలేదు. పైనున్న ఒక్క శాతం ప్రజలు జాతీయ సంపదలో 22 శాతం ఆర్జిస్తున్నారు. పైనున్న 10 శాతం, 56 శాతం సంపన్నులు అభివృద్ధి ఫలాలు అందుకుంటున్నారు. ఈ ఆర్థికాభివృద్ధి గనుక సమ్మిళితమైనది అయినట్టయితే ఆదాయాలు, అవకాశాలు అన్నివర్గాల వారికి పంపిణీ అయ్యేవి. దీనివల్ల ఆర్థిక అసమానతలు తగ్గిపోయేవి. సమ్మిళిత వృద్ధి సాధించడం ఆర్థికాభివృద్ధి సాధించినంత సులభం కాదు.

దేశంలో అవినీతి, అసమర్థ పాలన నెలకొని ఉన్నట్లయితే ఆర్థిక అసమానతలు కూడా పెరుగుతాయి. అనేక ఆర్థిక సమస్యలు కూడా తలెత్తుతాయి. వినియోగం తగ్గినందువల్లనే ఆర్థిక మందగమనం చోటుచేసుకుంటుందనే కోణంలో నేను మాట్లాడటం లేదు. భారత్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక అనిశ్చితికి గల కారణం నిర్మాణపరమైన బలహీనత అని మాత్రమే చెప్పదలుచుకున్నాను. అవినీతి అతి ఎక్కువగా పెరుగుతున్న దేశాల్లో కూడా కొన్నేండ్ల పాటు అధికమైన ఆర్థికాభివృద్ధి కనబడుతుంది. కానీ, ఈ ఆర్థికాభివృద్ధి సుస్థిరంగా సాగదు. అవినీతి పర్యవసానాలు ఏ విధంగా ఉంటాయనేది ఐఎంఎఫ్ ఇతర అంతర్జాతీయ సంస్థల అధ్యయనాల్లో అనేకసార్లు వెల్లడైంది. మొదటి అంశం–అవినీతి వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. అవినీతి గనుక లేకపోతే భారత్‌లో పేదరిక నిర్మూలన వేగంగా జరిగేది. ప్రపంచవ్యాప్తంగా అవినీతి వల్ల కనీసం 5 శాతం స్థూల దేశీయోత్పత్తి దెబ్బతింటుందని ప్రపంచ ఆర్థిక ఫోరం గణాంకాల ఆధారంగా ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. రెండవ అంశం–దృఢమైన ప్రభుత్వాల కన్నా బలహీనమైనవి ఆరోగ్యం, విద్యపైన తక్కువగా పెట్టుబడి పెడుతాయి. దీనివల్ల ఆర్థికాభివృద్ధి చోటుచేసుకున్నప్పుడు శ్రేయోవర్గం మాత్రమే అవకాశాలను ఉపయోగించుకోగలుగుతాయి. విస్తారంగా ఉన్న పేద వర్గాలు వ్యవస్థాగత రంగంలోని అత్యధిక వేతనాలు కలిగిన ఉద్యోగాలు పొందలేరు. అవ్యవస్థీకృతరంగంలోని తక్కువ నైపుణ్యం గల ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వాళ్లు ఎంచుకోవాల్సి వస్తుంది. ఈ విధంగా అవినీతి మహమ్మారి బారిన పడిన దేశాల్లో అసమానతలు పెరుగుతాయి. ఇంటింటి సర్వేల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా రూపొందే అధికారిక పత్రాల్లో కనిపించే అసమానతల కన్నా వాస్తవ పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉన్నది. ప్రభుత్వం నిర్వహించే సర్వేలలో సంపన్నులు తమ నల్లధనం గురించిన వివరాలు చెప్పరు. సంపన్నులకు దేశీయంగా ఇతర దేశాల నుంచి వచ్చే ఆదాయాలను పరిగణనలోకి తీసుకుంటే అసమానతలు మరింత ఎక్కువగా కనిపిస్తాయి. ఆర్థిక అసమానతలు ఆర్థికవేత్తలు ఊహించినదానికన్నా ఎక్కువగా సమస్యలు సృష్టిస్తాయి. పెద్దనోట్ల రద్దు తర్వాత కూడా అవినీతి పదిలంగా ఉన్నదనే కోణంలో అర్థం చేసుకుంటే నల్లధనం ఇతర దేశాలకు వెళ్లి మళ్లీ మన స్టాక్ మార్కెట్‌లో ఇతర రంగాల్లో పెట్టుబడులుగా మారుతున్న వైనాన్ని తెలుసుకోవచ్చు.

> స్టాక్‌మార్కెట్ జోరు ఆర్థికాభివృద్ధికి అన్ని సందర్భాల్లో సూచిక కాదు. నల్లధనం అధికారిక ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తిని పెంచే పెట్టుబడిగా మారకుండా అక్రమ స్టాక్ మార్కెట్ ఊహాగానాల పెట్టుబడులకు పనికివస్తుంది. న్యాయబద్ధమైన దేశీయ పెట్టుబడి తగ్గిపోతుంటే నల్లధనం ఆర్థికవృద్ధికి దోహదపడదు. నల్లధనాన్ని అక్రమ లావాదేవీలను అరికట్టినంత మాత్రాన కూడా ఇతరత్రా సమర్థపాలన లేకుంటే ఫలితం ఉండదు. చట్టబద్ధ పాలన ప్రభావవంతమైన నియంత్రణ రాజకీయ సుస్థిరత్వం, నాణ్యత మొదలైన అంశాల వల్లనే ఆర్థికవృద్ధి చోటుచేసుకుంటుంది.

స్టాక్‌మార్కెట్ జోరు ఆర్థికాభివృద్ధికి అన్ని సందర్భాల్లో సూచిక కాదు. నల్లధనం అధికారిక ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తిని పెంచే పెట్టుబడిగా మారకుండా అక్రమ స్టాక్ మార్కెట్ ఊహాగానాల పెట్టుబడులకు పనికివస్తుంది. న్యాయబద్ధమైన దేశీయ పెట్టుబడి తగ్గిపోతుంటే నల్లధనం ఆర్థికవృద్ధికి దోహదపడదు. నల్లధనాన్ని అక్రమ లావాదేవీలను అరికట్టినంత మాత్రాన కూడా ఇతరత్రా సమర్థపాలన లేకుంటే ఫలితం ఉండదు. చట్టబద్ధ పాలన ప్రభావవంతమైన నియంత్రణ రాజకీయ సుస్థిరత్వం, నాణ్యత మొదలైన అంశాల వల్లనే ఆర్థికవృద్ధి చోటుచేసుకుంటుంది.

మూడవ అంశం– అవినీతి వల్ల పన్నుల ఎగవేత పెరుగుతుంది. అవినీతి గల దేశాలతో పోలిస్తే కఠినంగా ఉండే దేశాల్లో పన్నుల వసూళ్లు ఎక్కువగా ఉన్నట్టు ఐఎంఎఫ్ అధ్యయనంలో వెల్లడైంది. పన్ను వసూళ్లు ఎక్కువగా ఉంటే ప్రభుత్వం ఆ సొమ్మును ఉత్పాదకత కోసం వెచ్చించవచ్చు. అవినీతి పెచ్చరిల్లినప్పుడు దాన్ని అదుపు చేయడం మరింత కష్టమవుతుంది. భారత్‌లో అవినీతి పెరుగడం వల్ల కనీస ఆదాయ వర్గాల్లో వినియోగ శక్తి తగ్గింది. తద్వారా ఆర్థికాభివృద్ధి దెబ్బతిన్నది.

నాలుగవ అంశం– అవినీతి పెరుగడం వల్ల ప్రభుత్వ నియంత్రణా శక్తి సన్నగిల్లుతుంది. ప్రాజెక్టుల వ్యయం పెరిగిపోతుంది. అధికారుల పట్ల ప్రభుత్వ సేవల పట్ల ప్రజలకు నమ్మకానికి సంబంధించి భారతదేశానికి ‘డి’ రేటింగ్ లభించింది. అవినీతి వల్ల పన్ను ఎగవేత కూడా పెరిగిపోతుంది. తమ పన్నులను తగిన సేవలు లభించడం లేదనే భావన నెలకొంటుంది. ఐదవ అంశం– అవినీతి మహమ్మారి ప్రబలిన దేశాల్లో శిశు మరణాలు, తక్కువ బరువున్న పిల్లలు జన్మించడం ఎక్కువగా ఉన్నది. బడి మానేసిన పిల్లల సంఖ్య కూడా ఎక్కువగానే ఉన్నది. భారత్‌లో విద్యారంగం నాణ్యత తక్కువగా ఉండటం ఇందుకు సూచన. చివరి అంశం– అవినీతి ఎక్కువగా ఉన్న దేశాల్లో పర్యావరణానికి హానీ ఎక్కువగా జరుగుతున్నది. అధికారుల అవినీతి మూలంగా పర్యావరణ నిబంధనలను అమలుచేయడం జరుగదు. కాలుష్యాన్ని పసిగట్టే యంత్రాంగం హంగులు ఉండవు.

కేంద్రీయ బ్యాంకుల సొమ్మును ఆర్థిక మందగమనాన్ని అరికట్టడానికి ఉపయోగించుకోవచ్చు. కానీ వడ్డీ రేట్లు తగ్గి రుణ భారం పెరుగవచ్చు. రాబోయే రోజుల్లో కార్పొరేట్ రంగం రుణభారంతో కునారిల్లే అవ కాశం ఉన్నది. కొన్ని సంస్థలు రుణాలు చెల్లించలేకపోవచ్చు. ప్రపంచ ఆర్థికవ్యవస్థ సుదీర్ఘమైన మందగమనాన్ని చవిచూసే పరిస్థితి కనిపిస్తున్నది. పెట్టుబడిదారులు పింఛన్ సంస్థలు అధిక లాభాలు పొందుతాయి. స్టాక్ మార్కెట్ కూడా విజృంభిస్తుంది. కానీ, ఇవి అభివృద్ధికి సూచికలు కావు. ఇతర రంగాల్లో ఆశాజనక పరిస్థితులు లేనప్పుడు పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్‌ను ఆశ్రయిస్తారు. అవినీతి, అసమానతలు, పర్యావరణ విధ్వంసం మొదలైనవి భారత్‌ను సంక్షోభంలోకి నెట్టుతాయి. ఉత్పత్తి, ఆదాయాలు, ఉద్యోగాలు తగ్గిపోతాయి. ఆర్థిక, రాజకీయ అస్థిరత్వం పెరుగుతుంది. అందువల్ల పరిపాలనా వ్యవస్థ అప్రమత్తమై వెంటనే భారత ఆర్థిక వ్యవస్థ లోపల నిర్మాణపరమైన బలహీనతలను చక్కదిద్దాలె.

**(వ్యాసకర్త: గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీలో చీఫ్ ఎకనమిక్ ఎమిరేటస్. గతంలో ఐఎంఎఫ్‌లో సీనియర్ ఆర్థికవేత్తగా పనిచేశారు)**

**‘దివైర్’ సౌజన్యంతో...**

# పంటల్లో వైవిధ్యం పాటించాలె

**విశ్లేషణ**



**డాక్టర్ అనభేరి రాజేశ్వర్‌రావు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, సంక్షేమం గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నది. గ్రామీణ వికాసానికి తోడ్పడి గ్రామీణ ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నది. రాష్ట్రంలోని ప్రజలందరికీ సాగు, తాగునీరు, నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నది. వీటితోపాటు వ్యవసాయరంగ అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రోత్సాహకాలు అందిస్తున్నది. రైతులు ధాన్యాన్ని తమకు అందుబాటులోని కొనుగోలు కేంద్రాల్లో, ఐకేపీ కేంద్రాల్లో విక్రయించడానికి అవసరమైన ఏర్పాటుచేసింది. గతంలో కంటే భిన్నంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే తక్కువ రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు ఏర్పాటుచేయడం హర్షణీయం. రాష్ట్రంలో ప్రధానంగా సాగయ్యే వరి, పత్తి పంటలే కాకుండా ఇతర పంటలను సాగు చేయడానికి తగిన ప్రోత్సాహకాన్ని అందిస్తున్నది. దీంతో రైతులకు ఒక భరోసా కలుగుతున్నది. అట్లనే ప్రభుత్వం రైతు ప్రయోజనాలను కాంక్షించి పెద్ద మొత్తం శీతల గిడ్డంగులను ఏర్పాటుచేసింది. అయితే మరిన్ని గిడ్డంగులను మండలస్థాయిలో ఏర్పాటుచేయాలి. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించాలి.

రైతులకు పంట పెట్టుబడి కోసం ఏటా ఎకరానికి పదివేల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. దీనికితోడు నిరంత ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నది. అయితే కొన్నిసార్లు ప్రకృతి విపత్తుల వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ఈ ప్రతికూల పరిస్థితుల్లో రైతులకు ఆర్థికంగా అండగా ఉండటాని కి రైతు బంధు పథకం ఎంతగానో ఉపయోగపడుతున్నది. అట్లనే దురదృష్టవశాత్తు ఎవరైనా రైతులు చనిపోతే వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి రైతు బీమా పథకాన్ని ప్రారంభించింది. ఇట్లా వ్యవసాయరంగానికి ఊతం ఇచ్చే అనేక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేస్తున్నది. అందుకే వ్యవసాయరంగానికి మంచిరోజులు వచ్చాయని రైతులు భావిస్తున్నారు. పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా రైతు లు ప్రభుత్వం ఇస్తున్న భరోసాతో నిశ్చింతగా ఉన్నారు. అయితే వ్యవసా యాధికారులను కూడా పెద్ద ఎత్తున నియమించింది. వీళ్లు రైతులకు ప్రభు త్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై రైతులకు వివరించాలి. రైతులు సంప్రదాయ పంటలే కాకుండా వారు ఆర్థికంగా ఎదుగడానికి అవకాశం ఉన్న పంటల సాగు గురించి తెలియజేయాలి.

రాష్ట్రంలో తలసరి సగటున నెలకు 640 గ్రాములు, సంవత్సరానికి 7.58 కిలోల సుగంధద్రవ్యాలు వాడుతున్నామని ఒక అధ్యయనం తేలింది. రాష్ట్రం పసుపు, ఎండ మిర్చి ఉత్పత్తిలో ముందంజలో ఉన్నది. కానీ సుగంధ ద్రవ్యాల సాగులో వెనుకబడి ఉన్నాము. ఫలితంగా వీటిని మనం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. ఈ లోటును



అధిగమించడానికి సుగంధ ద్రవ్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచాల్సి అవసరం ఉన్నది. రైతులను ఆ దిశగా ప్రోత్సహిందుకు ప్రభుత్వం ప్రస్తుతం కృషి చేస్తుండటం అభినందనీయం. రాష్ట్రంలో వీటిని సాగును ప్రోత్సహించి రైతులకు అదనపు ఆదాయాన్ని అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అట్లనే వినియోగదారులకు కూడా నాణ్యమైన ఉత్పత్తులను అందించాలన్నది ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే ప్రభుత్వం వీటి సాగు పట్ల రైతుల్లో అవగాహన కల్పిస్తూ అందుకు వారికి కావాల్సిన అండదండలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రాష్ట్రంలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా 24 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నది. అయితే ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. అవసరం మేరకే వాడుకోవాలి. భూగర్భజలాలు అడుగంటిపోకుండా రైతులే స్వీయ నియంత్రణ పాటించాలి. నీటి వనరులు వృథా కాకుండా రైతులే తమ స్థాయిలో తగిన చర్యలు చేపట్టాలి. 2020 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం పొంచి ఉన్నదని ఇటీవల వెల్లడైన అధ్యయనాలు తెలుపుతున్నాయి. దీనివల్ల దాదాపు 10 కోట్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కొవాల్సి వస్తుందన్నది ఆ సర్వే ఫలితాల సారాంశం. కాబట్టి మన పౌరులను, విద్యార్థులను చైతన్యపరుచాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి వృథాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ కోసం ఏటా బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల వల్ల భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. ఇంతకాలం భూగర్భజలాలు అడుగంటిపోయిన బీడు భూములు కూడా సాగులోకి వస్తున్నాయి. పెరిగిన ఈ భూగర్భజలాలను రైతులు కాపాడుకోవాలి. వ్యవసాయ నిపుణుల సూచనలకు అనుగుణంగా తక్కువనీటితో సాగయ్యే పంటలవైపు దృష్టి సారించాలి. గ్రామాల వారీగా రైతులు సంఘటితంగా నీళ్లు వృథా కాకుండా తగిన కార్యాచరణ రూపొందించుకొని వాటిని పక్కాగా అమలు చేయాలి. అప్పుడే మనం భావితరాలకు మేలు చేసినవాళ్లం అవుతాం. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నది. అందుకే అనేక వ్యవసాయ అనుకూల విధానాలను అమలుచేస్తున్నది. వ్యవసాయరాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడానికి మనమంతా కృషిచేయాలి. అప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.

> 2020 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం పొంచి ఉన్నదని ఇటీవల వెల్లడైన అధ్యయనాలు తెలుపుతున్నాయి. దీనివల్ల దాదాపు 10 కోట్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కొవాల్సి వస్తుందన్నది ఆ సర్వే ఫలితాల సారాంశం. కాబట్టి మన పౌరులను, విద్యార్థులను చైతన్యపరుచాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి వృథాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ కోసం ఏటా బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల వల్ల భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. ఇంతకాలం భూగర్భజలాలు అడుగంటిపోయిన బీడు భూములు కూడా సాగులోకి వస్తున్నాయి. పెరిగిన ఈ భూగర్భజలాలను రైతులు కాపాడుకోవాలి.


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com



## బుల్లెట్‌ప్రూఫ్ ట్రాక్టర్‌తో వ్యవసాయం

జమ్ములోని సాంబాసెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంట బీఎస్‌ఎఫ్ జవాన్ల భద్రతలో బుల్లెట్‌ప్రూఫ్ ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న ఓ రైతు. పాకిస్థాన్ ఇటీవల తరచుగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుండటంతో రైతుల కోసం ప్రభుత్వం ఈ ట్రాక్టర్లను కొనుగోలు చేసింది.

## నేను పరమశివుడ్ని!

- ఏ కోర్టులూ నన్ను శిక్షించలేవు
- నిత్యానంద తాజా వీడియో

**న్యూఢిల్లీ:** 'నేను పరమశివుడ్ని.. ఏ కోర్టులూ నన్ను శిక్షించలేవు.. ' అంటూ నిత్యానంద తాజాగా చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన ఓ వీడియో బయటకొచ్చింది. 'నన్నెవరూ ముట్టుకోలేరు. నేను పరమశివుడ్ని. నా వాస్తవాన్ని గ్రహిస్తే ఏ స్టుపిడ్ కోర్టు కూడా నన్ను శిక్షించలేదు. మీకు మరణం ఉండదు. నేను హామీ' అంటూ నిత్యానంద తన శిష్యులనుద్దేశించి అందులో వ్యాఖ్యానించారు.

## దిశ నిందితుల ఎన్‌కౌంటర్ సరైనదే

- వారు ఇప్పుడు కాకపోయినా రేపైనా చావాల్సిందే
- పోలీసుల చర్యను సమర్థించిన నానా పటేకర్



**లక్నో:** దిశ నిందితుల ఎన్‌కౌంటర్ సరైనదేనని బాలీవుడ్ విలక్షణ నటుడు నానా పటేకర్ అన్నారు. హైదరాబాద్ పోలీసుల చర్యను ఆయన సమర్థించారు. 'అబ్ తక్ చప్పన్'లో నానా పటేకర్ పోషించిన ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రకు సినీ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. సీక్వెల్‌గా విడుదలైన 'అబ్ తక్ చప్పన్2' కూడా ప్రేక్షకుల ఆదరణ పొందింది. సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న నానా పటేకర్ దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై స్పందించారు. 'ఏం జరిగిందో అది సరైందే. హైదరాబాద్ పశువైద్యురాలిపై ఆ నలుగురు హత్యాచారం చేసి ఉంటే వారిని కాల్చిపారేయాల్సిందే. ఇందులో తప్పేముంది. ఈ రోజు కాకపోయినా రేపైనా వారు చావాల్సిందే' అని మీడియాతో అన్నారు. హైదరాబాద్, ఉన్నావ్ వంటి ఘటనల వల్ల విదేశాలకు వెళ్లినప్పుడు మనకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని, భారత్‌లో ఇలాంటివి సాధారణమన్న భావనతో చులకనగా చూస్తారని పటేకర్ చెప్పారు. సమాజంలో ఇలాంటి దారుణాలు జరుగడానికి తల్లిదండ్రుల తప్పు కూడా కొంత ఉందన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే సరైన విలువలు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు.



# పౌరసత్వ బిల్లు పాస్

## ఆమోదించిన లోక్‌సభ.. అనుకూలం: 311, వ్యతిరేకం: 80

- భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులను ఆదుకునేందుకే ఈ బిల్లు
- దేశంలోని ముస్లింలకు ఎలాంటి నష్టం ఉండదు: హోంమంత్రి అమిత్‌షా
- మైనార్టీలకు వ్యతిరేకంగా ఉన్నదన్న కాంగ్రెస్
- బిల్లు ప్రతులను చించివేసిన అసదుద్దీన్ ఒవైసీ
- ఈశాన్యరాష్ట్రాల్లో ఆగ్రహజ్వాలలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:**

వివాదాస్పద 'పౌరసత్వ (సవరణ) బిల్లు-2019'కు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఏడుగంటలకు పైగా చర్చ జరిగిన అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా 311 మంది, వ్యతిరేకంగా 80 మంది ఎంపీలు ఓటేశారు. దీంతో బిల్లు లోక్‌సభ ఆమోదం పొందినట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అంతకుముందు ఈ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. ఇది దేశంలోని మైనార్టీలకు వ్యతిరేకంగా ఉన్నదని కాంగ్రెస్ విమర్శించగా, ఈ బిల్లుతో అమిత్‌షా.. హిట్లర్ సరసన నిలుస్తారని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అనంతరం బిల్లు ప్రతులను చించివేశారు. ఈ బిల్లును కాంగ్రెస్, టీఆర్‌ఎస్, ఎంఐఎం, డీఎంకే, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, బీజేడీ, వామపక్ష పార్టీలు, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఐయూఎంఎల్ తదితర పార్టీలు వ్యతిరేకించగా, అకాలీదళ్, జేడీయూ, ఎన్‌డీడీపీ, ఎన్‌ఎఫ్‌ఎఫ్, మిజో నేషనల్ ఫ్రంట్, ఎల్‌జేపీ, వైసీపీ తదితర పార్టీలు మద్దతు తెలిపాయి. మరోవైపు ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఈశాన్యరాష్ట్రాల్లో రాస్తారోకోలు, భారీ ర్యాలీలు నిర్వహించారు.

### ముస్లింలకు ప్రమాదమేం లేదు

బిల్లును ప్రవేశపెడుతూ, చర్చ అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రసంగించారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన పలు అభ్యంతరాలకు వివరణ ఇచ్చారు. దేశంలోని ముస్లింలు, మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని ఈ బిల్లును రూపొందించారని కాంగ్రెస్ ఆరోపించగా.. 'ఈ బిల్లు కనీసం 0.001 శాతం కూడా మైనార్టీలకు వ్యతిరేకం కాదు' అని అమిత్‌షా పేర్కొన్నారు. వారి గురించి కనీసం ఒక్క వాక్యం కూడా ఇందులో ప్రస్తావించలేదని చెప్పారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లో దాడులకు గురై భారత్‌కు వలసవచ్చిన మైనార్టీలకు స్వాంతన కలిగించి, వారి హక్కులను రక్షించేందుకే ఈ బిల్లును ప్రవేశపెట్టామని అమిత్‌షా పేర్కొన్నారు. 'శ్రీలంక, నేపాల్, మయన్మార్ వంటి దేశాల పేర్లను ఎందుకు చేర్చలేదని అడుగుతున్నారు. శ్రీలంక తమిళులకు గతంలో పౌరసత్వం ఇచ్చాం. నేపాల్ పౌరులెవరైనా భారత పౌరసత్వాన్ని సులభంగా పొందవచ్చు. ఇక మయన్మార్ లౌకిక దేశం. కానీ.. పాక్, ఆఫ్ఘన్, బంగ్లాదేశ్ ముస్లిం దేశాలు. అక్కడ మైనార్టీలపై విపరీతంగా దాడులు జరుగుతున్నాయి' అని పేర్కొన్నారు. పాక్‌లో ఒకప్పుడు 23 శాతంగా ఉన్న మైనార్టీలు ఇప్పుడు 3 శాతానికి పరిమితమయ్యారని, బంగ్లాదేశ్ లోనూ ఇలాంటి పరిస్థితే ఉన్నదన్నారు. వీరందరికీ రక్షణ అవసరమని చెప్పారు. ఈ బిల్లు విభజనకారి కాదని, ఆర్టికల్ 14కు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఇలా గతంలో అనేక మార్లు శరణార్థులకు పౌరసత్వం కల్పించామని గుర్తుచేశారు. 1971లో పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయినప్పుడు, ఉగాండాలో భారతీయులపై దాడులు జరిగినప్పుడు ప్రత్యేక నిబంధనల ద్వారా బాధితులకు పౌరసత్వం ఇచ్చామని ఆయన గుర్తుచేశారు. మూడు దేశాల్లో ముస్లింలు మతపరమైన దాడులకు గురయ్యే ప్రమాదం లేనందున వారు 'పౌరసత్వ (సవరణ) బిల్లు-2019' కింద లబ్ధి పొందలేరన్నారు.

### కాంగ్రెస్సే కారణం

పౌరసత్వ సవరణ బిల్లు తేవడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని అమిత్ షా ఆరోపించారు. 'స్వాతంత్ర్యం సమయంలో కాంగ్రెస్ పార్టీ ఈ దేశాన్ని మతం ప్రాతిపదికన విభజించింది. ఒకవేళ అప్పుడు విభజన జరుగకుంటే ఈ బిల్లు అవసరం వచ్చి ఉండేది కాదు' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఓవైపు కేరళలో ముస్లిం లీగ్‌తో పొత్తు పెట్టుకొని, మరోవైపు మహారాష్ట్రలో శివసేనతో అధికారాన్ని పంచుకున్నదని విమర్శించారు. రోహింగ్యా ముస్లింలను భారత్‌లోకి అనుమతించే ప్రసక్తే లేదన్నారు. వారంతా బంగ్లాదేశ్ నుంచి వస్తున్నారని చెప్పారు. చొరబాటుదారులు, శరణార్థుల మధ్య స్పష్టమైన తేడా ఉన్నదన్నారు. తమ ప్రాణాలను, సంస్కృతిని, మతాన్ని, కుటుంబాన్ని కాపాడుకునేందుకు వేరే దేశానికి వలస వెళ్లేవారిని శరణార్థులుగా పరిగణిస్తారని, అక్రమంగా దేశంలో వచ్చి స్థిరపడినవారిని చొరబాటుదారులుగా పిలుస్తారని వివరించారు.



లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా హోంమంత్రి అమిత్‌షా

### ఈశాన్య రాష్ట్రాలకు అభయం

ఈశాన్యరాష్ట్రాల ప్రజలు భయపడనవసరం లేదని, వారికి ఈ బిల్లు నుంచి తగిన మినహాయింపు ఉన్నదని అమిత్ షా పేర్కొన్నారు. ఈ బిల్లు నుంచి మణిపూర్‌ను మినహాయిస్తున్నట్టు చెప్పారు. ఇన్నర్ లైన్ పర్మిట్ కింద ఉన్న అరుణాచల్ ప్రదేశ్, మిజోరం, నాగాలాండ్, మణిపూర్‌కు ఈ బిల్లు వర్తించదని చెప్పారు. త్రిపుర, మేఘాలయ, అసోంను ఈ బిల్లు నుంచి మినహాయిస్తున్నట్టు ప్రకటించారు. చర్చ సందర్భంగా శివసేనతోపాటు పలు ప్రతిపక్ష పార్టీలు తీసుకొచ్చిన సవరణలు వీగిపోయాయి.

## నిరసనల హోరు.. విమర్శల జోరు

**బిల్లును** ప్రవేశపెట్టే సమయంలో సభలో ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి ప్రసంగిస్తూ 'ఇది దేశంలోని మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని రూపొందించిన బిల్లు' అని ఆరోపించారు. భారత్‌ను హిందూదేశంగా మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ ఆరోపించారు. భారత రాజ్యాంగం వెలువరించే లౌకిక స్ఫూర్తికి ఇది విరుద్ధంగా ఉన్నదన్నారు. మన దేశానికి శరణార్థులుగా వచ్చే వారిపై మతం ప్రాతిపదికన వివక్ష చూపించరాదని స్పష్టం చేశారు.

- బీజేపీ విభజన రాజకీయాలు చేస్తున్నది. ఈ బిల్లు దేశానికి, రాజ్యాంగానికి అవమానకరం. **- అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ**
- ప్రభుత్వం వెంటనే బిల్లును వెనక్కి తీసుకోవాలి. లేదంటే మేము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం. **- బద్రుద్దీన్ అజ్మల్, ఏఐయూడీఎఫ్**
- దేశంలో ప్రస్తుతం ఆర్థిక మందగమనం, నిరుద్యోగం వంటి అనేక సమస్యలు ఉండగా, కేంద్రం ఈ బిల్లును ఎందుకు ప్రవేశపెడుతున్నదో అర్థం కావడం లేదు. ఈ బిల్లుతో దేశంపై అదనపు భారం మోపుతున్నారు. మూడు దేశాలను మాత్రమే ప్రస్తావించారు. మరి శ్రీలంకలోని తమిళుల పరిస్థితి ఏమిటి? శరణార్థులకు 25 ఏండ్లపాటు ఓటువేసే హక్కు లేకుండా చేయాలి. **- వినాయక్ రౌత్, శివసేన**

## ముస్లింలను కూడా చేర్చాలి

### ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాం: టీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్ రావు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పౌరసత్వ సవరణ బిల్లు రాజ్యాంగ మూల సిద్ధాంతానికి విరుద్ధమని లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్ రావు విమర్శించారు. మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వడం సరికాదని, ఇందులో ముస్లింలను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో సోమవారం పౌరసత్వ సవరణ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా నామా నాగేశ్వర్‌రావు మాట్లాడారు. ఈ బిల్లును టీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని ప్రకటించారు. ముస్లింలను చేర్చుతూ సవరణ చేయకుంటే బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని స్పష్టం చేశారు. టీఆర్‌ఎస్ లౌకికవాద పార్టీ అని, మొదటి నుంచీ మైనార్టీలకు అండగా ఉన్నదని తెలిపారు. దేశంలోని 130 కోట్ల మంది జనాభాలో వివిధ మతాలు, అనేక కులాల వారు ఉన్నారని, అందరినీ సమభావంతో చూడాలని సూచించారు.



# 16న నిర్భయ దోషులకు ఉరి?

- పాశవికకాండ జరిగిన డిసెంబర్ 16నే ఉరి తీయాలని కేంద్ర యోచన
- దిశ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో పెరిగిన ప్రజల ఒత్తిడి
- ఈ నేపథ్యంలో నలుగురి మరణశిక్ష అమలుకు నిర్ణయం
- 14 నాటికి 10 ఉరితాళ్లు సిద్ధం చేయాలని బక్సర్ జైలుకు ఆదేశం

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయ కేసులో దోషులకు కోర్టు విధించిన ఉరిశిక్షను అమలు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు తెలిసింది. ఈ నెల 16న వారిని ఉరి తీసేందుకు తీహార్ జైలు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. దుండగులు నిర్భయపై పాశవికంగా లైంగికదాడికి పాల్పడి, ఆపై అమానుషంగా హతమార్చిన డిసెంబర్ 16నే వారిని ఉరి తీయాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి జైలు అధికారులకు ఆదేశాలు అందినట్టు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఉరితాళ్లు తయారు చేయాలని బీహార్‌లోని బక్సర్ జిల్లా జైలుకు జైళ్ల డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు అందాయి. నిర్భయ కేసులో దోషులు నలుగురు ప్రస్తుతం తీహార్ జైలులోనే ఉన్నారు. దోషుల్లో ఒకడైన వినయ్ శర్మ ఇటీవల రాష్ట్రపతికి క్షమాభిక్ష పెట్టుకున్న విషయం తెలిసిందే. అతనికి క్షమాభిక్ష పెట్టవద్దని ఢిల్లీ ప్రభుత్వం రాష్ట్రపతికి సిఫారసు చేసింది. 2012, డిసెంబర్ 16న తన స్నేహితుడితో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న నిర్భయపై ఆరుగురు దుండగులు దాడికి పాల్పడ్డారు. నిర్భయ స్నేహితుడిని బస్సు నుంచి తోసేసిన దుండగడులు యువతిపై దారుణంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ తరువాత ఆమెను క్రూరంగా హింసించి రోడ్డుపై తోసేసి వెళ్లిపోయారు. కొద్దిరోజులు మృత్యువుతో పోరాడిన నిర్భయ చివరికి తనువు చాలించింది. ఈ కేసులో దోషులుగా తేలిన ఆరుగురిలో ఒకడు బాల నేరస్థుడు కావడంతో అతడికి కొద్దిరోజులు జైలు శిక్షను అమలు చేసి విడుదల చేశారు. కాగా మరొక దోషి రాంసింగ్ జైలులోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మిగిలిన నలుగురికి మరణశిక్ష అమలు కావాల్సి ఉంది. హైదరాబాద్‌లో దిశ నిందితుల ఎన్‌కౌంటర్ అనంతరం అందరి దృష్టి నిర్భయ ఘటనవైపు మళ్లింది. ఏడేండ్లు గడుస్తున్నా దోషులకు కోర్టు విధించిన ఉరిశిక్షను అమలుచేయకపోవడంపై అన్ని వైపుల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి శిక్షను అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

### ఉరితాళ్ల తయారీకి ప్రసిద్ధి చెందిన బక్సర్

ఈ నెల 14 నాటికి పది ఉరితాళ్లను సిద్ధం చేసి ఉంచాలని జైళ్ల డైరెక్టరేట్ నుంచి బీహార్‌లోని బక్సర్ జైలుకు ఆదేశాలు అందాయి. ఉరితాళ్లను తయారు చేయడంలో బక్సర్ జైలు ప్రాచుర్యం పొందింది. ఈ జైలులో తప్ప బీహార్‌లోని ఇతర జైళ్లలో ఉరితాళ్లను తయారుచేసే సిబ్బంది లేరు. ఉరితాళ్ల తయారీకి ఆదేశాలు వచ్చాయని, అయితే ఎవరికోసమన్నది తమకు తెలియదని జైలు సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ అరోరా తెలిపారు. దీంతో ఈ ఉరితాళ్లు నిర్భయ దోషుల కోసమేనని ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఒక తాడును ఐదుగురు లేదా ఆరుగురు వ్యక్తులు తయారు చేయడానికి మూడు రోజులు పడుతుందని అరోరా పేర్కొన్నారు. ఎక్కువ మంది సిబ్బందిని ఉపయోగించి 14 నాటికి పది తాళ్లను తయారు చేస్తామని ఎస్పీ తెలిపారు. పార్లమెంట్‌పై దాడులకు పాల్పడిన కేసులో దోషి అఫ్జల్ గురును ఉరితీసేందుకు కూడా తాడును తామే తయారు చేశామని చెప్పారు. చివరిసారి తాము ఉరితాడును తయారు చేసినప్పుడు దానికి రూ.1,725 ఖర్చయినట్టు తెలిపారు. తాడు తయారీలో ఉక్కు, ఇత్తడిని ఉపయోగిస్తారని, దీంతో అది మెడ నుంచి జారిపోకుండా ఉంటుందని వివరించారు.



లోక్‌సభలో బిల్లు ప్రతులను చింపివేస్తున్న ఎంపీ అసదుద్దీన్

## ముస్లింలకు నీడ లేకుండా చేస్తారా?

- ఇది మరో దేశ విభజనకు దారి తీస్తుంది
- ఈ బిల్లుతో హిట్లర్ సరసన అమిత్ షా
- ఎంపీ అసదుద్దీన్ ఆవేదన, ఆగ్రహం

పౌరసత్వ బిల్లుపై చర్చ సందర్భంగా ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లుతో ముస్లింలకు దేశంలో నీడ లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఇది మరో దేశ విభజనకు దారితీస్తుందని హెచ్చరించారు. దేశంలోని ముస్లింలను నియంత్రించడానికి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ఇది హిట్లర్ తీసుకొచ్చిన వేధింపుల చట్టాలకన్నా ఘోరంగా ఉన్నదని వ్యాఖ్యానించారు. 'ఇలాంటి బిల్లు నుంచి, కేంద్ర హోంమంత్రి నుంచి దేశాన్ని కాపాడాలని మిమ్మల్ని (స్పీకర్) కోరుతున్నా. లేకుంటే నూరెంబర్గ్ చట్టాలు, ఇజ్రాయెల్ పౌరసత్వ చట్టాలను ప్రవేశపెట్టిన రుడాల్ఫ్ హిట్లర్, డేవిడ్ బెన్ గురియన్ సరసన అమిత్ షా చేరుతారు' అని వ్యాఖ్యానించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిని రికార్డుల నుంచి తొలిగిస్తున్నట్టు ప్రకటించారు. 'భారత్‌తో పాటు వివిధ దేశాల భూభాగాలను ఆక్రమించుకున్న చైనా పేరును ఈ బిల్లులో ఎందుకు ప్రస్తావించలేదు?.. మీరు చైనాను చూసి భయపడుతున్నారా?' అని అసదుద్దీన్ ప్రశ్నించారు. గాంధీజీ తన దక్షిణాఫ్రికా పౌరసత్వ కార్డును చించివేసిన తర్వాతే ఆయనను మహాత్మా అని సంబోధించారని గుర్తుచేశారు. ఈ బిల్లు స్వాతంత్ర్య సమరయోధులను అవమానించేదిగా ఉన్నదని వ్యాఖ్యానించారు. అనంతరం పౌరసత్వ బిల్లు ప్రతులను అసదుద్దీన్ చించివేశారు. జార్ఖండ్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో మాట్లాడుతూ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు.



పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా గువాహటిలో కాగడాల ప్రదర్శన చేపడుతున్న నిరసనకారులు

## అట్టుడికిన ఈశాన్యం

- పౌరసత్వ బిల్లుపై జనాగ్రహం

**గువాహటి/కోల్‌కతా:** వివాదాస్పద 'పౌరసత్వ సవరణ బిల్లు'కు వ్యతిరేకంగా ఈశాన్య రాష్ట్రాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. చైనా, బంగ్లాదేశ్, మయన్మార్, భూటాన్‌లతో అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటున్న అసోం, త్రిపురలలో ప్రజలు ఆందోళన బాట పట్టారు. ఇతర దేశాల నుంచి వచ్చిన వారికి పౌరసత్వం కల్పిస్తే తమ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ గుర్తింపు, సంస్కృతి, జనాభా నిష్పత్తిపై ప్రభావం పడుతుందని వారు భయపడుతున్నారు. పౌరసత్వ బిల్లును వ్యతిరేకించడంతోపాటు ఆరు సామాజిక వర్గాలకు ఎస్టీ హోదా కల్పించాలని ఆల్ మోరన్ స్టూడెంట్స్ యూనియన్ (ఏఎంఎస్‌యూ) చేపట్టిన 48 గంటల బంద్‌తో సోమవారం అసోంలో జనజీవనం స్తంభించింది. ఉదయం 5 గంటలకే ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చారు. టైర్లకు నిప్పంటించారు. జాతీయ రహదారులను దిగ్బంధించారు. సీఎం సర్బానంద సోనోవాల్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. డిబ్రూగఢ్, గువాహటిలో పోలీసులు లాఠీచార్జి చేశారు. త్రిపుర రాజధాని అగర్తల, పశ్చిమబెంగాల్‌లోని పలుప్రాంతాల్లో కూడా నిరసనలు జరిగాయి. మరోవైపు, నార్త్ ఈస్ట్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎన్‌ఈఎస్‌వో) మంగళవారం 11 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. హార్న్‌బిల్ ఫెస్టివల్ జరుగుతున్న నాగాలాండ్‌కు మాత్రం ఇందుకు మినహాయింపునిచ్చారు. ఎన్‌ఈఎస్‌వో ఇచ్చిన బంద్‌కు కాంగ్రెస్, లెఫ్ట్, ఏఐడీయూఎఫ్ మద్దతు ప్రకటించాయి. పలు వామపక్ష సంఘాలు విడిగా 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇదిలా ఉండగా, పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. మరోవైపు, జంతర్‌మంతర్ వద్ద ఏఐడీయూఎఫ్ ఆందోళన నిర్వహించింది.

### బెంగాల్‌లో అనుమతించం: మమతాబెనర్జీ

**ఖరగ్‌పూర్:** కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న పౌరసత్వ సవరణ బిల్లు (సీఏబీ), జాతీయ పౌర జాబితాను(ఎన్నార్సీని) పశ్చిమబెంగాల్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ అమలుచేయబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ స్పష్టం చేశారు. దేశంలోని ఏ ఒక్క పౌరుడినీ శరణార్థిగా, చొరబాటుదారుడిగా చిత్రీకరించి, వెళ్లగొట్టేందుకు అంగీకరించబోమని చెప్పారు. సోమవారం ఖరగ్‌పూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రవేశపెట్టిన పౌరసత్వ బిల్లును విభజనకారిగా అభివర్ణించారు. లౌకిక దేశంలో మతం ప్రాతిపదికన పౌరసత్వం ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తాము అధికారంలో ఉన్నంతవరకు పశ్చిమబెంగాల్‌లో ఈ బిల్లులను అమలుచేయబోమని స్పష్టంచేశారు. ఎన్నార్సీని ప్రవేశపెడుతారన్న వార్తలతో కలతచెంది రాష్ట్రంలో 30 మంది వరకు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు.

# కన్నడనాట కమల ధ్వజం!

- అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీ జయభేరి
- 15 స్థానాలకుగాను 12 స్థానాలు కైవసం
- యెడియూరప్పకు తప్పిన గండం.. మెజార్టీ సాధించిన సర్కారు
- కాంగ్రెస్‌కు రెండు.. ఖాతా తెరువని జేడీఎస్

**బెంగళూరు:** కర్ణాటక ఉప ఎన్నికల్లో అధికార బీజేపీ విజయదుందుభి మోగించింది. మొత్తం 15 అసెంబ్లీ స్థానాలకు గాను 12 స్థానాలను కైవసం చేసుకుంది. కాంగ్రెస్ రెండు స్థానాలకే పరిమితం కాగా, జేడీఎస్ ఖాతా తెరువలేకపోయింది. ఒకచోట బీజేపీ రెబల్ అభ్యర్థి గెలుపొందారు. ఉప ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించడంతో బీఎస్ యెడియూరప్ప సర్కారుకు అసెంబ్లీలో స్పష్టమైన మెజార్టీ చేకూరింది. హుణసూరు, శివాజీనగర్‌లలో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన బీజేపీ రెబల్ నేత శరత్ బాచేగౌడ.. హొస్కోటే స్థానం నుంచి గెలుపొందారు. కాంగ్రెస్, జేడీఎస్‌కు చెందిన 17 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలోని సంకీర్ణ సర్కారు కూలిపోయిన విషయం తెలిసిందే. రెబల్ ఎమ్మెల్యేలపై నాటి స్పీకర్ అనర్హత వేటు వేయడంతో వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. కోర్టు ఆదేశాల మేరకు జూలై 29న నిర్వహించిన బలపరీక్షలో బీజేపీ నెగ్గడంతో యెడియూరప్ప సీఎం పగ్గాలు చేపట్టారు. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడడంతో 17 స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, రెండు స్థానాలకు సంబంధించి హైకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉండడంతో 15 స్థానాలకు ఈ నెల 5న ఉప ఎన్నికలు జరిగాయి. బీజేపీ, కాంగ్రెస్ మొత్తం 15 స్థానాల్లో పోటీచేయగా, జేడీఎస్ 12 చోట్ల బరిలో దిగింది. తాజా ఫలితాలతో అసెంబ్లీలో బీజేపీ బలం 117కు పెరిగింది. అనర్హత ఎమ్మెల్యేల్లో బీజేపీ 13 మందికి టికెట్లు ఇచ్చింది. వారిలో 11 మంది గెలుపొందారు.


### సుస్థిర పాలన అందిస్తాం: సీఎం యెడియూరప్ప

ఉప ఎన్నికల ఫలితాల నేపథ్యంలో సీఎం యెడియూరప్ప మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా వచ్చే మూడున్నరేండ్లపాటు సుస్థిర పాలనను అందిస్తామని చెప్పారు. అనర్హత ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తామన్న హామీపై వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. కాగా, వొక్కలిగల కంచుకోట అయిన మండ్య జిల్లాలో తొలిసారి కాషాయ జెండా రెపరెపలాడింది. దశాబ్దాలుగా కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలే ఇక్కడ ఆధిపత్యం చెలాయిస్తుండగా, తాజాగా కేఆర్ పేట అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో జేడీఎస్ అభ్యర్థిపై బీజేపీ అభ్యర్థి నారాయణ గౌడ గెలుపొందారు.



ఉప ఎన్నికల్లో తమ పార్టీ ఘన విజయం సాధించడంతో బెంగళూరులో బీజేపీ శ్రేణుల సంబురాలు

## సిద్దరామయ్య, గుండూరావు రాజీనామా



గుండూరావు, సిద్దరామయ్య

**ఉప** ఎన్నికల్లో పార్టీ ఘోర పరాభవం నేపథ్యంలో కర్ణాటక కాంగ్రెస్‌లో రాజీనామాల పర్వం మొదలైంది. ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ సీఎం సిద్దరామయ్య పార్టీ శాసనసభాపక్ష నేత(సీఎల్పీ) పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి లేఖ పంపారు. ఉప ఎన్నికల్లో సంతృప్తికర ఫలితాలు సాధించడంలో విఫలమైనందుకు విచారం వ్యక్తంచేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. 'సీఎల్పీ నేతగా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడాల్సిన అవసరం ఉన్నది. పార్టీ ప్రయోజనాల రీత్యా పదవికి రాజీనామా చేశా' అని ఆయన విలేకరులతో వ్యాఖ్యానించారు. సిద్దరామయ్య రాజీనామా చేసిన కొద్దిసేపటికే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దినేశ్ గుండూరావు కూడా తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను సోనియాగాంధీకి పంపినట్లు తెలిపారు.

## కాంగ్రెస్‌కు గుణపాఠం

- కర్ణాటక ఫలితాలపై మోదీ వ్యాఖ్య



**బర్హి/బొకారో:** కర్ణాటకలో బీజేపీకి గతంలో ప్రజలిచ్చిన తీర్పునకు కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు వెన్నుపోటుపొడిచి ఆ తీర్పును తస్కరించాయని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆరోపించారు. అందుకే ఇప్పుడు ఆ రెండు పార్టీలను కర్ణాటక ఉప ఎన్నికల్లో ప్రజలు శిక్షించి తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. జార్ఖండ్‌లో బీజేపీని స్పష్టమైన మెజార్టీతో గెలిపించి సుస్థిర ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కర్ణాటకలోని 15 శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించి యెడ్యూరప్ప సర్కారు సుస్థిరతపై వస్తున్న ఊహాగానాలకు తెరదించడంతో మోదీ సోమవారం జార్ఖండ్‌లోని బర్హి, బొకారాలో జరిగిన ఎన్నికల సభల్లో రెట్టించిన ఉత్సాహంతో ప్రసంగించారు. కాంగ్రెస్-జేఎంఎం-ఆర్జేడీ కూటమికి అధికారాన్ని అప్పగిస్తే రాష్ట్రం అస్థిరత, అనిశ్చితిలో కూరుకుపోతుందని మోదీ హెచ్చరించారు.

## పారా మిలిటరీ దళాలకు ఖాదీ యూనిఫామ్

### ఆర్మీ క్యాంటిన్లలో గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులు

**న్యూఢిల్లీ:** దేశంలోని పారా మిలిటరీ దళాలకు చెందిన సిబ్బంది ఇకపై ఖాదీతో తయారయ్యే యూనిఫాంను ధరించనున్నారు. అలాగే గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులైన తేనె, పచ్చళ్లు, తినుబండారాలు, సబ్బులు, షాంపూలు వంటి వాటిని ఆర్మీ క్యాంటిన్లలో విక్రయించనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ మేరకు పారా మిలిటరీ దళాల డైరెక్టర్ జనరల్స్(డీజీ)కు సూచించినట్లు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) సోమవారం తెలిపింది. 'ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభించనున్నది. ఖాదీ వస్త్రాలతో తయారయ్యే యూనిఫాం, స్వెట్టర్లు, దుప్పట్లను పారామిలిటరీ దళాలు వినియోగించేలా చూడాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీజీలకు నిర్దేశించారు. గ్రామీణ పరిశ్రమల ద్వారా తయారయ్యే ఉత్పత్తులను ఆర్మీ క్యాంటిన్లలో విక్రయించేలా చర్యలు చేపట్టాలని సూచించారు' అని కేవీఐసీ పేర్కొంది.

# కాళేశ్వరం జలాలతో
# అమరుల స్తూపానికి అభిషేకం

- కేసీఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం ప్రాజెక్టు
- అమరుల ఆకాంక్షలను నెరవేరుస్తున్న అపరభగీరథుడు కేసీఆర్
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**హైదరాబాద్, గోదావరిఖని, నమస్తే తెలంగాణ / తెలుగు యూనివర్సిటీ:** తొలిసారి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన డిసెంబర్ 9వ తేదీని స్మరించుకొంటూ కాళేశ్వరం జలాలతో గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపానికి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని గోదావరి నది నుంచి ఈ జలాలను తీసుకొచ్చారు. ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి తదితరులతో కలిసి జలాభిషేకంలో పాల్గొన్న అనంతరం కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. అమరుల ఆకాంక్షలను నెరవేరుస్తున్న అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. కాళేశ్వరం సహా ఇతర ప్రాజెక్టుల ద్వారా నీళ్లు, ఇప్పటికే లక్షకుపైగా నియామకాలు చేపట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షతో తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చారని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని మాయ మాటలు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని, నీళ్ల ద్వారా ప్రతి రైతు ఆనందంగా ఉన్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాసరాజు, అఖిల్‌గౌడ్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, రామగుండం మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద క్షీరాభిషేకం చేస్తున్న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్. చిత్రంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు కూడా ఉన్నారు.



అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యగౌరచంద్రదేవ్‌కు రూ.కోటి విరాళం చెక్కును అందజేస్తున్న సిల్వర్‌ఓక్స్ అంతర్జాతీయ పాఠశాల ఎండీ ధనుంజయ తల్లి బసవపూర్ణమ్మ. చిత్రంలో ధనుంజయతోపాటు ఆయన కుటుంబసభ్యులు ఉన్నారు.

# అక్షయపాత్రకు
# సిల్వర్‌ఓక్స్ కోటి విరాళం

**దుండిగల్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ శివారు బాచుపల్లిలోని సిల్వర్‌ఓక్స్ అంతర్జాతీయ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ధనుంజయ అక్షయపాత్ర ఫౌండేషన్‌కు రూ.కోటి విరాళం ఇచ్చారు. సోమవారం పాఠశాల ఆవరణలో ధనుంజయ తల్లి బసవపూర్ణమ్మ చేతులమీదుగా చెక్కును అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యగౌరచంద్రదేవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రదేవ్ మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల్లో 18,02,517 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్నభోజనం పెడుతున్నామని, ఇందుకు చేయూతనందించిన ధనుంజయకు కృతజ్ఞతలు తెలిపారు. ఆకలితో ఉన్న పిల్లలకు భోజనం అందజేసేందుకు తనవంతుగా ముందుకువచ్చినట్టు ధనుంజయ తెలిపారు. కార్యక్రమంలో ధనుంజయ సతీమణి నీలిమ, ఇతర కుటుంబసభ్యులు, అక్షయపాత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.



# చిన్న చెరువుల పునరుద్ధరణ

- తొలి విడుతగా 1,289 చెరువుల గుర్తింపు
- ఉపాధిహామీ పథకం కింద పూడికతీత పనులు
- ప్రజా భాగస్వామ్యం పెంచేలా చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చేపట్టిన చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో మరో అంకం మొదలుకానున్నది. పెద్ద చెరువులకు పూర్వ వైభవం తెచ్చేందుకు చేపట్టిన మిషన్ కాకతీయ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న నేపథ్యంలో చిన్న చెరువుల పునరుద్ధరణలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధిహామీ పథకం కింద చిన్న చెరువుల పూడికతీత పనులు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకుగాను మొదటి విడుతలో 1,289 చెరువులను గుర్తించారు. ఇవి చిన్న చెరువులు కావడంతో నేరుగా కూలీల ద్వారా పూడికతీత పనులు చేపట్టనున్నారు. దీంతో గ్రామీణ ప్రజలకు ఉపాధి లభించడంతోపాటు చెరువులు పూర్వ వైభవాన్ని సంతరించుకోనున్నాయి.

### 21వేలకుపైగా చెరువుల పునరుద్ధరణ పూర్తి

రాష్ట్రంలో కృష్ణా, గోదావరి బేసిన్లలో 46,531 గొలుసుకట్టు చెరువులు ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. సమైక్యరాష్ట్ర పాలనలో ధ్వంసమైన చెరువులకు పూర్వవైభవాన్ని తెచ్చేందుకు మిషన్ కాకతీయ చేపట్టి, వేలాది చెరువులను జలభాండాగారాలుగా మార్చింది. నాలుగు విడుతలుగా దాదాపు 28వేల చెరువుల పునరుద్ధరణ పనులు



చేపట్టింది. ఇందులో దాదాపు 21వేలకుపైగా పనులు పూర్తయ్యాయి. 21.39 లక్షల ఎకరాలకు ఆయకట్టు ఉన్న వీటి పునరుద్ధరణ పనులకు దాదాపు రూ.4వేల కోట్లు వ్యయమైంది. 13.80 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. పునరుద్ధరణ పనుల్లో కీలకమైన పూడికతీతను భారీ యంత్రాలతో చేపట్టాల్సి వచ్చింది. దాదాపు 23 కోట్ల క్యూబిక్ మీటర్ల పూడికను తొలగించడంతో 8.04 టీఎంసీల అదనపు నీటినిల్వ సామర్థ్యం పెరిగింది. ఆయా ఆయకట్టు రైతులు అత్యంత సారవంతమైన పూడికను తమ పొలాల్లోకి తరలించుకోవడంతో భూసారంతోపాటు దిగుబడి పెరిగింది. రసాయనిక ఎరువుల వాడకం తగ్గింది. రైతుల ఆదాయం పెరగడమే కాకుండా.. రైతులు స్వచ్ఛందంగా పూడికను తరలించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.911.13 కోట్ల మేర ఆదా అయింది. పెద్దచెరువుల పునరుద్ధరణలో యంత్రాల వాడకం అనివార్యం అయినప్పటికీ, చిన్న చెరువుల పునరుద్ధరణలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుతామని ప్రభుత్వం ఆదినుంచి చెప్తున్నది.

## అవాంతరాలు లేకుండా
# ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మార్చిలో ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మార్చిలో నిర్వహించిన ఇంటర్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని, త్రిసభ్య కమిటీ సూచనలు అమలు పరుస్తున్నామని చెప్పారు. పరీక్షలకు సంబంధించి వినిపిస్తున్న అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని స్పష్టంచేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పరీక్షలను పద్బందీగా నిర్వహిస్తామని చెప్పారు.

# బ్లాక్‌చైన్ టెక్నాలజీని వినియోగించాలి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో ఆయుధాల తయారీ, వాటిని వినియోగాన్ని ట్రాక్ చేయడానికి అందుబాటులో ఉన్న బ్లాక్ చైన్ టెక్నాలజీని వినియోగించాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం లోక్‌సభలో ఆయుధాల చట్ట సవరణ బిల్లు-2019పై జరిగిన చర్చలో కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. అధికారిక, అక్రమ ఆయుధాలతో దేశవ్యాప్తంగా నేరపూరిత ఘటనలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఒక వ్యక్తి ఒక గన్ మాత్రమే అనే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావాల్సిన అవసరం ఉన్నదన్నారు. అయితే కొన్నింటికి మినహాయింపు ఇవ్వాలని సూచించారు. ఆయుధాల రవాణా, వినియోగంపై నిఘాకు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో, అంతర్ జిల్లాల మధ్య నిత్యం తనిఖీలు చేపట్టాలని, ఇందుకోసం డ్రోన్‌లు, సీసీటీవీలు, జీపీఎస్ వంటి సాంకేతికతను వినియోగించాలని సూచించారు.

## మంచిర్యాల జిల్లాలో
# ‘స్వదేశీదర్శన్’ అమలుచేయండి

కేంద్రానికి ప్రభుత్వవిప్ బాల్క సుమన్ వినతి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మంచిర్యాల జిల్లాలో స్వదేశీదర్శన్ పథకం అమలు చేయాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం పార్లమెంట్‌లో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. స్వదేశీ దర్శన్ పథకం కింద మంచిర్యాల జిల్లాలోని సరస్వతి బరాజ్, గట్టు మల్లన్నస్వామి దేవాలయం, ఎల్లంపల్లి బరాజ్, కవ్వాల్ వన్యప్రాణుల అభయారణ్యం, ఇందారం, టీ జంక్షన్లను అభివృద్ధిచేయాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ప్రతిపాదిత ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవకాశాలు ఉన్నాయని.. పర్యాటకుల నుంచి మంచి స్పందన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సుమన్ వినతిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, ఎంపీలు గడ్డం రంజిత్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాలోతు కవిత ఉన్నారు.

# ‘ఆయుష్’కు గౌరవాన్ని పెంచుతాం

- దేశంలో తెలంగాణ నంబర్‌వన్ కావాలి
- అందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తాం
- సమీక్ష సమావేశంలో మంత్రి ఈటల



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆయుష్ వైద్యసేవలకు గౌరవాన్ని మరింత పెంచేలా తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తున్నదని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్ వెంగళరావునగర్‌లోని కుటుంబ సంక్షేమశాఖ జాతీయ శిక్షణ కేంద్రంలో సోమవారం ఆయన ఆయుష్ విభాగ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. ఆయుష్ వైద్యసేవలు అందించడంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు అన్ని స్థాయిల్లో కృషిజరగాలన్నారు. ఇందుకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయుష్ ఆధ్వర్యంలోని ఆయుర్వేద, హోమియో, యునాని విభాగాలకు చెందిన 839 డిస్పెన్సరీల్లో వసతుల కోసం ఇప్పటికే కోటి రూపాయలు విడుదలచేసినట్టు తెలిపారు. ఇక నుంచి ఆయుష్ విభాగానికి అవసరమయ్యే మందులన్నింటినీ ఆ విభాగమే తయారుచేసుకొనేలా యంత్ర పరికరాలను సమకూర్చుకొనేందుకు మంత్రి ఈటల అనుమతిచ్చారు.




ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో జరిగిన శిక్షణా తరగతుల కార్యక్రమానికి వచ్చిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను మెమొంటోతో సత్కరిస్తున్న దృశ్యం

# పక్కా ప్రణాళికతోనే అభివృద్ధి

ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:** పకడ్బందీ ప్రణాళికతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం ఎంసీహెచ్చార్డీలో మండల ప్రణాళిక, గణాంక అధికారుల మూడువారాల శిక్షణ తరగతులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతిఅంశాన్ని లోతుగా అధ్యయనం చేస్తారని, ఇదే ప్రణాళికకు బాట వేస్తున్నదని తెలిపారు. మండల ప్రణాళికాధికారులు ఇదేతరహా పద్ధతిని అవలంబించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలతో మమేకం కావాలని సూచించారు. సీఎం కేసీఆర్ విజన్‌ఉన్న నాయకుడని, అందువల్లనే తెలంగాణ విద్యుత్, సాగునీటిరంగాలతోపాటు అనేక విషయాల్లో దేశంలో అగ్రభాగాన నిలిచిందని వినోద్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు జీఆర్ రెడ్డి, ఎంసీహెచ్చార్డీ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య, అదనపు డైరెక్టర్ హరిప్రీత్ సింగ్, స్టాటిస్టికల్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి, ప్లానింగ్ డైరెక్టర్ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సీడ్స్‌పై
# విస్తృత ప్రచారం

నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు

12న ‘విత్తనరథం’ ప్రారంభించనున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న విత్తనోత్పత్తి రకాలు, వాటి వినియోగంపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రైవేట్ కంపెనీలు అంటగడుతున్న నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ఇకపై తామే విత్తనోత్పత్తి చేయాలని విత్తనాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఈ విత్తన రకాల గురించి ప్రచారం చేసేందుకు ‘తెలంగాణ విత్తన రథం’ను ఏర్పాటు చేసింది. ఈ నెల 12న హైదరాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో విత్తనోత్పత్తిపై జరిగే సదస్సులో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలంగాణ విత్తనరథాన్ని ప్రారంభించి, టీఎస్ఎస్‌డీసీ లోగోను ఆవిష్కరించనున్నారు. విత్తనోత్పత్తి చేసే రైతులకు ఈ కార్యక్రమంలో గుర్తింపు అందజేయనున్నారు. ఉత్తమ విత్తనోత్పత్తి చేసిన రైతులకు అవార్డులు ప్రదానం చేయనున్నారు.

## సీఎం కేసీఆర్‌కు
# కృతజ్ఞతలు

ఈఎండీ లేకుండా కాంట్రాక్టు పనులు చేపట్టేలా ఉత్తర్వులు ఇవ్వడంపై సగర ఉప్పర సంఘం ప్రతినిధులు హర్షం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ నిర్మాణ కాంట్రాక్టు పనుల్లో ఈఎండీ లేకుండా సగర ఉప్పర కులస్తులు కాంట్రాక్టు పనులు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల ఆ కుల సంఘం ప్రతినిధులు సంతోషం వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ తీసుకొన్న నిర్ణయం హర్షణీయమన్నారు. సోమవారం ఆబ్కారీ, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంలో కృషి చేసిన బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు కూడా కృతజ్ఞతలు చెప్పారు. సగర ఉప్పర, భగీరథ భవన నిర్మాణానికి రూ.2 కోట్లు, రెండెకరాల భూమి కేటాయించిన టీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని వారు వెల్లడించారు.




టాస్క్ ఒప్పందం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్. చిత్రంలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా తదితరులున్నారు

# సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ


- నాణ్యమైన విద్య అందించే బాధ్యత కాలేజీలదే
- ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్
- నైపుణ్యాభివృద్ధి కోసం టాస్క్ కృషి: రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు, ఉద్యోగులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని అభివృద్ధి కోసం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా, విద్యార్థులు, ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి పెరిగేలా పలు కంపెనీలతో సోమవారం హైదరాబాద్‌లోని ప్లాజా హోటల్‌లో టాస్క్ ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. వివిధ రంగాల్లోని ఉద్యోగులు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం టాస్క్ ఎంతో కృషి చేస్తున్నదని తెలిపారు. అధునాతన సాంకేతికతపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డితోపాటు టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, టీశాట్ సీఈవో శైలేశ్‌రెడ్డి, పలు ఐటీ, కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దృష్టికి ఆశా వర్కర్ల సమస్యలు

టీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషిచేస్తామని టీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్ అన్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో జరిగిన టీఆర్ఎస్‌కేవీ అనుబంధ ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా ఉద్యోగులకు ఇప్పటికే రెండుసార్లు గౌరవవేతనాలు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలుగా ఆశా వర్కర్లు ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి కృషిచేయాలని సూచించారు. సమావేశంలో టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర కన్వీనర్ కాసు మాధవి, సంతోష, రేణుక, కరుణ, ఉమాదేవి, శోభ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్

# కృష్ణమ్మ వెలుగులు

మొదటిపేజీ తరువాయి...

ఎడమకాల్వ (60 మె.వా.), నాగార్జునసాగర్ (815 మె.వా.), పులిచింతల (120 మె.వా.) జలవిద్యుత్ ప్రాజెక్టులు కృష్ణానదిపై ఉండగా.. గోదావరి, దాని ఉపనదులపై పోచంపాడు (36 మె.వా.), నిజాంసాగర్ (10 మె.వా.), సింగూరు (15 మె.వా.) ప్రాజెక్టులు మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణకు జల విద్యుత్ ఉత్పత్తిలో కృష్ణానది ముఖ్యమైనదిగా మారింది.

### భారీగా వరదలతో జోరుగా..

ఈ ఏడాది ప్రకృతి కరుణించింది. ఎగువ ప్రాంతంలోనూ భారీగా వర్షాలు.. అవికూడా విడతలుగా కురువడంతో కృష్ణమ్మకు ఐదారుసార్లు వరదలు పోటెత్తాయి. జూరాల మొదలు పులిచింతల వరకు ఐదారుసార్లు గేట్లు ఎత్తాల్సివచ్చింది. ఈ వర్షాకాలంలో (3.12.2019 నాటికి) జూరాలకు వరద రూపంలో మొత్తం 1437.61 టీఎంసీల నీరు వచ్చింది. అక్కడి నుంచి జల విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తూ, గేట్ల నుంచి దిగువకు నీటిని వదిలిపెట్టారు. ఇలా శ్రీశైలంకు సుమారు 1751 టీఎంసీ వరకు వరద వచ్చిందని రికార్డులు పేర్కొంటున్నాయి. ఆ మేరకు శ్రీశైలం విద్యుత్ యూనిట్లు నిర్విరామంగా సేవలు అందించాయి. అక్కడి నుంచి నాగార్జునసాగర్‌కు దాదాపు 1246 టీఎంసీల నీరు వచ్చింది. అక్కడ కూడా జలవిద్యుత్‌తోపాటు గేట్లు తెరిచి దిగువకు నీటిని వదిలారు. చివరగా పులిచింతలకు దాదాపు 930 టీఎంసీ నీరు వచ్చింది. ఇక్కడకూడా వరద ఉన్నంతకాలం జలవిద్యుత్ ఉత్పత్తి చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఈ ఏడాది (2019-20) మాత్రమే గణనీయంగా జలవిద్యుత్ ఉత్పత్తి అయింది. కృష్ణానదికి భారీగా వచ్చిన వరదల నేపథ్యంలో జెన్‌కో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. పరిస్థితులను అంచనావేస్తూ.. వీలైనంతవరకు జలవిద్యుత్ ఉత్పత్తిపై దృష్టిసారించారు. ఫలితంగా 2019 ఏప్రిల్ నుంచి నవంబరు చివరినాటికి 3938.64 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. అంటే.. డిసెంబరు మొదటివారానికల్లా దాదాపు 4000 మిలియన్ యూనిట్ల మేర జల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. ఇది ఒక రికార్డు. డిసెంబరు మొదటివారంవరకు ఇంతగా జలవిద్యుత్ ఉత్పత్తి ఎప్పుడూ లేదని, రిజర్వాయర్లలో నీరు సమృద్ధిగా ఉండటంతో మరింత జలవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం లభించిందని జెన్‌కో డైరెక్టర్ (హైడల్) వెంకట్రాజం సంతోషాన్ని వ్యక్తంచేశారు.

### చవకగా లభించిన విద్యుత్..

కృష్ణమ్మకు వచ్చిన వరదలతో.. వ్యవసాయరంగం పులకించిపోతుండగా.. జలవిద్యుత్ ఉత్పత్తితో విద్యుత్‌రంగం తన భారాన్ని కొంత తగ్గించుకున్నట్టయ్యింది. నిజానికి మన అవసరాల మేరకు విద్యుత్‌ను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాలంటే.. రూ. 4 నుంచి రూ. 5 వరకు యూనిట్ లభిస్తుంది. అయితే కృష్ణానదికి వచ్చిన భారీ వరదలతో జలవిద్యుత్‌ను గరిష్ఠంగా ఉత్పత్తి చేయడం.. అదంతా రాష్ట్ర అవసరాలకు ఉపయోగించడంతోపాటు.. ఒక్కో యూనిట్ ఇందులో సగం ఖర్చుతోనే ఉత్పత్తి కావడం తెలంగాణకు కలిసి వచ్చినట్టయ్యింది. పైగా కృష్ణానదిపై ఉన్న జలవిద్యుత్ కేంద్రాల ద్వారా.. దక్షిణాది గ్రిడ్‌కు ఇబ్బందులు కలుగకుండా కూడా చూస్తున్నారు.

**గడిచిన ఐదేండ్లలో మన రాష్ట్రంలో జరిగిన జల విద్యుత్ ఉత్పత్తి వివరాలు.. (మిలియన్ యూనిట్లలో)**

| నెల | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 |
|---|---|---|---|---|---|
| ఏప్రిల్ | 24.19 | 0.04 | 28.88 | 7.4 | 38.81 |
| మే | 3.98 | 7.0 | 14.94 | 8.86 | 0.03 |
| జూన్ | 0.28 | 9.5 | 0.0 | 8.05 | 0.0 |
| జూలై | 0.70 | 61.2 | 0.0 | 116.25 | 4.54 |
| ఆగస్టు | 0.06 | 361.9 | 0.0 | 677.72 | 734.13 |
| సెప్టెంబర్ | 34.32 | 261.1 | 400.75 | 371.88 | 1243.31 |
| అక్టోబర్ | 35.74 | 236.05 | 603.39 | 245.42 | 1292.89 |
| నవంబర్ | 65.86 | 18.49 | 103.51 | 60.76 | 624.93 |
| డిసెంబర్ | 33.02 | 58.6 | 109.33 | 110.45 | — |
| జనవరి | 2.93 | 118.78 | 72.24 | 67.08 | — |
| ఫిబ్రవరి | 46.29 | 101.62 | 79.47 | 37.76 | — |
| మార్చి | 42.95 | 71.27 | 101.97 | 37.61 | — |
| **మొత్తం** | **290.32** | **1305.55** | **1514.48** | **1749.24** | **3938.64** |

### ప్రకృతి కరుణించింది



తెలంగాణ ఏర్పడ్డాక ఈస్థాయిలో జలవిద్యుత్ ఉత్పత్తి ఇదే మొదటిసారి. కృష్ణాకు వచ్చిన వరదలతో ఇప్పటివరకు సుమారు 4000 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం రికార్డు. సీఎం కేసీఆర్ దేశంలోనే మొదటిసారిగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న తెలంగాణకు కృష్ణానది వరదలు కూడా సహకరించాయి.

**- దేవులపల్లి ప్రభాకర్‌రావు, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ**

# ఆర్టీసీ ఉద్యోగినికి చెర్రీ కలర్ ఏప్రన్

మొదటిపేజీ తరువాయి...

చర్యలు చేపట్టింది. ఇందుకోసం అన్ని డిపోల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల నుంచి అభిప్రాయాలు తీసుకున్న యాజమాన్యం చెర్రీ రంగు ఏప్రన్ డ్రెస్‌ను ఎంపికచేసింది. ఒక్కో ఉద్యోగినికి రెండు డ్రెస్‌ల చొప్పున మొత్తం 9వేల వరకు ఏప్రన్లు సిద్ధం చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే ఏకమొత్తంలో ఆర్డర్ ఇస్తే కొలతల సమస్య తలెత్తవచ్చని.. క్లాత్ ఇచ్చి కుట్టించుకునే వెసులుబాటు ఇస్తే సౌకర్యంగా ఉంటుందని కొందరు అధికారులు సూచిస్తున్నారు. దీనిపై ఒకట్రెండురోజుల్లో నిర్ణయం తీసుకుంటారని తెలుస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగులు వలే ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు కూడా మూడు నెలల పాటు చైల్డ్‌కేర్ లీవ్స్‌పై రెండ్రోజుల్లో ఆదేశాలు ఇవ్వనున్నారు. డిపోలవారీగా మహిళలకు ప్రత్యేకంగా టాయిలెట్లు, డ్రెస్‌చేంజ్ గదులను తాత్కాలికంగా ఏర్పాటుచేస్తున్నారు. కాలం చెల్లిన బస్సులను టాయిలెట్లు మార్చి వినియోగించుకునే ఆలోచన చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి ఎనిమిది గంటలలోపు మహిళా ఉద్యోగులు విధులు పూర్తిచేసేలా డిపోలవారీగా అధికారులు చర్యలు చేపట్టారు.

### వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుకు చర్యలు

యూనియన్లతో సంబంధం లేకుండా కార్మికుల సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటుచేసేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. ప్రతి డిపో, డివిజన్, రీజియన్ నుంచి ప్రాతినిధ్యం ఉండేలా ఈ బోర్డు ఉంటుందని తెలుస్తున్నది. ప్రతి డిపో నుంచి ఇద్దరి చొప్పున ఎంపిక చేయటం వల్ల క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు తెలుసుకోవటం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. బోర్డు ఏర్పాటు, పనితీరు, బాధ్యతలు ఎలా ఉండాలనే అంశాలపై అధికారులు సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. కార్మికుడికి, యాజమాన్యానికి మధ్యలో ఎలాంటి పవర్‌సెల్స్ లేకుండా ఉండాలని, కార్మికులు తమ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లేలా వెల్ఫేర్ బోర్డు ఉంటుందని పలువురు అధికారులు అంటున్నారు. కార్మికుల సమస్యలు ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయి అధికారులకు తెలిసేలా డిపోలవారీగా ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఉద్యోగుల తల్లిదండ్రులకు బస్‌పాసులు ఇచ్చేందుకు రెండ్రోజుల్లో ఆదేశాలు జారీకానున్నాయి.

### పది రోజుల్లో ఆర్టీసీ తీసుకున్న నిర్ణయాలు

- సంస్థకు తక్షణ సాయం కింద రూ.100 కోట్లు ఇస్తూ డిసెంబర్ 1 రాత్రి జీవో విడుదల.
- ఉద్యోగులకు సెప్టెంబర్ నెల జీతాల చెల్లింపు
- సమ్మె కాలంలో మృతి చెందిన కార్మిక కుటుంబాల్లో ఒకరికి చొప్పున మొత్తం 38 మందికి ఉద్యోగాలు. ప్రభుత్వం తరపున ఒక్కో కుటుంబానికి రూ. 2లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత.
- రాత్రి 8 గంటల లోపు ముగిసే డ్యూటీలను మాత్రమే మహిళా ఉద్యోగులకు కేటాయించడానికి వేగంగా ప్రక్రియ.
- మహిళల కోసం ప్రత్యేకంగా టాయిలెట్లు, డ్రెస్ చేంజ్‌రూమ్స్ ఏర్పాటుకు చర్యలు.
- మహిళా ఉద్యోగులకు ఖాకీ డ్రెస్ బదులు, చెర్రీ రంగు ఏప్రన్ ఇవ్వాలని నిర్ణయం.
- 296 మంది డ్రైవర్లు, 63 మంది కండక్టర్లను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు.
- ఆర్టీసీలో కార్మికులు అని పిలిచే పద్ధతికి స్వస్తి. ఇక నుంచి అందరూ ఉద్యోగులుగానే పరిగణింపు.
- రెండ్రోజుల్లో ఉద్యోగుల తల్లిదండ్రులకు ఉచిత బస్‌పాసులు.

## ఫ్లైఓవర్ ప్రమాద నిందితుడికి
# స్వల్ప ఊరట

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ మాదాపూర్ బయోడైవర్సిటీ ఫ్లైఓవర్ ప్రమాదంలో నిందితుడు కృష్ణమిలన్‌రావుకు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. బెయిలబుల్ కేసుల్లో తనను అరెస్ట్ చేసేందుకు పోలీసులు యత్నిస్తున్నారని నిందితుడు పిటిషన్ దాఖలుచేయడంతో వారంరోజులపాటు అతడిని అరెస్ట్ చేయవద్దని హైకోర్టు పేర్కొన్నది.

# ప్రభుత్వాధికారులకు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హాస్టళ్లలో వసతులు, భ్రూణ హత్యలపై పత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటో కేసులుగా స్వీకరించిన హైకోర్టు.. సోమవారం వాటిపై విచారణ చేపట్టింది. ఆయా కేసుల్లో కౌంటర్ అఫిడవిట్లు దాఖలుచేయాలని సంబంధితశాఖల అధికారులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను నాలుగువారాలపాటు వాయిదా వేసింది.

epaper.ntnews.com

## ఎములాడకు పోటెత్తిన భక్తజనం



వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కోడెమొక్కు చెల్లించుకున్నారు. అభిషేక, అన్న పూజలు, కుంకుమ పూజలు, గండదీపం, పల్లకీసేవలు, పెద్దసేవలు, కల్యాణాల మొక్కులు నిర్వహించుకున్నారు. రాజన్నను 40 వేల మందికిపైగా భక్తులు దర్శించుకోగా, వివిధ ఆర్జితసేవల ద్వారా ఆలయానికి సుమారు రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

- వేములవాడ కల్చరల్

## చెట్టును ఢీకొట్టిన కారు.. వాహనదారుడికి జరిమానా



సిద్దిపేట పట్టణ పరిధిలోని వైద్య కళాశాల వద్ద హరితహారంలో నాటిన చెట్టును ఓ వాహనం ఢీకొనడంతో ధ్వంసమైంది. ఈ మేరకు సదరు వాహనదారుడు రాకేశ్‌కు రూ.9,500 జరిమానా విధించినట్టు హరితహారం అధికారి ఐలయ్య తెలిపారు. హరితహారంలో పెంచుతున్న మొక్కలను ప్రతి ఒక్కరు రక్షించాలని సూచించారు. మొక్కలను ధ్వంసం చేస్తే చర్యలు తప్పవన్నారు.

- సిద్దిపేటకలెక్టరేట్, నమస్తే తెలంగాణ

# దేశానికి సరికొత్త దిక్సూచి మిషన్ భగీరథ

- ఈ గొప్పతనం తెలంగాణ ప్రభుత్వానిదే
- డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాలు బాగున్నాయి
- జార్ఖండ్ సీఎంవో కార్యదర్శి సునీల్‌కుమార్ బర్నవాల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ గజ్వేల్ రూరల్ / మర్కూక్:** మిషన్ భగీరథ పథకం ద్వారా తెలంగాణ ప్రభుత్వం దేశానికే దిశానిర్దేశం చేసిందని జార్ఖండ్ సీఎంవో కార్యదర్శి సునీల్ కుమార్ బర్నవాల్ ప్రశంసించారు. సిద్దిపేట జిల్లాలో సోమవారం పర్యటించిన ఆయన ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ మేరకు మర్కూక్ మండలంలోని సీఎం దత్తత గ్రామం ఎర్రవల్లితోపాటు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ సంగాపూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం, ప్రజ్ఞాపూర్‌లో మిషన్ భగీరథ నీటి సరఫరా, కోమటిబండలో సంప్‌హౌస్ నిర్మాణాలను పరిశీలించారు. ఎర్రవల్లిలో జరిగిన అభివృద్ధి పనులను సర్పంచ్ భాగ్యాభిక్షపతి ఆయనకు వివరించగా, 'ఎర్రవల్లి బహుత్ అచ్ఛాహై.. బహుత్ సుందర్ హై'.. అని కితాబిచ్చారు. ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాల పెంపుపై తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి మిషన్ భగీరథనే నిదర్శనమన్నారు. కోమటిబండ సంప్‌హౌస్, నీటి శుద్ధీకరణను పరిశీలించారు. భగీరథ నీటిని తాగి పరీక్షించారు. కార్యక్రమంలో జేసీ పద్మాకర్, భగీరథ చీఫ్ ఇంజినీర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో మిషన్ భగీరథ నీటిని తాగుతున్న సునీల్‌కుమార్ బర్నవాల్



## చిన్నారులపై లైంగికదాడికి యత్నించిన బాలుడు

**వెల్దండ:** ఇద్దరు చిన్నారులపై ఓ బాలుడు లైంగికదాడికి యత్నించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో సోమవారం వెలుగు చూసింది. కల్వకుర్తి డీఎస్పీ గిరిబాబు, సీఐ నాగరాజు కథనం ప్రకారం.. వెల్దండలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి(14) ఆదివారం తన ఇంటి పక్కన ఆడుకుంటున్న 5 ఏండ్లలోపు ఇద్దరు చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. చిన్నారులను ఇంట్లోకి తీసుకెళ్లి తన సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చూపిస్తూ అసభ్యంగా ప్రవర్తించాడు. చిన్నారులు భయంతో ఏడుస్తూ బయటకు పరుగులు పెట్టి విషయాన్ని ఓ చిన్నారి తన నానమ్మకు చెప్పడంతో విషయం వెలుగుచూసింది. వెంటనే ఆ చిన్నారుల తల్లిదండ్రులు వెల్దండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ గిరిబాబు సోమవారం ఘటనా స్థలానికి వెళ్లి విచారణ నిర్వహించి.. బాలుడిపై పోక్సో కేసు, 354 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

## వివాహితపై లైంగికదాడికి యత్నం

**ఫెర్టిలైజర్‌సిటీ:** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం గుంటూరుపల్లి శివారులో ఆదివారం రాత్రి ఓ వివాహితపై గుర్తు తెలియని వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన వివాహిత, తన సోదరి కూతురు, అల్లుడితో కలిసి కోళ్ల ఫారంలో కూలి పనికి వెళ్లింది. ఆదివారం రాత్రి గ్రామానికి తిరిగి వస్తుండగా మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు వాహనంపై వచ్చి అడ్డగించారు. వివాహితను పొదల్లోకి లాక్కెళ్లేందుకు యత్నించారు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పాపయ్య కుటుంబ సభ్యులకు చెక్కు, నియామక పత్రాలను అందజేస్తున్న మంత్రి దయాకర్‌రావు

## ఆర్టీసీకి జీవం పోసిన సీఎం కేసీఆర్

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**రాయపర్తి:** మూసివేత దశకు చేరుకొన్న ఆర్టీసీని సంస్కరించి సీఎం కేసీఆర్ జీవం పోశారని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తిలో నిర్మించిన నూతన బస్టాండ్‌ను సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత పాలకులు అనుసరించిన వ్యతిరేక విధానాలు, యూనియన్ల పెత్తనాలతో ఆర్టీసీ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. సమ్మె కారణంగా సంస్థకు కోలుకోలేని నష్టాలురావడం, కార్మికులు పిట్టల్లా రాలిపోతున్న పరిస్థితిని గమనించిన సీఎం చర్యలు చేపట్టారన్నారు. సమ్మె సమయంలో మానసిక ఒత్తిడితో చనిపోయిన తొర్రూరు డిపో కండక్టర్ వెంకట పాపయ్య కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కుతోపాటు ఆయన కూతురు ఆమనికి తొర్రూరు డిపోలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేశారు. అనంతరం వివిధ గ్రామాల రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.



కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని ఝాన్సీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలి

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల

**చొప్పదండి, నమస్తే తెలంగాణ:** దేశానికి ఆదర్శంగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన గాయత్రి పంపుహౌస్ సైన్స్ పరిజ్ఞానంతోనే సాధ్యమైందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని ఝాన్సీ విద్యాలయంలో నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే అంశాలపై పరిశోధనలు చేసి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఈటల పిలుపునిచ్చారు. స్మార్ట్ ఫోన్ల వినియోగంతోనే విద్యార్థులు, యువత బంధాలకు దూరమవుతూ పక్కదారికి పడుతున్నారన్నారు. తరగతి గదుల్లో పాఠాలు చెప్పే గురువులు మార్కుల కోసం కాకుండా మార్పు కోసం విద్యాబుద్ధులు నేర్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారార్ @ 22.5 టీఎంసీలు

- గాయత్రిలో కొనసాగుతున్న ఎత్తిపోతలు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మాన్వాడ వద్ద ఉన్న శ్రీరాజరాజేశ్వర జలాశయంలో నీటి మట్టం 22.529 టీఎంసీలకు చేరింది. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్‌లో కాళేశ్వర జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఈ నెల 5న 1, 3వ పంపులను ప్రారంభించగా ఇప్పటివరకు 2.4 టీఎంసీల నీటిని ఎస్సారార్‌కు ఎత్తిపోశాయి. 25 టీఎంసీలకుపైగా నీటి నిల్వ సామర్థ్యమున్న రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపాలన్న ఆదేశాలతో ఎల్లంపల్లి నుంచి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నంది రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తుండగా, అక్కడ 4వ పంప్ ద్వారా ఎత్తిపోసిన నీరు జంట సొరంగాల ద్వారా గాయత్రి పంపుహౌస్‌కు చేరుకుంటున్నాయి. ఇక్కడ ఎత్తిపోసిన నీరు డెలివరీ సిస్టర్న్ నుంచి గ్రావిటీ కాల్వ ద్వారా వరద కాల్వ వైపు ప్రవహిస్తున్నాయి. శ్రీరాములపల్లి శివారులోని వరద కాల్వకు 99వ కిలోమీటర్ వద్ద నిర్మించిన జంక్షన్ పాయింట్ హెడ్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తివేయడంతో ఎస్సారార్‌కు పరుగులు తీస్తున్నాయి. సోమవారం సాయంత్రం 6 వరకు ఇన్‌ఫ్లో 7,153 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 150 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రస్తుతం 22.529 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ అశోక్‌కుమార్ తెలిపారు.

**సరస్వతి బరాజ్‌కు జలాలు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మి పంప్‌హౌస్‌లోని 1, 5, 6, 7వ మోటర్ల ద్వారా సరస్వతి బరాజ్‌కు 8,460 క్యూసెక్కుల నీరు వెళుతున్నది. డెలివరి సిస్టర్న్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా జలాలు సరస్వతి బరాజ్‌కు తరలివెళ్తున్నాయి. ప్రస్తుతం ఈ బరాజ్‌లో 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఇంజినీర్లు తెలిపారు.





కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్‌లో కాళేశ్వరం జలాలను ఎత్తిపోస్తున్న బాహుబలి మోటర్లు

## మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రామన్న మృతి!

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ అలియాస్ రామన్న ఆదివారం ఛత్తీస్‌గఢ్ బస్తర్ జిల్లాలోని దండకారణ్యంలో గుండెపోటుతో మరణించినట్టు తెలిసింది. నక్సలైట్ ఉద్యమం తొలినాళ్లలోనే 1979-80 రావుల శ్రీనివాస్ దండకారణ్యం బాటపట్టారు. సిద్దిపేట జిల్లా మద్దూర్ మండలం బెక్కల్ గ్రామానికి చెందిన రామన్న ఉద్యమంలో చేరిన నాటి నుంచి అంచెలంచెలుగా సెంట్రల్ కమిటీ మెంబర్‌గా ఎదిగారు. గిరిజన మహిళ సావిత్రిని వివాహం చేసుకోగా, ఆమె కిష్టారం ఏరియా కమిటీ కార్యదర్శిగా పని చేస్తున్నది. ఈయన పేరు మీద తెలంగాణ, ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ర్టాల ప్రభుత్వాలు రివార్డు ప్రకటించాయి. అయితే రామన్న మరణించినట్టు మావోయిస్టు పార్టీ వర్గాలు ధ్రువీకరించలేదు.

## చిగురుమామిడి సింగిల్ విండో పాలకవర్గం రద్దు

**చిగురుమామిడి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గాన్ని రద్దు చేస్తున్నట్టు కరీంనగర్ జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ తెలిపారు. చిగురుమామిడి పీఏసీఎస్ ఆధ్వర్యంలో గన్నేరువరం మండలం చొక్కారావుపల్లిలోని కొనుగోలు కేంద్రంలో ఖరీఫ్ సీజన్‌లో అక్రమాలకు పాల్పడినట్టు జెడ్పీ సమావేశంలో సభ్యులు ఆరోపణలు చేశారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశాల మేరకు విచారణ చేయగా అక్రమాలు జరిగినట్టు వెల్లడైంది. సబ్సిడీపై ట్రాక్టర్ కొనుగోలులోనూ అక్రమాలకు పాల్పడినట్టు ఆధారాలు లభించడంతో, ప్రస్తుత పాలకవర్గాన్ని రద్దు చేశామని మనోజ్‌కుమార్ తెలిపారు.



కలెక్టర్‌కు దండం పెట్టి కృతజ్ఞతలు చెబుతున్న నర్సయ్య

## లంచం తీసుకున్న వీఆర్‌ఏ

- తిరిగి ఇప్పించిన కలెక్టర్

**జగిత్యాల, నమస్తేతెలంగాణ:** తన పేరు మీద ఉన్న భూమిని పట్టా చేయాలని కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన నర్సయ్య వీఆర్‌ఏకు రూ.10 వేల లంచం ఇచ్చినా పని చేయడం లేదని నాలుగు రోజుల క్రితం ఫిర్యాదు చేయగా కలెక్టర్ శరత్ వెంటనే స్పందించారు. సదరు ఫిర్యాదుపై విచారణ చేపట్టి బాధితుడికి పట్టా చేయించారు. అంతేగాక లంచం డబ్బులను సైతం సోమవారం తిరిగి ఇప్పించారు. ఆ వెంటనే వీఆర్‌ఏ మహేశ్‌ను సస్పెండ్ చేశారు.

## సామాన్యులకు అందుబాటు ధరలో ఉల్లి

- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

**నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ:** ఉల్లి ధర సామాన్యులకు అందుబాటులో ఉండేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్టు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో తన చిన్ననాటి స్నేహితుడి కొడుకు పెండ్లికి హాజరైన మంత్రి, స్థానిక ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వపరంగా రూ.40 కిలో చొప్పున ఉల్లిగడ్డ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉల్లిగడ్డకు ఒకే ధరను నిర్ణయించే దిశగా ప్రభుత్వం యోచిస్తుందని చెప్పారు. రైతులకు ఉల్లి విత్తనాలను సబ్సిడీపై అందజేయాలని ఇటీవల నిర్ణయించినట్టు తెలిపారు. రైతులు ఉల్లి సాగును దశల వారీగా చేపడితే ధరలు స్థిరంగా ఉంటాయని, అందుకనుగుణంగా రైతులకు అవగాహన కల్పించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.



నారాయణఖేడ్ మండలం లింగాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# ప్రమాదకరంగా చేపలవేట

- విద్యుత్ తీగల వినియోగం
- నిజామాబాద్ జిల్లాలో ఒకరి మృతి

**ముప్కాల్:** కరంటు షాక్‌తో చేపలు పట్టే ప్రక్రియ పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా సాగుతున్నది. కుంటలు, కాల్వల్లోకి విద్యుత్ ప్రసారంతో చేపలు చనిపోయేలా చేయడం ఈ చేపల వేటలో కీలకం కాగా, పలుచోట్ల ఈ ప్రయోగం వికటించి ప్రాణాలు పోతున్న ఉదంతాలున్నాయి. తాజాగా నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం వెంచిర్యాల్ సమీపంలోని పెద్దవాగులో రామస్వామి(55) అనే వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి మృతిచెందాడు. ముప్కాల్ ఎస్సై రాజ్‌భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్దవాగులో కరెంటు తీగలను ఉపయోగించి చేపలను పడుతుండగా ప్రమాదవశాత్తు అదే నీటిలో రామస్వామి పడిపోయి విద్యుదాఘాతానికి గురయ్యాడు. మృతుడిది మంచిర్యాల జిల్లా కాగా ఆయనకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. గ్రామం లో పాలేరుగా పని చేసే ఆయన చేపలు పట్టేందుకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బాల్కొండ దవాఖానకు తరలించారు.

**వ్యవసాయ పంపుసెట్ నుంచి విద్యుత్**

నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కరెంటు షాక్ ద్వారా చేపలు పట్టడం సాధారణమే. చిన్న చిన్న కుంటలు, పిల్ల కాల్వల్లో ప్రధానంగా ఈ పద్ధతిలో చేపల వేట సాగిస్తారు. సమీప వ్యవసాయ క్షేత్రాల్లోని పంపుసెట్ల నుంచి అక్రమంగా విద్యుత్ తీగను అమర్చి దాని మరో కొసను కర్ర సహాయంతో నీటిలో ముంచుతారు. కరెంటుషాక్‌తో చనిపోయే చేపలన్నింటినీ సేకరించి పల్లెల్లో విక్రయిస్తుంటారు. చేపల దొంగతనానికి పాల్పడే వ్యక్తులు తక్కువ సమయంలో ఎక్కువ చేప ల్ని పట్టేందుకు ఈ పద్ధతిని అవలంబిస్తున్నారు. అయితే పలుచోట్ల ఈ ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలు కూడా ఉన్నాయి. ర

## తిమ్మాపూర్ సర్పంచ్‌కు రూ.వెయ్యి జరిమానా

- పారిశుద్ధ్య లోపంపై మంత్రి సబితారెడ్డి ఆగ్రహం

**కందుకూరు:** పారిశుద్ధ్య నిర్వహణ సరిగాలేక పోవడంతో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్ సర్పంచ్‌కు విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి రూ.వెయ్యి జరిమానా విధించారు. గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మంత్రి రోడ్ల వెంట ఉన్న చెత్తను చూసి సర్పంచ్ గోపాల్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే.. ఇంత నిర్లక్ష్యం ఏంటని ప్రశ్నించారు. చెత్తతరలింపు కోసం ట్రాక్టర్ మంజూరు చేయాలని ఆమె ఎంపీడీవోను ఆదేశించారు.

## కొడుకుల నుంచి కాపాడండి సారూ!

- రక్షణ కల్పించాలని వేడుకోలు
- 'ప్రజావాణి'లో మానుకోట జేసీకి వృద్ధ దంపతుల ఫిర్యాదు

**మహబూబాబాద్, నమస్తేతెలంగాణ:** కొడుకులు, కోడళ్ల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన వృద్ధ దంపతులు బచ్చుబోయిన దర్గయ్య, లింగమ్మ సోమవారం జాయింట్ కలెక్టర్ డేవిడ్‌కు విన్నవించారు. తమ ఆధీనంలో ఉన్న ఎకరం పొలంతోపాటు 500 గజాల ఇంటి స్థలాన్ని అప్పగించాలని ఇద్దరు కుమారులతోపాటు కోడళ్లు తమను దుర్భాషలాడటంతోపాటు భౌతికంగా దాడులకు దిగుతున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినా వారు వినడం లేదని వాపోయారు. డోర్నకల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా.. పోలీసులు, పెద్దమనుషులు తమ కుమారుల పక్షాన్నే మాట్లాడుతున్నారని ఆరోపించారు. తమకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని.. వారి వద్ద కూడా ఉండనీయకుండా కొడుకులు అడ్డుపడుతున్నారని తెలిపారు. ఇలా చేస్తే తాము ఎలా బతికేదని, తమకు దిక్కెవరని? బోరున విలపించారు. అధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని వారు వేడుకున్నారు.



మహబూబాబాద్ కలెక్టరేట్‌లో తమ కొడుకుల నుంచి రక్షణ కల్పించాలని ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వృద్ధులు

# స్వల్పంగా తగ్గిన చలి

**హైదరాబాద్‌సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో చలి తీవ్రత స్వల్పంగా తగ్గింది. ఉష్ణోగ్రతలు పెరగడంతో చలి ప్రభావం తగ్గుముఖం పట్టినట్టు వాతావరణకేంద్రం అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 28 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత, 19.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత, గాలిలో తేమ 56 శాతం నమోదైందని అధికారులు చెప్పారు. గత ఏడాది కంటే ఈసారి చలిప్రభావం తక్కువగా నమోదవుతున్నట్టు అధికారులు చెప్తున్నారు.

**రాష్ట్రంలో పొడి వాతావరణం**


శ్రీలంక తీరానికి దగ్గరలో నైరుతి బంగాళాఖాతంలో సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది. తెలంగాణలో ప్రధానంగా ఈశాన్య, తూర్పు దిశలనుంచి గాలులు వీస్తున్నాయి. రాగల మూడురోజుల్లో రాష్ట్రమంతటా పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు.

### చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం | జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|---|---|---|
| | | | పెద్దపల్లి | 18.0 | 29.0 |
| | | | రాజన్న సిరిసిల్ల | 18.0 | 29.0 |
| | | | వనపర్తి | 18.0 | 33.2 |
| ఆదిలాబాద్ | 14.6 | 29.5 | జనగామ | 18.1 | 28.0 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 15.0 | 30.0 | సంగారెడ్డి | 18.5 | 28.0 |
| మెదక్ | 15.9 | 33.2 | యాదాద్రి భువనగిరి | 19.0 | 28.0 |
| నిర్మల్ | 16.0 | 30.0 | సూర్యాపేట | 19.0 | 28.0 |
| జగిత్యాల | 16.0 | 30.0 | ములుగు | 19.0 | 29.0 |
| మంచిర్యాల | 16.0 | 32.1 | మహబూబాబాద్ | 190 | 29.0 |
| వరంగల్ రూరల్ | 17.0 | 28.0 | జయశంకర్ భూపాలపల్లి | 19.0 | 30.0 |
| కామారెడ్డి | 17.0 | 28.0 | భద్రాద్రి కొత్తగూడెం | 19.0 | 30.0 |
| రంగారెడ్డి | 17.0 | 29.0 | జోగులాంబ గద్వాల | 19.0 | 31.0 |
| నాగర్‌కర్నూల్ | 17.1 | 28.0 | ఖమ్మం | 19.0 | 31.0 |
| వికారాబాద్ | 17.2 | 32.9 | నిజామాబాద్ | 19.5 | 29.3 |
| నల్లగొండ | 17.4 | 30.0 | హైదరాబాద్ | 19.7 | 28.0 |
| కరీంనగర్ | 17.4 | 32.9 | మేడ్చల్ | 19.7 | 28.0 |
| వరంగల్ అర్బన్ | 17.5 | 30.0 | నారాయణపేట | 20.5 | 29.6 |
| సిద్దిపేట | 18.0 | 28.0 | మహబూబ్‌నగర్ | 20.5 | 29.6 |

# రక్తమోడిన రహదారి

- జంగంపల్లి వద్ద మర్రి చెట్టును ఢీకొన్న కారు
- అక్కడికక్కడే నలుగురి మృతి
- అతివేగం, నిద్రమత్తుతోనే ప్రమాదం



కామారెడ్డి జిల్లా జంగంపల్లి వద్ద చెట్టును ఢీకొని నుజ్జునుజ్జయిన కారు.. మృతులు లావణ్య, రోషిణి, ప్రశాంత్,సుశీల్ (ఫైల్)

**కామారెడ్డి ప్రతినిధి, నమస్తే తెలంగాణ/రాజంపేట:** అతివేగంగా వెళ్తున్న కారు చెట్టును ఢీకొట్టగా నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ప్రమాదంలో నిజామాబాద్‌లోని పద్మానగర్‌కు చెందిన మంతెన లావణ్య(35), ఆమె కూతురు రోషిణి(15)తోపాటు నవీపేటకు చెందిన మ్యాతరి ప్రశాంత్(30), ఆర్మూర్ వాసి అంగుర్ సుశీల్ (22) ఉన్నారు. భిక్కనూర్ సీఐ కథనం ప్రకారం లావణ్య(35)కు కొడుకు రోషన్, కూతురు రోషిణి ఉన్నారు. ఆమె భర్త ఉపాధిరీత్యా దుబాయ్‌లో ఉంటున్నారు. వీరి నివాసంలోనే అద్దెకు ఉన్న అరుణ్ అనే వ్యక్తికి ఈ మధ్యే ఇరాక్‌లో ఉపాధి వీసా లభించింది. అతడిని ఇరాక్‌కు పంపించేందుకు అరుణ్ స్నేహితులు సుశీల్, ప్రశాంత్‌లతో కలిసి లావణ్య, రోషిణిలు తమ సొంత వాహనంలో ఆదివారం రాత్రి 10 గంటలకు శంషాబాద్ వెళ్లారు. అరుణ్‌ను విమానం ఎక్కించి తిరుగు ప్రయాణమయ్యారు. భిక్కనూర్ మండలం జంగంపల్లి శివారులో సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో వీరి కారు చెట్టును ఢీకొన్నది. ఉదయం 5 గంటలకు మర్రిచెట్టు పక్కనే చాయ్ హోటల్ తెరిచేందుకు వచ్చిన నర్సాగౌడ్ ప్రమాదాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అతి వేగంతో దూసుకొచ్చిన కారు మర్రి చెట్టును బలంగా ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జవగా, మృతదేహాలన్నీ అందులోనే ఇరుక్కుపోయాయి. గ్యాస్ కట్టర్‌తో కారు భాగాలను తొలగించి మృతదేహాలను బయటకు తీశారు.

**లారీ, బస్సు ఢీ ఇద్దరు మృతి**

**నందిగామ:** రంగారెడ్డి జిల్లా నందిగామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ప్రైవేట్ బస్సు, లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న కర్నూలు జిల్లా వెలుగోడుకు చెందిన ఇజాజ్(24), ప్రొద్దుటూరుకు వాసి వెంకట సుబ్బయ్య(65) మరణించారు.

## భర్త హత్యకు కుట్ర పన్నిన భార్య అరెస్టు

**దామరచర్ల(అడవిదేవులపల్లి):** భర్త హత్యకు కుట్ర పన్నిన భార్య, ఆమెకు సహకరించిన వారిని సోమవారం నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడకు చెందిన శిరీషకు అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లికి చెందిన ఆమె మేనమామ కృష్ణతో 15 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. కృష్ణతో వివాహం ఇష్టం లేని శిరీష అతడితో తరచూ గొడవ పడేది. భర్తను ఎలాగైనా వదిలించుకోవాలని నిర్ణయించుకొన్న శిరీషకు కొద్దిరోజుల క్రితం పరిచయమైన గుంటూరు జిల్లావాసి సిద్ది సాయికుమార్ సహకారంతో 8 మంది కిరాయి హంతకులకు రూ.8 లక్షలు సుపారీ చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నది. పథకంలో భాగంగా సినీఫక్కీలో చంపేందుకుప్రయత్నించగా, కృష్ణ పోలీసులను ఆశ్రయించాడు. విచారణలో కుట్ర వెల్లడవడంతో పోలీసులు శిరీష, మరో ఏడుగురిని అరెస్టు చేశారు.




యూత్ టేబుల్ టెన్నిస్ జాతీయ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచి సోమవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఫిడేల్ ఆర్ స్నేహిత్‌కు స్వాగతం పలుకుతున్న తెలంగాణ టీటీ అసోసియేషన్ ప్రతినిధులు

# రష్యాపై వేటు

నాలుగేండ్ల నిషేధం విధించిన వాడా

డోపింగ్ టెస్టులు తారుమారు చేసినట్టు నిర్ధారణ

టోక్యో ఒలింపిక్స్ సహా ప్రధాన టోర్నీలకు దూరం





**లుసాన్ (స్విట్జర్లాండ్):** ఒలింపిక్స్‌లో ప్రధాన పోటీదారుగా ఉన్న రష్యాకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. 2020 టోక్యో ఒలింపిక్స్, 2022 బీజింగ్ వింటర్ ఒలింపిక్స్, 2022 ఫుట్‌బాల్ ప్రపంచకప్ సహా మరో నాలుగేండ్ల పాటు ప్రధాన క్రీడా టోర్నీలకు ఆ దేశం దూరం కానుంది. మాస్కోలోని ల్యాబోరేటరీలో అథ్లెట్ల డోపింగ్ టెస్టులకు సంబంధించిన వివరాలను తారుమారు చేసిందని నిర్ధారించిన అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) రష్యాపై నాలుగేండ్ల నిషేధం విధించింది. ఈ మేరకు సోమవారం ఇక్కడ సమావేశమైన వాడా ఎగ్జిక్యూటివ్ కమిటీ నిషేధ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ వివరాలను వాడా అధ్యక్షుడు క్రెగ్ రిడీ ప్రకటించాడు. మాస్కో ల్యాబ్‌లో వివరాలను తారుమారు చేసి నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్న వందలాది మంది అథ్లెట్ల వివరాలను రష్యా దాచిపెట్టిందని వాడా గత నెల ఓ నిర్ధారణకు వచ్చింది. మెరుగైన ప్రదర్శన చేసేలా నిషిద్ధ ఉత్ప్రేకరాలు తీసుకునేలా అథ్లెట్లను రష్యా డోపింగ్ నిరోధక ఏజెన్సీ (రుసాడా) అధికారులు చాలా ఏండ్లుగా ప్రోత్సహించారని, డోపింగ్‌లో విఫలమైన వారిని సంరక్షించారని కూడా తేల్చింది. 'ప్రపంచంలో ఇప్పటి వరకు ఇదే అతి పెద్ద క్రీడా కుంభకోణం. దీని వల్ల వేదనకు గురయ్యే రష్యన్లకు, క్రీడా అభిమానులకు ఈ చర్యలు చేసిన వారు క్షమాపణలు చెబుతారని అనుకుంటున్నా' అని వాడా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు లిండా హెలెలాండ్ అన్నారు. క్రీడా ప్రపంచానికే ఇది అవమానమని, రష్యా ఒలింపిక్ అధికారులు, అథ్లెట్లపై కాకుండా ఆ దేశ క్రీడా సంస్థపైనే కఠిన చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ(ఐవోసీ) కూడా గతంలోనే సూచించింది.

### ఇది రష్యా వ్యతిరేకతే..

డోపింగ్ జరగడం వాస్తవమే అయినా... అందుకు కారణమైన వారిని వాడా ఇంతకు ముందే శిక్షించిందని రష్యా ప్రధాని దిమిత్రి మద్వెదెవ్ అన్నారు. ఎప్పటి నుంచో సాగుతున్న రష్యా వ్యతిరేక అజెండాలో భాగమే తాజా నిషేధమని వాడాపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

**అథ్లెట్లు పాల్గొనొచ్చు..**

నిషేధం వేటు పడినా 2020 టోక్యో ఒలింపిక్స్ సహా ఒలింపిక్స్ పరిధిలోని క్రీడల్లో రష్యా అథ్లెట్లు పోటీ పడే అవకాశం ఉంది. అయితే, నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకోలేదని తేలిన వారిని, మాస్కో ల్యాబ్‌లో తారుమారైన డోపింగ్ పరీక్షల్లో భాగం కాని వారిని మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు వాడా అనుమతించనుంది. వారు రష్యా తరపున కాకుండా తటస్థ అథ్లెట్లుగా పోటీలో ఉంటారు. సోచీలో జరిగిన 2014 వింటర్ ఒలింపిక్స్ తర్వాత రష్యాలో డోపింగ్ కలకలం మొదలైంది. దీంతో 2015 నుంచే రష్యా అథ్లెట్లు పలుసార్లు నిషేధంతో ఇబ్బందులు పడ్డారు. దక్షిణ కొరియాలో గతేడాది జరిగిన వింటర్ ఒలింపిక్స్‌లోనూ తటస్థ అథ్లెట్లుగా 168 రష్యన్లు బరిలోకి దిగారు.


క్రెగ్ రిడీ

**ఇదీ జరిగింది..**

అథ్లెటెవరూ డోపింగ్ పరీక్షల్లో విఫలమవలేదని 2015 నవంబర్‌లో వాడాకు రుసాడా చెప్పింది. అయితే, అథ్లెట్లకు చేసిన పరీక్షల్లో రుసాడా అనేక అవకతవకలకు పాల్పడిందని, ఎంతో అవినీతి జరిగిందని వాడా అప్పట్లో నియమించిన మెక్‌లారెన్ కమిషన్ వెల్లడించింది. 2012 నుంచి 2015 వరకు అథ్లెట్లకు పెద్ద సంఖ్యలో పరీక్షలు నిర్వహించినా.. ఒక్కరు కూడా ఉత్ప్రేరకాలు తీసుకున్నట్టు సమాచారమివ్వలేదని, ప్రభుత్వమే డోపింగ్‌ను ప్రోత్సహించిందని నివేదిక వెలువరించింది. దీంతో రుసాడాను వాడా నిషేధించింది. అయితే ఆ నాలుగేండ్లు చేసిన డోపింగ్ టెస్టుల వివరాలు వెల్లడిస్తామని గతేడాది చెప్పడంతో నిషేధం ఎత్తేసింది. ఈ ఏడాది జనవరిలో రుసాడా జాబితాను అందించగా... 2017లో వాడా నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో విఫలమైన వారి పేర్లు దాంట్లో కనిపించలేదు. దీంతో పూర్తిస్థాయి విచారణకు పూనుకున్న వాడా.. భారీగా తారుమారు జరిగిందని బయటపడడంతో ఇప్పుడు రష్యాపై నాలుగేండ్ల నిషేధం వేటు వేసింది.

**కోర్టుకెళ్లినా లాభం లేదు!**

వాడా నిషేధంపై 21రోజుల్లోగా క్రీడా మధ్యవర్తిత్వ కోర్టులో సవాల్ చేసే అవకాశమున్నా.. రష్యా మాత్రం వెనుకడుగు వేసినట్టే ఉంది. నిషేధానికి వ్యతిరేకంగా వాదనలు చేసినా కోర్టులో గెలిచే అవకాశమే లేదని రుసాడా చీఫ్ యూరీ గానుస్ సోమవారం చెప్పాడు. తప్పు చేయని అథ్లెట్లకు ఇది శరాఘాతంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశాడు. 'ఇది (నిషేధం) బాధించే విషయమే. అప్పీలు చేసినా ఈ కేసు కోర్టులో గెలిచే అవకాశమే లేదు. కోర్టుకు వెళ్లే విషయంపై 19వ తేదీన రుసాడా సూపర్‌వైజరీ బోర్డులోనిర్ణయం తీసుకుంటాం. నిషేధం అనేది విషాదం. దీనివల్ల తప్పు చేయని అథ్లెట్లు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దేశం తరపునే అథ్లెట్లు పోటీ పడాలని మేం కోరుకుంటాం. కానీ పరిస్థితులు అలా లేవు. ఏదైమైనా దేశ అథ్లెట్లు ఒలింపిక్స్‌లో పాల్గొంటారు' అని గానుస్ అభిప్రాయపడ్డాడు.

# శభాష్ స్నేహిత్



**అంతర్జాతీయ యవనికపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించడమే తన లక్ష్యమని.. యూత్ టేబుల్ టెన్నిస్ (టీటీ) జాతీయ చాంపియన్, తెలంగాణ వర్ధమాన ఆటగాడు సురావజ్జుల ఫిడేల్ రఫీక్ స్నేహిత్ అంటున్నాడు. భారత టీటీ దిగ్గజం శరత్ కమల్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్న స్నేహిత్.. విదేశీ టోర్నీలు ఆడటం ద్వారా ర్యాంకింగ్స్‌ను మెరుగుపర్చుకోవాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు. జూనియర్ స్థాయిలో అనేక పతకాలు కొల్లగొట్టిన ఈ 19 ఏండ్ల యువ సంచలనం.. యూత్ కేటగిరీలో జాతీయ చాంపియన్‌గా నిలువడం చాలా ఆనందంగా ఉందన్నాడు. టోర్నమెంట్‌ల ఎంపిక, శిక్షణ, ర్యాంక్ మెరుగు పర్చుకోవడం, ప్రభుత్వం సాయం, ఒలింపిక్స్‌లో పాల్గొనడంపై స్నేహిత్ తన అభిప్రాయాలను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నాడు. ఆ వివరాలు అతడి మాటల్లోనే..**

టేబుల్ టెన్నిస్‌లో అడుగు పెట్టినప్పటి నుంచి ఏదో ఒకరోజు జాతీయ చాంపియన్‌గా నిలువాలని కలలు కన్నా. దానికి అనుగుణంగానే బరిలో దిగిన ప్రతి టోర్నీలో సత్తా చాటా. అయితే ఇటీవల స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. యూత్ నేషనల్ చాంపియన్‌షిప్‌నకు ముందు నెలరోజులు కఠోర శిక్షణ తీసుకున్నా. కోచ్ సోమ్‌నాథ్ ఘోష్ పర్యవేక్షణలో స్పెషల్ ప్రాక్టీస్ చేశా. ఫిట్‌నెస్‌పై మరింత దృష్టిపెట్టా. నా గేమ్‌లోని లోపాలను సరిదిద్దుకొని బలహీనతలనే బలంగా మలుచుకొని ముందుకు సాగా. దీంతో ఫైనల్లో ప్రత్యర్థిని సులువుగా ఓడించగలిగా. ఈ ఏడాది ఆరంభంలో టాప్-2లో నిలువాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా.. ఈ విజయంతో అండర్-21 జాతీయ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరా. అయితే సీనియర్ స్థాయిలో ప్రస్తుతం నా ర్యాంక్ 15-20 మధ్య కొనసాగుతున్నది. దాన్ని మెరుగుపర్చుకోవాలని భావిస్తున్నా.

**సీనియర్ నేషనల్స్‌లో సత్తాచాటుతా..**

వచ్చే ఏడాది జనవరిలో హైదరాబాద్ వేదికగా సీనియర్ నేషనల్ టీటీ చాంపియన్‌షిప్ జరుగనుంది. దిగ్గజ ఆటగాళ్లు పాల్గొనే ఈ టోర్నీలో సత్తాచాటడమే ప్రస్తుతం నా ముందున్న లక్ష్యం. సీనియర్ విభాగంలో టాప్-5లో ఉంటే టోక్యో (2020) ఒలింపిక్స్‌కు అర్హత లభించేది. అందుకే కామన్వెల్త్ గేమ్స్ (2022), ఆసియా గేమ్స్ (2022)పై దృష్టిపెట్టా. ర్యాంకింగ్స్ మెరుగుపర్చుకోవాలంటే విదేశీ టోర్నీల్లో పాల్గొనాల్సిందే. పారిస్ (2024) ఒలింపిక్స్‌లోగా ర్యాంక్ మెరుగుపర్చుకుంటా. శరత్ కమల్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నా.. చెన్నైలో శిక్షణ తీసుకుంటున్న సమయంలో సాతియాన్‌తో ఆడటం కలిసొచ్చింది. అతడి నుంచి ఎన్నో అంశాలు నేర్చుకున్నా. బంతి గమనం, దృష్టికోణం ఇలాంటి చాలా అంశాలు అనుభవపూర్వకంగా తెలిసొచ్చాయి.

**ర్యాంక్ మారాలంటే విదేశీ టోర్నీలే..**

విదేశీ టోర్నీల్లో పాల్గొంటేనే ర్యాంక్ మెరుగు పర్చుకోగలం. కానీ ప్రస్తుతం ఉన్న ఆర్థిక వనరులతో ఫారెన్ టోర్నీల్లో ఆడలేకపోతున్నా. తెలంగాణ టీటీ అసోసియేషన్ నుంచి తోడ్పాటు లభిస్తున్నది. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మరింత చేయూతనిస్తే.. విదేశీ టోర్నీలు ఆడేందుకు వెసులుబాటు కలుగుతుంది. వచ్చే ఏడాది జనవరిలో 'ఖేలో ఇండియా'గేమ్స్‌లో పాల్గొనాలని ఉన్నా.. ఒకవేళ అదే సమయంలో సీనియర్ నేషనల్స్ ఉంటే చెప్పలేను. కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీం (టాప్స్)లో స్థానం దక్కితే ఆర్థికంగా భరోసా లభిస్తుంది. బ్యాడ్మింటన్‌కు కేంద్రంగా మారిన హైదరాబాద్‌లో.. టేబుల్ టెన్నిస్‌కు కూడా మంచి ఆదరణ లభిస్తున్నది. 60వ దశకంలో నగరానికి చెందిన మీర్ ఖాసిమ్ అలీ జాతీయ యూత్ టైటిల్ నెగ్గారు. ఆ తర్వాత ఇన్నేండ్లకు ఆ అవకాశం నాకు రావడం చాలా సంతోషంగా ఉంది.

**స్నేహిత్‌కు ఘనస్వాగతం**

జాతీయ యూత్ చాంపియన్ టైటిల్ గెలిచి నగరానికి వచ్చిన స్నేహిత్‌కు సోమవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. సుమారుఅరవై ఏండ్ల తర్వాత ఈ ఘనత సాధించిన తెలుగు ఆటగాడిగా నిలిచిన స్నేహిత్‌కు రాజీవ్‌గాంధీ విమానాశ్రయంలో అభిమానుల కోలాహలం మధ్య స్వాగత సత్కారాలు జరిగాయి.




జాతీయ జూనియర్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో స్నేహిత్ స్వర్ణ పతకం సాధించడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులోనూ స్నేహిత్‌కు సహాయ, సహకారాలు అంది స్తాం. రాష్ట్రం తరపున జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులకు తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. వచ్చే నెలలో హైదరాబాద్ వేదికగా జాతీయ సీనియర్ టీటీ చాంపియన్‌షిప్ నిర్వహించబోతున్నాం. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఆటగాళ్లు పాల్గొనబోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో టోర్నీని ఘనంగా నిర్వహించాలనుకుంటున్నాం.

**- ప్రకాశ్ రాజ్**
**రాష్ట్ర టీటీ అసోసియేషన్ కార్యదర్శి**

ఇప్పటి వరకు 22 దేశాల్లో టోర్నమెంట్స్ ఆడిన స్నేహిత్ ఖాతాలో అనేక టైటిల్స్ ఉన్నా.. జాతీయ చాంపియన్‌షిప్ మెడల్ లేదనే భావన ఉండేది. ఈ విజయంతో ఆ కల తీరింది. ఇటీవల వరుస పరాజయాలతో సతమతమవుతున్న స్నేహిత్.. సోమ్‌నాథ్ ఘోష్ వద్ద ట్రైనింగ్‌తో మరింత రాటుదేలాడు. సెయింట్ జోసెఫ్ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న స్నేహిత్ కోసం ఇప్పటి వరకు చాలా ఖర్చు పెట్టాం. ఖమ్మం జిల్లా వైరా మండలం గొల్లపూడి గ్రామంలో మూడెకరాల వ్యవసాయ భూమి అమ్ముకొని.. ఆ డబ్బుతో స్నేహిత్‌ను టోర్నీలకు పంపించాం. దాంతోనే చెన్నైలో రెండున్నరేండ్లు ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. మెరుగైన ట్రైనింగ్ కోసం విదేశాలకు పంపాలంటే ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శిక్షణ కోసం ఏడాదికి రూ.25 లక్షల వరకు అవసరమవుతుంది. మరో నాలుగేండ్లు కష్టపడితే.. 2024 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించవచ్చు. 2017లో జోర్డాన్ అంతర్జాతీయ టైటిల్ నెగ్గడంతో స్నేహిత్ వెలుగులోకి వచ్చాడు. అప్పటి నుంచి అతడి జైత్రయాత్ర కొనసాగుతున్నది. ఈ స్థాయికి చేరడానికి అతడు అహర్నిశలు కష్టపడ్డాడు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరింత సహకారం లభిస్తే.. పారిస్ ఒలింపిక్స్‌లో స్నేహిత్ దేశం తరపున బరిలోకి దిగుతాడు.

**- రాము, స్నేహిత్ తండ్రి**



# ఈనెల 11 నుంచి జాతీయ సెపక్‌తక్రా టోర్నీ



**సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు జాతీయ సెపక్‌తక్రా టోర్నీ ఆహ్వాన పత్రికను అందిస్తున్న సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, ప్రేమ్ రాజ్ తదితరులు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్స్ వేదికగా ఈనెల 11 నుంచి 15 వరకు 23వ జాతీయస్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలు జరుగబోతున్నాయి. టోర్నీకి ముఖ్య అతిథిగా హాజరుకావాలంటూ రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్‌కు రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎస్ ఆర్ ప్రేమ్‌రాజ్ సోమవారం ఆహ్వానించారు. ఈ చాంపియన్‌షిప్‌లో 29 రాష్ట్రాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంత్‌కు టైమిస్తే.. సూపర్‌స్టార్ అవుతాడు

కెవిన్ పీటర్సన్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు సమయం ఇస్తే.. భవిష్యత్తులో భారత సూపర్‌స్టార్ అవుతాడని ఇంగ్లండ్ మాజీ ఆటగాడు కెవిన్ పీటర్సన్ అన్నాడు. 'పంత్ ప్రతిభావంతుడు. ఐపీఎల్లో అదరగొడుతున్నాడు. తన కల కోసం జీవిస్తున్నాడు. అతడి చుట్టూ విమర్శకులు ఉన్నారు. ఐపీఎల్ నుంచి అతడిని గమనిస్తూ వస్తున్నా.. చేసిన తప్పుల్ని పునరావృతం చేస్తున్నాడు. వాటిని తగ్గించుకోవాలి. అతడి వయసు 22 అంటే నమ్మలేకపోతున్నా. ధోనీతో పోల్చడం కూడా పంత్‌పై ఒత్తిడి పెంచుతున్నది. అతడికి కాస్త సమయం ఇస్తే.. భవిష్యత్తులో భారత సూపర్ స్టార్ అవుతాడు' అని పీటర్సన్ పేర్కొన్నాడు.



## రెడ్‌బుల్ చాంప్స్ దామన్, అకాంక్షి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** రెడ్‌బుల్ షటిల్ అప్ రెండో ఎడిషన్‌లో చండీగఢ్‌కు చెందిన దామన్ రాజ్‌కుమార్, అకాంక్షి బలియాన్ ద్వయం చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. జాతీయ మహిళల డబుల్స్ ఫైనల్లో దామన్, అకాంక్షి జోడీ 10-11, 5-11, 11-10 తేడాతో కావ్య గాంధీ, రాగేశ్రీ గార్గ్ ద్వయంపై విజయం సాధించింది. దేశంలో తొలిసారి మహిళల డబుల్స్ టోర్నీగా రూపుదిద్దుకున్న ఇందులో 550కి పైగా జోడీలు పాల్గొన్నాయి. స్టార్ డబుల్ ద్వయం అశ్విని పొన్నప్ప, సిక్కి రెడ్డి జాతీయ ఫైనల్స్ విజేతలకు ట్రోఫీ అందజేశారు.

# హైదరాబాద్ 233 ఆలౌట్

గుజరాత్‌తో రంజీ మ్యాచ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఫర్వాలేదనిపించింది. గుజరాత్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 233 పరుగులకు ఆలౌటైంది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో సోమవారం ప్రారంభమైన మ్యాచ్‌లో గుజరాత్ టాస్ గెలిచి హైదరాబాద్‌కు బ్యాటింగ్ అప్పగించింది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ (1), అక్షత్ రెడ్డి (22), శశిధర్ రెడ్డి (10), సందీప్ (20), హిమాలయ్ అగర్వాల్ (0) విఫలమవడంతో.. మన జట్టు 66 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వికెట్ కీపర్ కొల్ల సుమంత్ (69 నాటౌట్), సీవీ మిలింద్ (47) పోరాడటంతో తిరిగి కోలుకుంది. చివర్లో మహమ్మద్ సిరాజ్ (24; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి కొన్ని విలువైన పరుగులు జోడించాడు. గుజరాత్ బౌలర్లలో పియూష్ చావ్లా 3 వికెట్లు పడగొట్టాడు.


సుమంత్ (69*)

**వసీం జాఫర్ @ 150**

వెటరన్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ రంజీల్లో 150వ మ్యాచ్ ఆడిన తొలి ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. దేవేంద్ర బుందేలా (145), అమోల్ మజుందార్(136) ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నారు. 41 ఏండ్ల ఈ మహారాష్ట్ర ఓపెనర్ గత రెండేండ్లుగా విదర్భ తరపున ఆడుతున్నాడు.

**పృథ్వీ షా, రహానే అర్ధశతకాలు**

టీమ్‌ఇండియా టెస్టు వైస్ కెప్టెన్ అజింక్యా రహానే (79), యువ ఓపెనర్ పృథ్వీషా (66) అర్ధశతకాలకు.. శార్దూల్ ఠాకూర్ (64), షమ్స్ ములానీ (56 బ్యాటింగ్) మెరుపులు తోడవడంతో బరోడాతో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై 8 వికెట్ల నష్టానికి 362 పరుగులు చేసింది. బరోడా బౌలర్లలో యూసుఫ్ పఠాన్ 2 వికెట్లు పడగొట్టాడు.



## ఆంధ్రమ్యాచ్‌కు అతిథిగా పాము

విజయవాడ వేదికగా ఆంధ్ర, విదర్భ మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో పాము ప్రత్యక్షమైంది. టాస్ అనంతరం విదర్భ ఆటగాళ్లు గ్రౌండ్‌లో అడుగుపెడుతున్న సమయంలో పాము దర్శనమివ్వడంతో గ్రౌండ్ సిబ్బంది నానాకష్టాలు పడి దాన్ని బయటకు పంపించారు. మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 211 పరుగులకు ఆలౌట్ కాగా.. ఆట ముగిసే సమయానికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 26/0తో నిలిచింది.

# సింధుకు సులువైన డ్రా

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్



**గ్యాంగ్జు (చైనా):** భారత స్టార్ షట్లర్ పీవీ సింధు.. బీడబ్ల్యూఎఫ్ సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ గ్రూప్-ఏలో చోటు దక్కించుకుంది. ప్రపంచ టాప్ ర్యాంకర్ తై జూ యింగ్ (చైనీస్ తైపీ) గ్రూప్-బీలో ఉండడంతో గ్రూప్ దశలో ఆమెతో సింధు పోటీ పడాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ జరుగనుంది. టాప్-8 ర్యాంకులో లేకున్నా ఈ ఏడాది బాసెల్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలువడంతో సింధు ఈ టోర్నీకి నేరుగా అర్హత సాధించింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న తెలుగమ్మాయి... వరల్డ్ టూర్ ఫైనల్స్ కోసం తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తున్నది. ప్రపంచ చాంపియన్ అయ్యాక ఏ టోర్నీలోనూ రాణించలేకపోవడంతో మళ్లీ గాడిలో పడి టైటిల్ నిలుపుకోవాలని కసరత్తులు చేస్తున్నది. వరల్డ్ టూర్ ఫైనల్స్ మహిళల సింగిల్స్ గ్రూప్-ఏలో సింధుతో పాటు చెన్ యూఫీ (చైనా), హీ బింగ్‌జియావో (చైనా), అకానే యమగూచి (జపాన్) ఉన్నారు. గ్రూప్-బీలో తైజూ యింగ్ (చైనీస్ తైపీ), నవోమి ఒకుహర (జపాన్), రచనోక్ ఇంటానోన్ (థాయ్‌లాండ్), బుసానన్ (థాయ్‌లాండ్) నిలిచారు. సింధు తొలి మ్యాచ్‌లో యమగూచి (జపాన్)తో తలపడనుంది. పురుషుల సింగిల్స్ గ్రూప్-ఏలో ప్రపంచ నంబర్‌వన్ మొమోటా(జపాన్), జొనాథన్ క్రిస్టి (ఇండోనేషియా), వాంగ్ జూ (తైవాన్), ఆంటోసెన్ (డెన్మార్క్), గ్రూప్-బీలో చౌ టెన్ చెన్ (చైనీస్ తైపీ), చెన్ లాంగ్ (చైనా), అక్సెల్సన్ (డెన్మార్క్), గింటింగ్ (ఇండోనేషియా) ఉన్నారు.



# పసిడి పంచ్‌లు

దక్షిణాసియా క్రీడల్లో భారత్ జోరు

294 పతకాలతో అగ్రస్థానం

**కత్మాండు:** దక్షిణాసియా క్రీడల్లో భారత బాక్సర్లు అదరగొట్టారు. ఒకేరోజు ఏడు విభాగాల్లో ఫైనల్స్ జరుగగా.. ఆరు స్వర్ణాలు, ఓ రజతంతో సత్తాచాటారు. క్రీడల 8వ రోజైన సోమవారం అన్ని విభాగాల్లో మన దేశానికి మొత్తం 27 స్వర్ణాలు సహా 42 పతకాలు దక్కాయి. దీంతో భారత్ ఇప్పటి వరకు భారత్ 294 పతకాల (159 స్వర్ణాలు, 91 రజతాలు, 44కాంస్యాలు)తో త్రిశతకానికి చేరువైంది. ఆతిథ్య నేపాల్(195), శ్రీలంక (239) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. బాక్సింగ్ పురుషుల విభాగంలో అంకిత్ (75కేజీలు), వినోద్ తన్వర్ (49కేజీలు), సచిన్ (56కేజీలు), గౌరవ్ చౌహాన్ (91కేజీలు), మహిళల విభాగంలో కలైవని శ్రీనివాసన్ (48కేజీలు), పర్వీన్ (60కేజీలు) పసిడి పతకాలు సాధించగా.. పురుషుల పోటీలో మనీశ్ కౌశిక్ (64కేజీలు) రజతంతో సరిపెట్టుకున్నాడు. మంగళవారం మరో ఎనిమిది మంది బాక్సర్లు ఫైనల్స్‌లో తలపడనున్నారు. రెజ్లింగ్‌లో రెండు, ఫెన్సింగ్‌లో మూడు స్వర్ణాలు భారత్‌కు వచ్చాయి. భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు ఫైనల్స్‌లో గెలిచి పసిడి పతకాలు సాధించాయి. పురుషుల జట్టు 51-18తో శ్రీలంకపై, మహిళల జట్టు 50-13తో నేపాల్‌పై గెలిచాయి. భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ఫైనల్స్‌లో 2-0తో నేపాల్‌ను ఓడించి స్వర్ణం సాధించింది.

## యువ భారత్ 'సఫారీ' టూర్

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది జరుగనున్న అండర్-19 ప్రపంచకప్‌నకు ముందు జట్టులో సమిష్టితత్వం నింపేందుకు.. యువ భారత జట్టును నాగర్‌హోల్ జాతీయ పార్క్‌లో కాబినీ వైల్డ్ లైఫ్ సఫారీ టూర్‌కు తీసుకెళ్లారు. మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాక.. భారత్-ఏ, అండర్-19 జట్లను ఇలా తీసుకెళ్లడం ఆనవాయితీగా మారింది. కర్ణాటకలోని మైసూర్ జిల్లాలో ఉన్న ఈ పార్క్‌లో భారత యువ జట్టు రెండు రోజులు ఉండనుందని బీసీసీఐ జీఎం సాబా కరీం తెలిపాడు. విభిన్న ప్రాంతాల నుంచి వచ్చిన ఆటగాళ్ల మధ్య అనుబంధం పెరిగేందుకు ఇది దోహదపడుతుందని అతడు పేర్కొన్నాడు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 40,487 | 11,937 |
| ↗42 | ↗16 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 64.35 డాలర్లు

## హీరో బైకులు మరింత ప్రియం



రూ.2 వేల వరకు పెంచుతున్న సంస్థ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** ద్విచక్ర వాహన తయారీలో అగ్రగామి సంస్థయైన హీరో మోటోకార్ప్ కొనుగోలుదారులకు షాకిచ్చింది. వచ్చే నెల నుంచి అన్ని రకాల మోటార్‌సైకిల్, స్కూటర్ల ధరలను రూ.2 వేల వరకు పెంచబోతున్నట్లు సోమవారం ప్రకటించింది. అన్ని రకాల ద్విచక్ర వాహన ధరలకు ఈ పెంపు వర్తించనున్నదని, వివిధ మోడళ్లను బట్టి ధరల పెంపులో తేడా లుంటాయని సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ధరలను ఎందుకు పెంచాల్సి వచ్చిందో మాత్రం సంస్థ వెల్లడించలేదు. ప్రస్తుతం సంస్థ రూ.39,900 నుంచి రూ.1.05 లక్షల లోపు విలువైన స్కూటర్లు, మోటార్‌సైకిళ్లను దేశవ్యాప్తంగా విక్రయిస్తున్నది. గతవారంలో మారుతి, టయోటా, మహీంద్రా, మెర్సిడెజ్-బెంజ్‌లు ధరలను పెంచుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఎస్బీఐ రుణాలిక చౌక

### వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్లు తగ్గించిన బ్యాంక్

**ముంబై, డిసెంబర్ 9:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఖాతాదారులకు మరోమారు ఊరట కల్గించింది. ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ తగ్గించిన వడ్డీరేట్లు మంగళవారం నుంచి అమలులోకి రానున్నాయి. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో గృహ, వాహన, ఇతర రుణాలపై వడ్డీరేట్లు మరింత తగ్గనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ ఇలా వడ్డీరేట్లను తగ్గించడం ఇది ఎనిమిదో సారి కావడం విశేషం. ఖాతాదారులకు ఆర్థికంగా ప్రయోజనం కల్గించాలనే ఉద్దేశంతో ఎంసీఎల్ఆర్‌ని 10 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు, ఈ తగ్గింపు అన్ని రకాల రుణాలకు వర్తించనున్నదని బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 8 శాతం నుంచి 7.90 శాతానికి తగ్గనున్నది. రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ ఎస్బీఐ మాత్రం రుణాలపై వడ్డీరేట్లను తగ్గించడం విశేషం.

**మాగ్నటిక్ ఏటీఎం కార్డులు నిషేధం..**

బ్యాంక్ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. మాగ్నటిక్ స్ట్రిప్స్ కలిగిన ప్రతి ఏటీఎం కార్డును నిషేధిస్తున్నట్లు ఎస్బీఐ ప్రకటించింది. ఈ నెల 31 నుంచి ఈ కార్డులు పనిచేయవని స్పష్టం చేసింది. దీంతో ఈ కార్డు కలిగిన ఖాతాదారులు వెంటనే చిప్ కలిగిన కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇలా దరఖాస్తు చేసుకున్నవారికి ఉచితంగా నూతన కార్డు జారీ చేయడం జరుగుతున్నదని ట్విట్టర్ వేదికగా బ్యాంక్ తెలిపింది.

**బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా...**

మరో సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేట్లను 20 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించినట్లు ప్రకటించింది. దీంతో ఒకరోజు కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్ఆర్‌ను 20 బేసిస్ పాయింట్లు తగ్గించిన బ్యాంక్..ఇతర రుణాలపై 10 బేసిస్ పాయింట్లు కోత విధించింది. ఈ రేట్లు మంగళవారం నుంచే అమలులోకి రానున్నాయి. ఏడాది రుణాలపై వడ్డీరేటు 8.30 శాతం నుంచి 8.20 శాతానికి తగ్గనున్నది.

# బీఎస్-6తో వైజెడ్‌ఎఫ్-ఆర్15 బైకు

### ప్రారంభ ధర రూ.1.45 లక్షలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** దేశీయ మార్కెట్లోకి బీఎస్-6 ప్రమాణాలతో కుడిన వైజెడ్‌ఎఫ్-ఆర్15 వెర్షన్ 3.0 మోటార్‌సైకిల్ మోడల్‌ను విడుదల చేసినట్లు యమహా మోటర్ ప్రకటించింది. ఈ బైకు ప్రారంభ ధర రూ.1.45 లక్షలుగా నిర్ణయించింది. 155 సీసీ సామర్థ్యంతో రూపొందించిన ఈ బైకు ఈ నెల మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని డీలర్ల వద్ద లభించనున్నదని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇదివరకే ఎఫ్‌జెడ్ ఎఫ్1(149సీసీ), ఎఫ్‌జెడ్ఎస్ ఎఫ్1(149 సీసీ) బైకులను బీఎస్-6 ప్రమాణాలతో రూపొందించి విడుదలచేసింది. నూతనంగా తయారు చేసిన ఈ బైకుల్లో సైడ్ స్టాండ్ ఇంజిన్ కట్-ఆఫ్ స్విచ్, రెండు రకాల హారన్, రేడియల్ ట్యూబ్‌లెస్ టైర్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. మూడు రంగుల్లో లభించనున్న ఈ బైకులు రూ.1.45 లక్షలు మొదలుకొని రూ.1.47 లక్షల లోపు లభించనున్నాయి. పాత బైకుతో పోలిస్తే ఈ కొత్త బైకు రూ.2 వేలు అదనం. ఈ సందర్భంగా యమహా మోటర్ ఇండియా చైర్మన్ మోటోఫుమి శితారా మాట్లాడుతూ..భారత వినియోగదారులకు నూతన ఫీచర్ కలిగిన బైకులను అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు, దీంట్లోభాగంగా ఇటీవల విడుదల చేసిన ఆర్ సిరీస్ బైకులకు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభించిందని, ఈ నూతన వైజెడ్‌ఎఫ్-ఆర్15 వెర్షన్ కూడా ఆకట్టుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

# లోధాలే టాప్

### దేశీయ నిర్మాణ రంగ వ్యాపారుల్లో సంపన్నుల జాబితాను విడుదల చేసిన హ్యూరున్

### రూ.32 వేల కోట్లతో అగ్రస్థానంలో మంగళ్ ప్రభాత్ లోధా

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:**

దేశీయ నిర్మాణ రంగ వ్యాపారంలో మాక్రోటెక్ డెవలపర్స్ (ఇంతకుముందు లోధా డెవలపర్స్) అధినేత మంగళ్ ప్రభాత్ లోధా, ఆయన కుటుంబమే అత్యంత సంపన్నులని తేలింది. ఈ ఏడాదికిగాను భారతీయ ధనిక రియల్ ఎస్టేట్ వ్యాపారుల జాబితాను హ్యూరున్-జీఆర్‌వోహెచ్‌ఈ సోమవారం విడుదల చేశాయి. ఈ 100 మంది లిస్టులో మంగళ్ ప్రభాత్ లోధాలు రూ.31,960 కోట్ల సంపదతో అగ్రస్థానంలో నిలిచారు. తర్వాతి స్థానంలో డీఎల్ఎఫ్ వైస్ చైర్మన్ రాజీవ్ సింగ్ ఉండగా, మూడో స్థానంలో ఎంబసీ గ్రూప్ వ్యవస్థాపకుడు జితేంద్ర విర్వాణీ ఉన్నారు. నిరుడు కూడా లోధాలే ప్రథమ స్థానంలో ఉండగా, ప్రస్తుతం మంగళ్ ప్రభాత్ లోధా ముంబై బీజేపీ చీఫ్‌గా ఉండటం గమనార్హం. 2019లో లోధా కుటుంబ ఆస్తులు 18 శాతం పెరిగాయి. జాబితాలోని మిగతా 99 మంది ఆస్తులూ 12 శాతం పెరిగినట్లు హ్యూరున్ తెలిపింది. రెండో స్థానంలో నిలిచిన రాజీవ్ సింగ్ (డీఎల్ఎఫ్) సంపద గతేడాదితో పోల్చితే 42 శాతం ఎగిసింది. స్టాక్ మార్కెట్లలో ఉన్న సంస్థలకు వాటి మార్కెట్ విలువ ఆధారంగా, లేని సంస్థలకు వాటి ఇటీవలి ఆర్థిక ప్రకటనల ఆధారంగా ర్యాంకులను కేటాయించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30ని ప్రామాణిక వ్యవధిగా తీసుకుని, అప్పటివరకున్న విలువను లెక్కించి ఈ జాబితాను రూపొందించారు. ఇక మొత్తం ఈ జాబితాలోని 100 మంది సంపద విలువ రూ.2,77,080 కోట్లు (39.5 బిలియన్ డాలర్లు)గా ఉన్నది. 2018తో చూస్తే ఇది 16 శాతం అధికం. 'భారతీయ నిర్మాణ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నా.. రియల్టర్ల సంపద నిరుడుతో పోల్చితే 16 శాతం వృద్ధి చెంది రూ.2,743 కోట్లు పెరిగింది' అని ఈ సందర్భంగా హ్యూరున్-జీఆర్‌వోహెచ్‌ఈ తెలిపాయి. సంస్థల ఆదాయం 17 శాతం పెరిగినట్లు పేర్కొన్నాయి. ఇక 2017తో పోల్చితే రియల్టర్ల సంపద 27 శాతం పెరిగింది. 2017 నుంచే ఈ జాబితా విడుదలవుతుండగా, ఇది మూడో ఎడిషన్.

**ముంబై వాసులే ఎక్కువ**

సంపన్న రియల్టర్లలో ఎక్కువ మంది ముంబైలోనే నివసిస్తున్నారు. తాజా జాబితాలోని 100 మందిలో 37 మంది ముంబైకి చెందినవారే. ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ, బెంగళూరు ఉన్నాయి. ఈ రెండు నగరాల్లో 19 మంది చొప్పున ఉంటున్నారు. దీంతో ఈ మూడు నగరాల్లోనే 75 మంది ధనిక రియల్టర్లు ఉన్నట్లు స్పష్టమైంది. ఇక డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా ఈసారి పెరిగింది. 2019లో అమెరికా డాలర్ల విలువతో చూస్తే బిలియనీర్లుగా ఉన్న రియల్టర్లు 9 మంది ఉన్నట్లు తేలింది. నిరుడు ఏడుగురే ఉండగా, ఇద్దరు పెరిగినట్లైంది.

**ఎనిమిది మంది మహిళలు**

జీఆర్‌వోహెచ్‌ఈ హ్యూరున్ ఇండియా రియల్ ఎస్టేట్ సంపన్నుల జాబితా-2019లో ఎనిమిది మంది మహిళలు ఉండటం విశేషం. గోద్రెజ్ ప్రాపర్టీస్‌కు చెందిన స్మిత వీ కృష్ణ రూ.3,560 కోట్ల సంపదతో అత్యంత ధనిక మహిళగా నిలిచారు. మొత్తం జాబితాలో ఈమెది 14వ స్థానం. మిగతా మహిళల్లో డీఎల్ఎఫ్‌కు చెందిన రేణుకా తల్వార్ (రూ.2,590 కోట్లు), పియా సింగ్ (రూ.2,370 కోట్లు), ఎమ్మార్ ఎంజీఎఫ్ లాండ్‌కు చెందిన శిల్పా గుప్తా (రూ.730 కోట్లు), సూపర్‌టెక్‌కు చెందిన సంగీతా అరోరా (రూ.410 కోట్లు), గోపాలన్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఎం వసంత కుమారి (రూ.310 కోట్లు), వాతికాకు చెందిన కంచన్ భల్లా (రూ.300 కోట్లు) తదితరులున్నారు.

**హైదరాబాద్ ఆఫీస్‌కు డిమాండ్**

పెట్టుబడులను ఆకర్షించడంలో ఆఫీస్ సెగ్మెంట్ ముందున్నదని హ్యూరున్ రిపోర్ట్ ఇండియా చీఫ్ రిసెర్చర్ రహ్మాన్ జునైద్ తెలిపారు. ఈ ఏడాది పెట్టుబడుల్లో 65.6 శాతం వాటాను కలిగి ఉందన్న ఆయన ముంబై తర్వాత దేశంలో హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్‌కే డిమాండ్ ఉందని చెప్పారు. ఇక్కడి సదుపాయాలు ఆకట్టుకుంటున్నాయన్నారు.

### భారతీయ ధనిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు



మంగళ్ ప్రభాత్ లోధా

| | | నికర విలువ (రూ. కోట్లలో) | ప్రధాన సంస్థ | నివాసం |
|---|---|---|---|---|
| 1 | మంగళ్ ప్రభాత్ లోధా & కుటుంబం | 31,960 | మాక్రోటెక్ డెవలపర్స్ | ముంబై |
| 2 | రాజీవ్ సింగ్ | 25,080 | డీఎల్ఎఫ్ | న్యూఢిల్లీ |
| 3 | జితేంద్ర విర్వాణి | 24,750 | ఎంబసీ | బెంగళూరు |
| 4 | నిరంజన్ హీరానందని | 17,030 | హీరానందని కమ్యూనిటీస్ | ముంబై |
| 5 | చంద్ర రహేజా & కుటుంబం | 15,480 | కే రహేజా | ముంబై |
| 6 | వికాస్ ఒబెరాయ్ | 13,910 | ఒబెరాయ్ రియల్టీ | ముంబై |
| 7 | రాజా బగ్మనే | 9,960 | బగ్మనే డెవలపర్స్ | బెంగళూరు |
| 8 | సురేంద్ర హీరానందని | 9,720 | హౌజ్ ఆఫ్ హీరానందని | సింగపూర్ |
| 9 | సుభాష్ రన్‌వాల్ & కుటుంబం | 7,100 | రన్‌వాల్ డెవలపర్స్ | ముంబై |
| 10 | అజయ్ పిరమల్ & కుటుంబం | 6,560 | పిరమల్ రియల్టీ | ముంబై |

## జాబితాలో మై హోం కన్‌స్ట్రక్షన్స్



హైదరాబాద్ ఆధారిత రియల్ ఎస్టేట్ సంస్థ మై హోం కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన జూపల్లి రాము రావు, జూపల్లి శ్యామ్ రావులకు తాజా జాబితాలో చోటు దక్కింది. వీరి సంపద రూ.740 కోట్లుగా ఉన్నది. ఈ ఇరువురి వయసు 33 సంవత్సరాలు. మొత్తం 100 మందిలో వీరే పిన్న వయస్కులు కావడం విశేషం. జాబితాలోని రియల్టర్ల సగటు వయసు 59 సంవత్సరాలుగా ఉన్నది. 40 ఏండ్ల దిగువన ఉన్నవారు ఆరుగురైతే.. 80 ఏండ్ల ఎగువన ఉన్నవారు ముగ్గురు. 90 ఏండ్ల వయసుతో ఈస్ట్ ఇండియా హోటల్స్‌కు చెందిన పృథ్వీ రాజ్ సింగ్ అత్యధిక వయస్కులు. ఈయన సంపద విలువ రూ.3,670 కోట్లు. 100 మందిలో 36 మంది కొత్తవారే అవగా, దాదాపు 60 శాతం మంది తొలి తరం వారే కావడం గమనార్హం.

# జీతాలు రాకనే ఎగవేతలు!

### మందగించిన వ్యాపారం కూడా రుణ చెల్లింపుల వైఫల్యానికి కారణమే: క్రెడిట్‌మేట్




**ముంబై, డిసెంబర్ 9:** సకాలంలో జీతాలు రాకనే వ్యక్తిగత రుణగ్రహీతలు రుణాలను చెల్లించలేక చేతులెత్తేస్తున్నారని ఓ అధ్యయనంలో తేలింది. రుణ ఎగవేతల వెనుక ఉన్న ప్రధాన కారణం వేతనాల్లో ఆలస్యమేనని పేటీఎం నేతృత్వంలోని ఆర్థిక టెక్నాలజీ సంస్థ క్రెడిట్‌మేట్ సోమవారం తెలిపింది. వ్యాపారంలో మందగమనం కూడా ఓ ముఖ్య కారణమేనని స్పష్టం చేసింది. దేశంలో నిరుద్యోగం నాలుగు దశాబ్దాల గరిష్ఠానికి చేరడం, జీడీపీ ఆరేండ్ల కనిష్ఠానికి పతనం నేపథ్యంలో ఈ అధ్యయనం ప్రాధాన్యతను సంతరించుకున్నది. 'దేశవ్యాప్తంగా రుణాల వసూళ్లను ప్రస్తుత మందగమన పరిస్థితులు ప్రభావితం చేస్తున్నాయి' అని క్రెడిట్‌మేట్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. 30 రాష్ర్టాల్లో గడిచిన 6 నెలలకుపైగా కాలంలో 40 సంస్థలు ఇచ్చిన 2 లక్షల రుణాలను విశ్లేషించి ఈ సర్వేను క్రెడిట్‌మేట్ నిర్వహించింది. ఇందులో రుణాల ఎగవేతల వెనుక ఉన్న ప్రధాన కారణం జీతాల ఆలస్యమేనని తాము గుర్తించినట్లు చెప్పింది. 36 శాతం ఇంతేనన్నది. ఇక వ్యాపారం మందగించి 29 శాతం మంది రుణాలను తిరిగి చెల్లించలేపోయారని వెల్లడించింది. అలాగే మొత్తం రుణ ఎగవేతల్లో 12 శాతం ఉద్యోగాలు పోవడం వల్లే జరిగాయన్న క్రెడిట్‌మేట్.. 13 శాతం ఆరోగ్యం బాగాలేక, 10 శాతం వలసల వాటా ఉన్నట్లు చెప్పింది.

**మహిళలు భేష్**

మహిళల కంటే పురుషులే ఎక్కువగా రుణ ఎగవేతలకు పాల్పడుతున్నట్లు తేలింది. రుణాలను తీసుకున్న మగవారిలో 82 శాతం మంది తిరిగి చెల్లించడం లేదని క్రెడిట్‌మేట్ స్పష్టం చేసింది. రుణ చెల్లింపుల్లో స్త్రీలు మెరుగ్గా ఉన్నారని, పురుషుల కంటే 11 శాతం వేగంగా బకాయిలను చెల్లిస్తున్నారని చెప్పింది. ఇక ముంబై, అహ్మదాబాద్, సూరత్ నగరాలు రుణ చెల్లింపుల్లో ముందున్నాయని, ఈ విషయంలో ఢిల్లీ, బెంగళూరు, పుణె నగరాలు చివరి స్థానంలో ఉన్నాయని తేలింది. రుణ కట్టుబాట్లను గౌరవించడంలో ఒడిషా, చత్తీస్‌గఢ్, బీహార్, గుజరాత్ రాష్ర్టాలు ముందు వరుసలో ఉన్నాయని, మధ్యప్రదేశ్, హర్యానా, ఢిల్లీ ఎన్‌సీఆర్, తమిళనాడు ఆఖరున ఉన్నట్లు క్రెడిట్‌మేట్ తమ తాజా అధ్యయనంలో వెల్లడించింది.

**ఎక్కువ జీతాలిస్తేనే చేస్తాం**

ఓవైపు నిరుద్యోగ రేటు నాలుగు దశాబ్దాల గరిష్ఠానికి చేరినా.. మరోవైపు ఆకర్షణీయమైన జీతాలుంటేనే ఉద్యోగాల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నది యువత. కొత్త ఉద్యోగార్థుల్లో 54 శాతం మంది తమకు వచ్చే వేతనం ఎంత? అన్నదే ముందుగా చూస్తున్నారు. ఆ తర్వాతే ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకుంటున్నారని క్రోనోస్ అండ్ ఫ్యూచర్ వర్క్‌ప్లేస్ వద్దనున్న వర్క్‌ఫోర్స్ ఇనిస్టిట్యూట్ నిర్వహించిన సర్వే స్పష్టం చేసింది. అత్యుత్తమ ప్యాకేజీ వస్తేగాని ఉద్యోగాలకు వెళ్లడం లేదని తెలిపింది. భారత్‌సహా ఆస్ట్రేలియా, బెల్జియం, బ్రిటన్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, మెక్సికో, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, అమెరికా దేశాల్లో 3,400 మంది యువత ఈ అధ్యయనంలో పాల్గొన్నది. ఇందులో 44 శాతం మంది సంస్థల నుంచి వచ్చిన సమాచారానికి సరిగ్గా స్పందించడం లేదని తేలింది. భారత్‌లో ఇలాంటివారు 52 శాతం మంది ఉన్నారు.

# రూ.80కి చేరువలో పెట్రోల్

### హైదరాబాద్‌లో 15 పైసలు పెరిగి రూ.79.81కి చేరిన లీటర్ ధర

### 22 పైసలు ఎగిసి రూ.72.07 వద్ద డీజిల్

### ఢిల్లీలో పెట్రోల్ రూ.75, డీజిల్ రూ.66.04



**న్యూఢిల్లీ/హైదరాబాద్, డిసెంబర్ 9:** ధరాఘాతంతో సతమతమవుతున్న సామాన్యుడిపై పెట్రోల్ పిడుగు పడింది. రోజుకింత పెరుగుతున్న ధరలు సోమవారం ఏడాది గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు భగ్గుమనడంతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.75 మార్క్‌కు చేరుకున్నది. గతేడాది కాలంలో ఇదే గరిష్ఠ స్థాయి. లీటర్ ధరను 5 పైసలు పెంచిన ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థలు..డీజిల్‌ను అయితే ఏకంగా పది పైసలు వడ్డించాయి. దీంతో పెట్రోల్ ధర రూ.75కి చేరుకోగా, డీజిల్ రూ.66.04కి ఎగబాకింది. గత నెల 9 నుంచి ఇప్పటి వరకు లీటర్ పెట్రోల్ రూ.2.30 అధికమైంది. ఇదే సమయంలో డీజిల్ రూ.65-66 మధ్యలో కదలాడింది. ఆయా రాష్ర్టాలు విధిస్తున్న వ్యాట్, ఇతర పన్నుల ఆధారంగా ధరల పెరుగుదలలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ మాత్రం 15 పైసలు అధికమై రూ.79.81కి చేరుకున్నది. అలాగే డీజిల్ మరో 22 పైసలు అందుకొని రూ.72.07 వద్ద ముగిసింది. ముంబైలో పెట్రోల్ రూ.80.65 పలుకగా, డీజిల్ రూ.69.27 వద్దకు చేరుకున్నది.

## లుఫ్తాన్సాతో విస్తారా ఒప్పందం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** ప్రముఖ విమానయాన సంస్థ విస్తారా..అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా లుఫ్తాన్సాతో ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందంలో భాగంగా ఈ రెండు సంస్థలకు చెందిన విమానాల్లో ప్రయాణించినవారికి పాయింట్ల రూపంలో లబ్ధిచేకూరనున్నదని విస్తారా ఒక ప్రకటనలో వెల్లడించింది. కోడ్‌షేరింగ్‌లో భాగంగా లుఫ్తాన్సా వినియోగదారుడు విస్తారా విమాన సర్వీసులను బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, గోవా, కోల్‌కతా, ముంబై, పుణె నగరాలకు విమాన సర్వీసులు నడుపుతున్న విస్తారా..లుఫ్తాన్సాతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా విదేశాల నుంచి నేరుగా ఈ నగరాలకు వెళ్లవచ్చును.

## ఉద్యోగాలేం పోవు

### ఆందోళన వద్దు


### ఆటో రంగంపై కేంద్రం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** దేశీయ ఆటోమొబైల్ రంగంలో ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు లేదని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం రాజ్యసభలో తెలిపింది. ప్రస్తుతం ఆటో రంగం పరివర్తన దశలో ఉన్నదని, ప్రతికూల పరిస్థితులు క్రమేణా తొలగిపోతున్నాయని ఆ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ లిఖితపూర్వక సమాధానంగా చెప్పారు. గడిచిన మూడేండ్లలో ఒక్క ఆటోమొబైల్, దాని అనుబంధ సంస్థ మూతబడలేదని గుర్తుచేశారు. ఆటో రంగ సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని, ఉద్యోగాలు పోతాయన్న భయం అక్కర్లేదని సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఉద్యోగులకు భరోసానిచ్చారు. కాగా, వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి బీఎస్ 4 వాహనాల స్థానంలో బీఎస్ 6 వాహనాలు వస్తాయన్నారు. విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగానికీ పెద్దపీట వేస్తున్నామని కొశ్చన్ అవర్ సందర్భంగా తెలిపారు. అక్టోబర్‌లో దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు స్వల్పంగా పెరిగిన విషయం తెలిసిందే. కొత్త మోడళ్ల రాక, పండుగ సీజన్ కలిసొచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆఫర్లే.. ఆఫర్లు

### కార్లపై రూ.1.13 లక్షల వరకు రాయితీ ప్రకటించిన సంస్థలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** ఈ సంవత్సరం ఆటోమొబైల్ సంస్థలకు నిరాశనే మిగిల్చింది. ఆర్థిక మాంద్యం సెగ ఒకవైపు..మరోవైపు వినియోగదారుల్లో సెంటిమెంట్ నిరాశావాదంగా ఉండటంతో టాప్‌గేర్‌లో దూసుకుపోయిన వాహన విక్రయాలకు బ్రేక్‌పడినట్లు అయింది. పండుగ సీజన్ మినహా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విక్రయాల్లో గట్టి షాక్ తగిలింది. దీంతో చేసేదేమి లేక సంస్థల వద్ద పేరుకుపోయిన స్టాక్‌లను వదిలించుకోవడానికి ప్రయత్నాలను ముమ్మరం చేశాయి సంస్థలు. దీంట్లోభాగంగా పలు సంస్థలు రాయితీలను తెరపైకి తీసుకొచ్చాయి. 2019 సంవత్సరం చివరి నెల డిసెంబర్‌లో డిస్కౌంట్లను ప్రకటిస్తు వస్తున్న సంస్థలు ఈసారి వినియోగదారులను ఆకట్టుకోవడానికి భారీగా ప్రకటించాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ అయితే ఏకంగా లక్ష రూపాయలకు పైగా రాయితీ ప్రకటించింది. బాలెనో, సియాజ్, ఇగ్నిస్, ఎస్-క్రాస్ మోడళ్లపై రూ.1.13 లక్షల వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల చివరి వరకు మాత్రమే ఈ ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి. జపాన్‌కు చెందిన నిస్సాన్ కూడా రూ.1.15 లక్షల వరకు ఆర్థికంగా ప్రయోజనం కల్పించనున్నట్లు ప్రకటించింది.

❖ **బాలెనో(పెట్రోల్ రకం):**
మల్టీపర్పస్ వాహనమైన బాలెనోపై మారుతి రూ.45 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించింది. వీటిలో వినియోగదారుల రాయితీ కింద రూ.25 వేలు ఇవ్వనున్న సంస్థ.. ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద మరో రూ.15 వేలు, కార్పొరేట్ ఆఫర్ కింద మరో రూ.5 వేలు కల్పిస్తున్నది.

❖ **బాలెనో(డీజిల్ రకం):**
మారుతికి చెందిన బాలెనో డీజిల్ రకాన్ని కొనుగోలు చేసినవారికి రూ.67,400 ప్రయోజనాలు కల్పిస్తున్నది సంస్థ. దీంట్లో కన్జ్యూమర్ డిస్కౌంట్ కింద రూ.25 వేలు లభించనుండగా, ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద రూ.15 వేలు, కార్పొరేట్ ఆఫర్ కింద మరో రూ.10 వేలు లభించనున్నాయి. ఈ కారుపై ఐదేండ్ల వ్యారెంటీని ఉచితంగా అందిస్తున్నది.

❖ **సియాజ్**
పెట్రోల్ ఇంజిన్ కలిగిన సియాజ్‌పై రూ.75 వేల వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నది మారుతి. వీటిలో వినియోగదారుల డిస్కౌంట్ కింద రూ.25 వేలు లభించనుండగా, అలాగే ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద రూ.40 వేలు, కార్పొరేట్ ఆఫర్ కింద రూ.10 వేలు ఇస్తున్నది. అలాగే డీజిల్ ఇంజిన్‌తో తయారైన సియాజ్‌పై రూ.1.13 లక్షల వరకు ప్రయోజనం లభించనున్నది. దీంట్లో కన్జ్యూమర్ డిస్కౌంట్ కింద రూ.40 వేలు, ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద రూ.40 వేలు, కార్పొరేట్ ఆఫర్ కింద రూ.10 వేలు లభించనున్నాయి. ఎలాంటి చెల్లింపులు జరుపకుండా ఈ కారుపై అదనంగా ఐదేండ్ల వ్యారెంటీ సదుపాయం కూడా కల్పిస్తున్నది.

❖ **ఇగ్నిస్(పెట్రోల్):**
ఇగ్నిస్ పెట్రోల్ వెర్షన్‌ను కొనుగోలు చేసిన వారు రూ.65 వేల ఆదా కానున్నది. దీంట్లో కస్టమర్ డిస్కౌంట్ కింద రూ.30 వేలు, ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద మరో రూ.25 వేలు, కార్పొరేట్ ఆఫర్ కింద రూ.10వేలు ఇస్తున్నది.

❖ **ఎస్-క్రాస్(డీజిల్):**
ప్రీమియం కారైన ఎస్-క్రాస్‌పై మారుతి రూ.1.13 లక్షల వరకు ప్రయోజనలు కల్పిస్తున్నది. ఈ డీజిల్ కారుపై రూ.50 వేలు కన్జ్యూమర్ డిస్కౌంట్ లభించనుండగా, ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద రూ.30 వేలు, కార్పొరేట్ ఆఫర్ కింద రూ.10 వేలు ఆదా కానున్నది. దీంతోపాటు ఐదేండ్లపాటు వ్యారెంటీ కల్పిస్తున్నది. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాల్లో ఈ కారును కొనుగోలు చేసిన వారికి మరో రూ.10 వేలు రాయితీ లభించనున్నది.

❖ **నిస్సాన్ 'రెడ్ వీకెండ్స్ ప్రొగ్రామ్'**
జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్..'రెడ్ వీకెండ్స్' పేరుతో కొనుగోలుదారులకు రూ.1.15 లక్షల వరకు ప్రయోజనాలు కల్పించబోతున్నది. వీటిలో నగదు రాయితీ కింద రూ.40 వేలు అందిస్తున్న సంస్థ..ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.40 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ కింద రూ.10 వేలు అందిస్తున్నది. తొలిసారి కారును కొనుగోలు చేసేవారిని దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన ఈ ప్రత్యేక ఆఫర్‌తో ద్విచక్ర వాహనం నుంచి డాట్సన్ రెడీ-గోతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికినట్లు అవుతదని కంపెనీ ఎండీ రాకేశ్ శ్రీవాత్సవ తెలిపారు. అలాగే తొలిసారి కారును కొనుగోలు చేసిన వారికి 6.99 శాతం వడ్డీకే ఫైనాన్స్ సేవలు అందిస్తున్నట్లు, ఇది 36 నెలల్లో పూర్తిగా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.


తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్ మెదక్
No. HD/173-188/2019-20, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 06-12-2019 ఆఫ్ SE PR మెదక్ (1వ, 2వ, 4వ పిలుపు)
పనుల సంఖ్య (16), పనుల పేరు: దిగువ సంతకందారు పరిధిలో సీనియర్ సిటిజన్ భవన్ నిర్మాణం, ZPHS కొరకు తరగతి గదుల నిర్మాణం, గ్రామపంచాయతీ భవనం నిర్మాణం, మహిళా మండలి భవనం నిర్మాణం, న్యూ అంగన్‌వాడి సెంటర్ నిర్మాణం, 2BHK ఇళ్లు (50 నెం.లు రూరల్) నిర్మాణం మరియు ఇతర అన్ని సివిల్ పనులు. మొత్తం ECV: రూ. 1144.62 లక్షలు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్ నుండి టెండరు షెడ్యూళ్ల లభ్యత: 10-12-2019. టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ & అప్‌లోడింగ్ కొరకు చివరి తేది: 18-12-2019. ఇతర వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్: https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును. ఇ-మెయిల్: se.pr.mdk@gmail.com. ఫోన్ నెం. 08452-295457.
DIPR RO.No. 1915-DP/CL/ADVT/1/2019-20, Dt: 09-12-2019 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్ మెదక్

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ కార్యాలయం, సంగారెడ్డి జిల్లా
టెండరు ప్రకటన
NIT No.: 4/T1/DPRESRD-82-109/2019-20 తేది: 07-12-2019
పనుల సంఖ్య: 28, పనుల పేరు : దిగువ సంతకందారు పరిధిలో కంది, కోహిర్-Pkg-v, vi, సదాశివపేట, కొండాపూర్, న్యాల్‌కల్, పటాన్‌చెరు, ఝరాసంగంలలో అదనపు తరగతిగదుల నిర్మాణం, CC రోడ్ వేయుట, అంగన్‌వాడి బిల్డింగ్ నిర్మాణం, ప్రెస్ క్లబ్ సమీపాన కమ్యూనిటీ హాల్ నిర్మాణం మరియు ఇతర అన్ని సివిల్ పనులు, మొత్తం ECV: రూ.2.11 కోట్లు. దరఖాస్తు చివరి తేది : 13-12-2019న సా. 4.30 గం.వరకు. టెండర్ షెడ్యూల్ జారీ తేది : 16-12-2019, టెండర్ స్వీకరణ తేది : 17-12-2019న మ. 3.00 గం.వరకు. టెండర్లు తెరచు తేది: 17-12-2019న మ. 3.30 గం.కు. తదుపరి వివరాలకు దిగువ సంతకందారును సంప్రదించండి. ఇ-మెయిల్ Id: ee.pr.srd.@gmail.com. సెల్ నం: 9121136120.
DIPR RO No. 1918-DP/CL/Advt/1/2019-20, Dt: 09/12/2019 సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్, PIU సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
హెడ్ ఆఫీస్: హైదరాబాద్
టెండర్ నం.SWC/B4/H&T/OG&IG /టెండర్స్/100/2019-20 తేది: 09-12-2019.
టెండర్లు కోరుతూ ప్రకటన
దిగువ గిడ్డంగుల నుండి సుల్తానాబాద్(STBD) గూడ్స్‌షెడ్ వరకు మరియు సుల్తానాబాద్(STBD) గూడ్స్ షెడ్ వద్ద నిర్వహణ లేదా అదేవిధంగా వెనుకకు రవాణా కొరకు దిగువ గిడ్డంగుల వద్ద నిర్వహణ మరియు రవాణా కాంట్రాక్టర్ల యొక్క నియామకం కొరకు ఆసక్తిగల పార్టీల నుండి ఇ-టెండర్లు కోరబడుతున్నవి. 1) సుద్దాల-I 2) సుద్దాల -II 3) సుద్దాల -III 4) కట్నపల్లి -IG 5) సుల్తానాబాద్ (PEG+IG) 6) కరీంనగర్ (సుల్తానాబాద్ -PEG) వెబ్‌సైట్: www.tswhc.co.in మరియు www.tenderwizard.com/TSWC ద్వారా వివరాలను డౌన్ లోడ్ చేస్కోవచ్చు.
DIPR R.O.No. 534-PP/CL/ Advt/1/2019-20, Dt: 09/12/2019 సం/- మేనేజింగ్ డైరెక్టర్

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ, రంగారెడ్డి
NIT సవరణ నం.1 తేది: 07-12-2019
టెండరు ప్రకటన ప్రకారం
NIT నం. 167-184, తేది: 21-11-2019 షెడ్యూళ్ళ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 26-11-2019 నుండి మరియు ఆఖరి తేది: 04-12-2019
సవరణ నం.1
NIT నం. 169 & 170, తేది: 07-12-2019 షెడ్యూళ్ళ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 11-12-2019 నుండి మరియు ఆఖరి తేది: 19-12-2019
NIT సవరణ నం.2 తేది: 07-12-2019
సవరణ నం. 1 ప్రకారం
NIT నం. 102, 120, 134 & 138, తేది: 11-11-2019 షెడ్యూళ్ళ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 14-11-2019 నుండి మరియు ఆఖరి తేది: 22-11-2019
సవరణ నం. 2
NIT నం. 134 & 138, తేది: 07-12-2019 షెడ్యూళ్ళ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 11-12-2019 నుండి మరియు ఆఖరి తేది: 19-12-2019
తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు
DIPR RO.No.1916-DP/CL/Advt/1/2019-20, Dt: 9/12/19 సం/- ప్రాంతీయ అధికారి, P.R.E.D రంగారెడ్డి

THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A Government Company)
R.O: Kothagudem Collieries - 507101, Telangana.
e-Procurement TENDER NOTICE
The following list of Tenders have been floated through TS Portal for Procurement.
For details, please visit https://tender.telangana.gov.in
NIT/Enquiry No. - Description/Subject - Last date & time for Submission of bid(s)
E0819O0335 - Procurement of Siemens make LV Switchgear items on Specific make basis on RC for 2 years - 19/12/2019 – 17.00 hrs.
E0919O0331 - Supply of Miners Safety Helmets on Rate contract basis for a period of Two years - 21/12/2019 – 17.00 hrs.
E1819O0324 - Drilling, Geophysical logging & Hydro geological investigation works in NEW PATRAPARA COAL BLOCK situated in Talcher coal field, Angul District, Odisha State - 23/12/2019 – 17.00 hrs.
E1619O0339 - Design, Supply, Erection & commissioning of Pre-Weigh Truck Loading System (PWTLS) along with plant & machinery on Turnkey basis at Kondapuram Under Ground (KPUG) Mine, Manuguru Area - 24/12/2019 – 17.00 hrs.
E1119O0341 - DRILLING, EXCAVATION, LOADING, TRANSPORTATION, DUMPING, SPREADING & LEVELLING ETC., OF 254.01 LBCM OF OB (243.910 LBCM OF OB INCLUDES COAL SEAMS,SPLINTER COAL SEAMS & BANDS AND 10.10 LBCM OF TOP SOIL/SUB SOIL FROM EXTERNAL DUMP AREA) WITH CONVENTIONAL EQUIPMENT AT JVR OC-II MINE, KOTHAGUDEM AREA FOR A PERIOD OF 24 MONTHS - 27/12/2019 – 15.00 hrs.
PR/2019-20/MP/SLK/89 For GM (MP)



క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన కానుకతో మురిసిపోతున్న క్రిస్టియన్ మహిళలు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రేయర్ పవర్ చర్చిలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఈ దుస్తులను పంపిణీచేశారు.





ఆసిఫాబాద్- కాగజ్‌నగర్ ప్రాంతంలో సందడిచేస్తున్న అత్యంత అరుదైన ఆర్చర్ ఫాల్కన్, హిమాలయన్ గిర్ఫాన్ జాతుల పక్షులు

## ఆసిఫాబాద్‌లో పక్షుల సందడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆసిఫాబాద్– కాగజ్‌నగర్ మధ్య అభయారణ్యంలోని దేశవిదేశాల పక్షులను వీక్షించేందుకు అటవీశాఖ అవకాశం కల్పిస్తున్నది. అడవుల్లో నడుస్తూ పక్షుల సందడిని ప్రత్యక్షంగా తిలకించడానికి ఈనెల 14, 15 తేదీల్లో బర్డ్‌వాక్‌ను ఏర్పాటుచేసింది. ఆసక్తిగలవారు 7337552600, 9550005343 నంబర్లకు ఫోన్‌చేసి వివరాలను నమోదుచేసుకోవాలని ఆసిఫాబాద్ డీఎఫ్‌వో రంజిత్‌నాయక్ కోరారు. 150 మందికి మాత్రమే అనుమతించనున్నట్టు వెల్లడించారు. జలపాతాలు, వన్యప్రాణులు, దేశ, విదేశీ పక్షులకు ఈ ప్రాంతం స్థావరంగా మారింది. 270 రకాల పక్షిజాతులు ఇక్కడ సందడి చేస్తున్నాయి.



# సిక్త్స్ సెన్స్ ఒక ఆయుధం

### ప్రమాదానికి ముందే హెచ్చరికలు

- ప్రతి ఒక్కరిలో ఇన్‌ట్యూషన్ పవర్
- గుర్తించి.. అప్రమత్తం కావటమే కీలకం
- దిశను ముందే హెచ్చరించిన సిక్త్‌సెన్స్
- తీవ్రతను గుర్తించలేకపోయిన బాధితురాలు
- యోగా, ధ్యానంతో మరింత ఇన్‌ట్యూషన్ పవర్
- ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి





**దయ్యంలా వెంటపడ్డాడు.. నాకు భయమవుతున్నది.. అంటూ లారీడ్రైవర్లు, క్లీనర్ల ఘాతుకానికి బలికావడానికి కొద్దిసేపటి ముందు దిశ తన చెల్లెలికి ఫోన్‌లో చెప్పింది! అక్కడకాకుండా.. టోల్‌బూత్ వద్దకు వెళ్లి నిలబడాలని చెల్లెలు సూచించింది! ఈ ఘటనలో ఏదో ప్రమాదం పొంచి ఉన్నదనే సంకేతం దిశకు వచ్చింది! ఫలితంగానే అక్కడి పరిస్థితిని తన చెల్లెలికి సరిగ్గానే వివరించగలిగింది! అదే ఇన్‌ట్యూషన్ పవర్! సిక్త్ సెన్స్! ప్రమాదకర పరిస్థితుల్లో మనసు ఏదో కీడు శంకించడమే ఈ ఇన్‌ట్యూషన్ పవర్! కానీ.. దురదృష్టవశాత్తూ తన ఇన్‌ట్యూషన్ పవర్ మోగించిన ప్రమాద ఘంటికలకు దిశ అప్రమత్తం కాలేకపోయింది.. నరరూప రాక్షసుల చేతిలో బలైపోయింది!**

**- హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ**

## సిక్త్‌సెన్స్ చెప్పేది తేలిగ్గా తీసుకోవద్దు

ప్రతి మనిషిలో సిక్త్‌సెన్స్ దాగి ఉంటుంది. అదొక అద్భుత శక్తి. మనం చేసేపని.. తీసుకునే నిర్ణయం సరైనదా? కాదా? అనే విషయాలపై ఇన్‌ట్యూషన్ పవర్ (సిక్త్‌సెన్స్) ఎప్పటికప్పుడు హెచ్చరిస్తుంటుంది. ఆ సంకేతాలను సరైన సమయంలో పట్టుకోవడమే కీలకం అవుతుందని నిపుణులు చెప్తున్నారు. చాలా సందర్భాల్లో సిక్త్‌సెన్స్ హెచ్చరికలతో ప్రమాదాలనుంచి బయటపడినవారూ ఉన్నారు. ఈ విషయం ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీ అధ్యయనంలో తేలింది. ప్రముఖ న్యూరో సైంటిస్ట్ డాక్టర్ లిండ రినామన్ తన అధ్యయనంలో సిక్త్‌సెన్స్ శక్తిని గుర్తించారు. సిక్త్‌సెన్స్‌తో మెదడుకు వెళ్లే సంకేతాలు ఎమోషన్స్, నిర్ణయాలు, మూడ్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని ప్రకటించారు. ప్రమాదకరపరిస్థితుల్లో కొంతమంది వ్యక్తుల ఆలోచనలు.. వారి సిక్త్‌సెన్స్ ఎలా ఉపయోగపడిందనే విషయాలను తెలుసుకొన్నారు. ఈ విషయాలను ఫిజియాలజీ పేపర్‌లో ప్రచురించారు. సిక్త్‌సెన్స్‌తో ప్రమాదాలను గుర్తించొచ్చని తేల్చారు. ఇప్పుడు ఈ అధ్యయనం హాట్ టాపిక్‌గా మారింది. దిశ ఎప్పుడైతే ప్రమాదాన్ని ఊహించిందో.. అప్పుడే తగిన జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేదని మనస్తత్వ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదంలో ఉన్నామనుకున్నప్పుడు అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా గమనించాలని, ఆ సమయంలో మనం ఏం ఆలోచిస్తున్నాం అనేది ప్రధానమని నిపుణులు చెప్తున్నారు. ప్రతికూల పరిస్థితులున్నాయా? సానుకూల పరిస్థితులా ? అనేది తేల్చుకుని.. ఏ కొంచెం ప్రతికూలం అనిపించినా.. ఆ పరిస్థితి నుంచి బయటపడాలని సైకియాట్రిస్టులు సూచిస్తున్నారు.

## అందరిలోనూ ఆ సెన్స్ ఉంటుంది



ఇన్‌ట్యూషన్ ప్రతి మనిషిలో ఉంటుంది. చాలామందిలో నిద్రావస్థలో ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సాక్ష్యాలు, క్లూస్ లేకుండా ఏదో జరుగుతుందని అనిపించడమే సిక్త్‌సెన్స్. ఈఎస్పీ (ఎక్స్ట్రా సెన్సరీ పర్సెప్షన్) అనేది కొందరిలో యాక్టివేట్ అవుతుంది. ఏదైనా ప్రమాదం జరిగితే.. ముందే అనిపించిందని కొందరు చెప్తుంటారు. అది ఈఎస్పీ. అందులో భాగమే సిక్త్‌సెన్స్. సబ్‌కాన్షియస్ మైండ్ యాక్టివేట్ అయి ఇలాచేస్తే బాగుంటుందని డైరెక్షన్ ఇచ్చినట్టు అనిపిస్తుంది. మనం మెదడు పనితీరును సరిగా ఉపయోగించుకోవడంలేదు. అది చాలా శక్తిమంతమైనది. రోజూ రొటీన్ పనులకే వాడుతున్నాం. సరైనవిధంగా ఉపయోగిస్తే యోగులుగా శక్తులు సంపాదించుకోవచ్చు.

**- డాక్టర్ స్వాతి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ, ఉస్మానియా యూనివర్సిటీ**

## మెడిటేషన్‌తో ఇన్‌ట్యూషన్ పవర్

ప్రశాంతంగా జీవించగలిగితే ఇన్‌ట్యూషన్ వపర్‌ను పొందొచ్చు. సిక్త్‌సెన్స్ అన్నా.. ఇన్‌ట్యూషన్ లేదా గట్ ఫీలింగ్ అన్నా ఒక్కటే. యోగా, మెడిటేషన్‌తో ఈ శక్తిని పెంచుకోవచ్చు. ఒత్తిడి, తీవ్ర ఆలోచనలు చేసేవారిలో ఇన్‌ట్యూషన్ పవర్ కాస్త తక్కువ ఉంటుంది. అలా జరుగుతుందని ముందే ఊహించడం.. అదే జరుగడాన్ని సిక్త్‌సెన్స్ అంటారు. ఎవరైనా సరే ప్రమాదకర పరిస్థితుల్లో ఇన్‌ట్యూషన్ పవర్‌తో తమనుతాము కాపాడుకోవచ్చు. అక్కడి పరిస్థితులు మనల్ని ఏ విధమైన ఆలోచనలకు దారిచూపిస్తున్నాయో గమనించి అప్రమత్తంకావాలి. నిర్లక్ష్యం చేయకూడదు. ఇలా అనేకమంది ప్రమాదాలను ముందే గుర్తించి బయటపడినట్టు అనేక పరిశోధనల్లో తేలింది.



**- డాక్టర్ జీసీ కవిత, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్**

# వృద్ధురాలికి రెవెన్యూ ఉద్యోగి సాయం

- ఆధార్‌కార్డు పోగొట్టుకోవడంతో బ్యాంకులోనే పింఛన్
- మీ సేవలో ఆధార్‌కార్డు ప్రింట్ తీయించిన జూనియర్ అసిస్టెంట్
- బాధితురాలి ఖాతాలో రూ.8,200 సొమ్ము.. ఆనందంలో లబ్ధిదారు



వృద్ధురాలు రజియాబీ వేలిముద్రలు తీసుకుంటున్న రెవెన్యూ ఉద్యోగి రిచర్డ్ సైమన్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఆధార్‌కార్డు పోగొట్టుకొని పింఛన్ అందుకోలేక ఇబ్బందులు పడుతున్న ఓ వృద్ధురాలికి రెవెన్యూ ఉద్యోగి సాయమందించారు. హైదరాబాద్‌లోని బండ్లగూడ మండలం కందికల్ గేట్ ప్రాంతానికి చెందిన రజియాబీ ఆసరా పింఛన్ లబ్ధిదారు. ఆమె ఆధార్‌కార్డు పోగొట్టుకోవడంతో కొంతకాలంగా పింఛన్ అందుకోలేకపోతున్నది. ఆధార్ నంబర్, బొటనవేలి ముద్ర ఉంటేనే పింఛన్ సొమ్ములు డ్రాచేసుకొనే వెసులుబాటు ఉన్నది. పింఛన్ డబ్బులు సుమారు ఆరు నెలలుగా బ్యాంకు ఖాతాలో జమవుతున్నా తీసుకోలేని పరిస్థితి. దీంతో ఆ వృద్ధురాలు సీతాఫల్‌మండిలోని ఓ దేవాలయంలో ఆశ్రయంపొందుతూ యాచకురాలిగా పొట్టపోసుకుంటున్నది. పింఛన్ అందకపోవడంతో బాధితురాలు కాస్త కనికరించి న్యాయంచేయండంటూ బండ్లగూడ తాసిల్ కార్యాలయానికి వెళ్లి అక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా (పింఛన్ సెక్షన్) పనిచేస్తున్న ఎంజే రిచర్డ్ సైమన్‌కు తన దీనస్థితిని వివరించింది. దీంతో ఎంజే రిచర్డ్ సైమన్ ప్రత్యేక చొరవ తీసుకొని వృద్ధురాలి పింఛన్ ఖాతాకు అనుసంధానించిన ఆధార్ నంబర్ ఆధారంగా మీ సేవ కేంద్రానికి వెళ్లి ఆధార్ కార్డును ప్రింట్ తీయించారు. అనంతరం ఆమె బొటనవేలి ముద్రలు వేయించి బ్యాంకు ఖాతాలో పరిశీలిస్తే రూ.8,200 ఉన్నాయి. రూ.7,200 డ్రాచేయించి తాసిల్దార్ చేతులమీదుగా లబ్ధిదారు రజియాబీకి అందజేశారు. దీంతో ఆ వృద్ధురాలి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

## టీవీవీ అధ్యక్షుడు మద్దిలేటిపై
# ఎన్‌ఐఏ కేసు నమోదు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ విద్యార్థి వేదిక (టీవీవీ) అధ్యక్షుడు మద్దిలేటిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) కేసు నమోదుచేసింది. గత అక్టోబర్ 10వ తేదీన హైదరాబాద్ నల్లకుంటలోని మద్దిలేటి ఇంట్లో సోదాలు నిర్వహించిన స్థానిక పోలీసులు.. ఆయనకు నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఉన్నట్టు ఇప్పటికే కేసు నమోదుచేశారు. ఈ సోదాలలో మావోయిస్టు పార్టీతో మద్దిలేటికి లింక్‌లున్నట్టు ఆధారాలు లభించాయని, మావోయిస్టు పార్టీ తెలంగాణ కార్యదర్శి హరిభూషణ్ అలియాస్ యాప నారాయణ, అల్లూరి, మనోహర్‌కు సంబంధించిన లేఖలతోపాటు పలువురికి రాసిన బెదిరింపు లేఖలు, మాయివోస్టుల సమాచారానికి సంబంధించిన లేఖలు, కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లు, విప్లవసాహిత్యం లభించాయని పోలీసులు తెలిపారు. టీవీవీ పట్టణ ప్రాంతాల్లో మావోయిస్టుల రిక్రూట్‌మెంట్‌లో కీలకపాత్ర వహిస్తున్నట్టు పేర్కొన్నారు. టీవీవీపై సమగ్ర దర్యాప్తు కోసం ఈ కేసును హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీసీఎస్ ఆధీనంలోని సిట్‌కు బదిలీచేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసుపై దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తుకు ఎన్‌ఐఏను ఆదేశించింది. దీంతో ఎన్‌ఐఏ తాజాగా కేసు నమోదుచేసింది.

## ఏపీలో ప్రాణం తీసిన ఉల్లి!

రైతు బజారులో క్యూలో నిల్చున్న వ్యక్తి మృతి

**అమరావతి:** రైతు బజారులో ప్రభుత్వం ఇచ్చే రాయితీ ఉల్లిగడ్డల కోసం క్యూలో నిల్చున్న వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గుడివాడలో సాంబయ్యరెడ్డి (65) సోమవారం ఉదయం ఉల్లిగడ్డల కోసం రైతు బజారుకు వెళ్లి క్యూలో నిల్చున్నారు. భారీగా జనం ఉండటంతో చిన్నపాటి తోపులాట చోటుచేసుకున్నది. గంటల తరబడి క్యూలో నిల్చుని ఎండను తట్టుకోలేక సాంబయ్య కుప్పకూలిపోయారు. వెంటనే అతడిని ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు.

## ఐటీఐలకు కేంద్రం నిధులివ్వాలి

ఐటీఐ ఉద్యోగుల జాతీయకౌన్సిల్‌లో తెలంగాణ అసోసియేషన్ తీర్మానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐటీఐల నిర్వహణ కేంద్రం పరిధిలో ఉన్నప్పటికీ రాష్ట్రాలే నిధులు భరిస్తున్నాయని, వీటికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదలచేయాలని తెలంగాణ ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం తీర్మానం చేసింది. ఐటీఐ కోర్సుల్లో కేంద్రం నిర్దిష్టమైన విధానం అవలంబించడంలేదని, అన్ని రాష్ట్రాల్లో ఒకేవిధానం ఉండాలని పేర్కొన్నది. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో రెండ్రోజుల ఐటీఐ ఉద్యోగుల జాతీయకౌన్సిల్ సమావేశాలు సోమవారం మొదలయ్యాయి. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి హాజరైన టీఎన్జీవో, టీజీవో అనుబంధ సంఘాల నేతలు పలు సూచనలు చేశారు. సమావేశంలో టీఎన్జీవో ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఐటీఐ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఈ కొండల్‌రెడ్డి, టీఎన్జీవో ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్ విభాగం సెక్రెటరీ ఆర్ శ్రీనివాస్, టీజీవో ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ విభాగం ఉపాధ్యక్షుడు పీ వెంకటేశ్వర్‌రావు, కార్యవర్గసభ్యులు వై రమేశ్, జీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హవాలా డబ్బు పట్టివేత

ఒకరు అరెస్ట్, 25 లక్షలు స్వాధీనం

**సుల్తాన్‌బజార్:** హవాలా డబ్బు తరలిస్తున్న ఒక వ్యక్తిని హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని రూ.25 లక్షలు స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఘటన సుల్తాన్‌బజార్ పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ సుబ్బరామిరెడ్డి కథనం ప్రకారం.. గుజరాత్‌కు చెందిన సోలంకీ గజేంద్రసింగ్ అలియాస్ పింటూ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి హనుమాన్ టేక్డీలోని గుజరాత్‌గల్లీలో నివాసముంటున్నాడు. ముంబైకి చెందిన హవాలా వ్యాపారి కేపీ పటేల్ వద్ద కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం యాజమాని ఆదేశాల మేరకు రూ.25 లక్షల నగదును హోండా యాక్టివాలో పెట్టుకొని హన్‌మాన్ టేక్డీ వైపు వెళ్తుండగా ఎస్సై చంద్రమోహన్ నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డాడు. నగదుకు సంబంధించిన పత్రాలను చూపకపోవడంతో పోలీసులు వాహనంతోపాటు సోలంకీని అదుపులోకి తీసుకొని నగదును స్వాధీనపర్చుకొన్నారు.




నమస్తే తెలంగాణ
# జిందగీ
మంగళవారం 10 డిసెంబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

**ఈమె ఎక్కడ అవమానాలు ఎదుర్కొన్నదో.. అక్కడే జేజేలు అందుకుంటున్నది. ఈ యువతిని ఎవరు 'ఛీ' కొట్టారో.. వారే ఆత్మీయంగా అభినందిస్తున్నారు. 'నువ్వెందుకూ పనికిరావు' అన్నవారే.. 'సరిలేరు నీకెవ్వరూ' అంటున్నారు. కారణం.. ఆమె ఆత్మవిశ్వాసం. ఎవరెన్ని మాటలన్నా.. తానేంటో తనకు తెలుసు. తనలాంటి సమాజం ఎదుర్కొంటున్న ఆ అవమానాలకు తన గెలుపుతోనే సమాధానం చెప్పాలనుకుంది. చెప్పింది. తానెంచుకున్న లక్ష్యాన్ని సాధించి.. 'శభాష్' అనిపించుకుంటున్నది. ఆమె ఎవరో కాదు.. దక్షిణాఫ్రికా నల్లకలువ.. విశ్వసుందరి 'జోజిబినీ తున్జే'.**

# విశ్వమంత ఆత్మవిశ్వాసం

**'జోజిబినీ** ఎప్పటికీ విశ్వసుందరి కాలేదు. కారణం ఆమె అగ్లీగా ఉండడమే. అంతేకాదు ఆమె చూడ్డానికి మగాడిలా ఉంటుంది. మిస్ యూనివర్స్ సౌత్ ఆఫ్రికా అయ్యేందుకు జోజిబినీకి ఆ అర్హత కూడా లేదు. ఆమెపై ఆశలు పెంచుకొని మిమ్మల్ని మీరు మోసం చేసుకోకండి' అని అమెజ్‌మెంట్ అనే వ్యక్తి నవంబర్ 30న ట్విట్టర్‌లో ఈ పోస్టు పెట్టారు. అదేరోజు దక్షిణాఫ్రికా నుంచి జార్జియాకు విశ్వసుందరి పోటీలకు పయనమైంది జోజిబినీ.
'ఓరి దదేవుడా.. చికెన్ లివర్ రంగున్న ఈ పిల్ల మన సౌత్ ఆఫ్రికా మిస్ యూనివర్సా?!' అని బూసీ అనే మరో వ్యక్తి డిసెంబర్ 1న ట్వీట్ చేశాడు.
'జోజిబినీ.. ఇదీ నీ అందమైన ముఖం'అంటూ ఆమెను వెక్కిరిస్తూ.. శ్వేతజాతి యువతి అందవికారమైన ఫొటో సోషల్ మీడియాలో పోస్టు చేసింది.
ఇదీ.. విశ్వసుందరి పోటీలకు దక్షిణాఫ్రికా నుంచి ఎంపికైన 'జోజిబినీ తున్జే'పై సోషల్ మీడియా వేదికగా చూపించిన జాతి వివక్ష. ఇక్కడ రాసినవి మచ్చుకు మాత్రమే. ఇలాంటివి ఇంతకంటే ఘోరమైన వివక్షను ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విటర్ వేదికగా ఆమె ఎదుర్కొనది. అందుకే తనపోరాటాన్ని నేడు విశ్వవ్యాప్తం చేసింది జోజిబినీ. విశ్వసుందరి కిరీటం నెగ్గి.. ఒక్కసారిగా అందరి నోళ్లు మూయించింది. యావత్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకునేలా చేసి.. జాతి, లింగ వివక్షను రూపుమాపాలని కోరుతున్నది.

* * *

డిసెంబర్ 8.. అట్లాంటాలోని టైలర్ పెర్రీ స్టూడియోస్‌లో విశ్వసుందరి పోటీల ఫైనల్స్ జరుగుతున్న సందర్భమది. ఈ అందాల పోటీలకు పాపులర్ టీవీ పర్సనాలిటీ 'స్టీవ్ హార్వే' హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ఎదురుగా ఏడుగురు మహిళలతో కూడిన న్యాయనిర్ణేతల బృందం.
ఫైనల్ రౌండ్‌లోకి ప్రవేశించిన ముగ్గురు పోటీదారులకు వాతావరణ మార్పు, గోప్యత, పునరుత్పత్తి, ఆరోగ్యం, రాజకీయ సమస్యల గురించి ప్రశ్నలు సంధించారు. ఒక్కొక్కరూ తమ అవగాహన మేరకు సమాధానాలు చెప్పారు. ఆ ముగ్గురికీ కలిపి చివరి ప్రశ్న సంధించారు స్టీవ్ హార్వే. 'నేటి బాలికలకు అత్యంత ప్రాధాన్యమైన అంశాన్ని నేర్పించాలంటే మీరు ఏమి నేర్పుతారు?'



### ఆ జోస్యం నెరవేరింది..

విశ్వసుందరిగా జోజిబినీ గెలుస్తుందని కొన్ని యూట్యూబ్ చానెల్స్, సోషల్ మీడియా చాలా మంది జోస్యం చెప్పారు. పోటీలు ప్రారంభమైన నాటి నుంచే జోజిబినీ కచ్చితంగా టాప్-5లో చోటు సంపాదిస్తుందని జోస్యం చెప్పారు. ఎందుకంటే ఈ పోటీలకు సంబంధించి ప్రతీ పోటీలోనూ జోజిబినీ వందశాతం ఆత్మవిశ్వాసంతో ఉన్నది. అందుకే ఆమె చివరి వరకూ ఉంటుందని అంతా ఆశించారు, ఆకాక్షించారు. వారందరి అంచనాలనూ నిజం చేస్తూ.. జోజిబినీ తుంజీ మిస్ యూనివర్స్ కిరీటం కైవసం చేసుకున్నది. 68వ విశ్వసుందరి పోటీలకు 90 దేశాల నుంచి వచ్చిన సుందరీమణులను పక్కకునెట్టి విజేతగా నిలిచింది. దక్షిణాఫ్రికా నుంచి విశ్వసుందరి కిరీటం గెలిచిన మూడో యువతిగా, తొలి నల్లజాతీయురాలిగా చరిత్రకెక్కింది జోజిబినీ. 1978లో మార్గరెట్ గార్డినర్, 2017లో డెమీ-లెయ్ నెల్-పీటర్స్ విశ్వసుందరి కిరీటాల్ని కైవసం చేసుకున్నారు.

కున్న వాతావరణం లింగ వివక్షను పరిచయం చేసింది. వాటికితోడు 'మహిళలు ఏం చేయలేరనే చులకన భావన'. అలాంటి క్లిష్ట పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకుంటూ పోరాటాల బాటపట్టింది జోజిబినీ.
సోషల్ మీడియా వేదికగా లింగ వివక్షపై పోరాటం మొదలుపెట్టింది. వివక్ష ఎదుర్కొంటున్న మహిళలు, యువతను కూడగట్టింది. పురుషులు వివక్ష చూపకుండా మహిళలకు తోడుగా నిలిచి, ఉపాధి అవకాశాలు ఇవ్వాలంటూ #HeforShe ఉద్యమాన్ని చేపట్టింది జోజిబినీ. ఈ ఉద్యమానికి ఎంతోమంది మద్దతునిచ్చారు. అంతేకాకుండా జాతి వివక్ష ఎదుర్కొంటున్న నల్లజాతీయుల పక్షానా పోరాడింది జోజిబినీ. అందుకే తాను విశ్వసుందరి కిరీటం గెలిచాక.. ఆ విశ్వవేదిక మీద నుంచే తనజాతికి సందేశమిచ్చింది. 'అచ్చం నాలాగే కనిపించే మహిళలు ఉన్న ప్రపంచలో నేను పెరిగాను. వారిది కూడా నాలాంటి శరీర వర్ణమే. శిరోజాలు కూడా నా వంటివే. అయితే మమ్మల్ని ఎవరూ ఎప్పుడూ సౌందర్యరాశులుగా పరిగణించలేదు. నేటి నుంచి ఆ భావన తొలగిపోతుందనుకుంటున్నా. అలా అనుకునే వాళ్లు నా ముఖం చూడండి. నా ముఖంలో ప్రతిబింబిస్తున్న మీ ముఖాలు చూసుకోండి' అని తన దేశ మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపింది జోజిబినీ. కాట్రియోనా గ్రే(ఫిలిప్పైన్స్) కిరీటం అలంకరించగా.. తుంజీ కన్నీటి పర్యంతమై.. 'నేను చేయాల్సింది ఇంకా చాలా ఉంది' అంటూ ఉద్వేగానికి లోనైంది.

సౌత్ ఆఫ్రికా 2019' పోటీల్లో పాల్గొన్నది. ఈసారి మిస్ సౌతాఫ్రికాగా ఎంపిక కాకపోతే.. 2020లో ఎలాగైనా సాధించాలనుకున్నది. అలా ఎన్నో అంచనాల నడుమ 26 జూన్ 2019న పోటీల్లో అడుగుపెట్టింది. తర్వాత టాప్-35 సెమీఫైనలిస్టులలో ఒకరిగా నిలిచింది. తదుపరి పోటీల్లో తన ప్రతిభ చూపి టాప్-16లో చోటు సంపాదించింది. అలా సెమీఫైనల్ నుంచి ఫైనల్స్‌కు అర్హత సాధించి ఆగస్టు 9న 'మిస్ సౌత్ ఆఫ్రికా 2019'గా అవతరించింది జోజిబినీ తున్జే. పోటీలో గెలిచిన రూ.7.20 కోట్లతో పాటుగా కొత్త కారు, జోహాన్నెస్‌బర్గ్‌లోని శాండ్టన్ పరిసరాల్లో ఓ అపార్ట్‌మెంట్ బహుమతులుగా లభించాయి.

### ఆఫ్రో-టెక్స్చర్డ్ హెయిర్..

విశ్వసుందరిగా ఎంపికైనా జోజిబినీ తున్జే అన్నింటిలో ప్రత్యేకమే. ముందుగా చెప్పుకోవాల్సింది ఆమె హెయిర్‌స్టైల్. ఆఫ్రికా దేశస్తులకు 'ఆఫ్రో-టెక్చర్డ్ హెయిర్' ఉంటుంది. అలాంటి జుట్టును ట్రిమ్ చేసి.. పురుషుల్లా కటింగ్ చేయించింది. అందాల పోటీలంటే 'అందమైన ముఖం, పొడవైన జుట్టు, ఆకట్టుకునే శరీర ఆకృతి ఉండాలి' అనే విధానానికి స్వస్తి చెప్పింది తున్జే. కారణం.. బాహ్య సౌందర్యం కన్నా.. ఆత్మ సౌందర్యమే ముఖ్యమనేది తున్జే అభిప్రాయం. సహజ సౌందర్యం పెంపుదలపై ఎంతోమందికి సలహాలు కూడా ఇస్తుంటుంది. వివక్ష కారణంగా న్యూనతా భావానికి లోనైన ఎంతో మంది మహిళల్లో ధైర్యం నింపింది. వివక్ష ఎదుర్కొన్నప్పుడే ఇంకా శక్తివంతం కావాలనే స్ఫూర్తినింపేది. సహజమైన చర్మం, అందమైన వ్యక్తిత్వం కంటే ప్రపంచంలో మేలైంది ఏదీ లేదని బాధితులకు తోడుగా నిలిచేది తున్జే. 'మార్వెల్ మూవీస్'కి తున్జే వీరాభిమాని. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' సినిమాను ఎన్నో సార్లు చూసిందట.



'నేటి యువతులకు నైతిక విలువలు నేర్పించడం చాలా ముఖ్యం. సోషల్ మీడియాలో కనిపించేవి, బంధాలు అన్నీ నిజం కాదు. పరిపూర్ణ సంబంధాలు.. జీవితానికి పరిపూర్ణతనిస్తాయి. ఒక యువతి నైతిక విలువలు కలిగి ప్రపంచాన్ని ప్రతిబింబించాలి' అని మెక్సికోకు చెందిన సోఫియా సమాధానమిచ్చింది.
'యువతులకు నేర్పించాల్సిన అతి ముఖ్యమైన విషయం నాయకత్వం. ఇది చాలాకాలంగా యువతులు, స్త్రీలలో లేదు. మన సమాజం మహిళలను అలా తయారు చేసింది. మహిళలే ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనవారని నేను నమ్ముతాను. అందుకే మహిళలకు ప్రతి అవకాశాన్నీ ఇవ్వాలనేది నా అభిప్రాయం. అదే నేటి యువతులకు నేర్పించాలి' అని దక్షిణాఫ్రికాకు చెందిన జోజిబినీ తున్జే సూటిగా చెప్పింది.
'చాలామంది ప్రజలు ఆత్మకు ముసుగులు ధరించే ఉన్నారు. వాటిల్లో ఒకటి అంతరాత్మను చూడడం. మన స్ఫూర్తిగా జీవిస్తే అందులో ఆనందం ఉంటుంది' అని ప్యూర్టోరికోకు చెందిన మాడిసన్ చెప్పింది.
వచ్చిన మూడు సమాధానాల్లో కెల్లా అత్యుత్తమంగా ఉన్న 'నాయకత్వం' సమాధానాన్ని ఆధారం చేసుకొని జోజిబినీ తున్జేని విశ్వసుందరిగా ప్రకటించారు నిర్వాహకులు.
ఆమె అలా సమాధానం చెప్పడానికి కారణం.. తన టీనేజ్ మొత్తం పోరాటాలతోనే గడిచింది కాబట్టి. జోజిబినీ పెరిగిన వాతావరణం జాతి వివక్షను చూపిస్తే.. ఆమె చదువు



జోజిబినీ పోరాటం, ఆమె ఎదుర్కొన్న అవమానాలను దగ్గరగా చూశారు కొందరు మాజీ విశ్వసుందరీమణులు. తున్జీ విజేతగా అవతరించడంతో 'సౌతాఫ్రికా.. ఆమె సాధించింది చూశావా? జోజిబినీ నువ్వో గొప్ప మహిళవు' అంటూ 2017 దక్షిణాఫ్రికా విశ్వసుందరి డెమీ-లై నెల్- పీటర్స్ భావోద్వేగంగా పోస్టు చేశారు. మొదట తున్జేపై సోషల్ మీడియా వేదికగా వివక్ష పోస్టులు పెట్టిన వారు.. ఆమె గెలువగానే తమ అకౌంట్లు డిలీట్ చేశారు.

← **తల్లిదండ్రులతో విశ్వ సుందరి జోజిబినీ తున్జే**

### 2017లో మోడలింగ్ కెరీర్

28 యేండ్ల జోజిబినీ తున్జీ దక్షిణాఫ్రికాలోని సోలోలో జన్మించింది. తండ్రి లుంగిసా తున్జీ, తల్లి ఫిలస్వా నాడపు. తండ్రి దక్షిణాఫ్రికాలో ఉన్నత విద్య, శిక్షణా విభాగంలో ఉద్యోగం చేస్తున్నారు. ముగ్గురు తోబుట్టువుల్లో జోజిబినీ ఒకరు. ఉన్నత చదువుల కోసం కేప్ టౌన్‌కు వెళ్లిన తున్జీ.. కేప్ పెనిన్సులా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో చదివింది. అక్కడ 2018లో పబ్లిక్ రిలేషన్స్, ఇమేజ్ మేనేజ్‌మెంట్‌లో బ్యాచిలర్ డిగ్రీ పట్టా పొందింది. 2017లో మోడలింగ్ వైపు మళ్లింది. అప్పుడు 'మిస్ సౌత్ ఆఫ్రికా-2017' పోటీల్లో పాల్గొని టాప్-26 సెమీఫైనలిస్టులలో ఒకరిగా నిలిచింది. ఆ ఉత్సాహం ఎంతోసేపు నిలువలేదు. టాప్-12 లిస్టులో జోజిబినీ పేరు లేకపోవడంతో కొద్దిరోజులు బాధపడింది. ధైర్యం తెచ్చుకొని ఎలాగైనా 'మిస్ యూనివర్స్'గా నిలిచి వివక్షపై తన గొంతును ప్రపంచవ్యాప్తంగా వినిపించాలని నిర్ణయించుకున్నది. అదే కసి, పోరాటపటిమతో 'మిస్

...✍ డప్పు రవి

# పాఠాలలో కొత్తపుంతలు



**పిల్లల విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేలా ఏదైనా చేయాలనుకున్నది ఓ మహిళ. అందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సరికొత్త పాఠాలు చెప్పడం మొదలు పెట్టింది. తాను ప్రారంభించిన సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు సేవలందిస్తూ కోట్లు సంపాదిస్తున్నదీమె.**

ఢిల్లీకి చెందిన కిరణ్‌ధామ్ అనే మహిళ విద్యా రంగంలో సాంకేతిక అవసరాలను గుర్తించింది. సరికొత్త పరిష్కారాలను అందించేందుకు ముందుకు వచ్చింది. ఢిల్లీ యూనివర్సిటీలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్ డిగ్రీ చేసింది కిరణ్‌ధామ్. కొన్నాళ్లు ఓ సంస్థలో మార్కెటింగ్ విభాగంలో పనిచేసింది. ఆ సమయంలోనే నేటి విద్యా వ్యవస్థలో ఎటువంటి మార్పులు తీసుకువస్తే బాగుంటుందని ఆలోచించింది. సాంకేతిక విద్యలో ఉన్న లోపాలను గ్రహించింది. గతంలో ఆమెకు మార్కెటింగ్ విభాగంలో పని చేసిన అనుభవం ఉన్నది. సాంకేతిక పరిష్కారాలు అందించే దిశగా పరిశోధనలు మొదలు పెట్టింది. చిన్నారులు సులువుగా పాఠాలు అర్థం చేసుకునేందుకు అవసరమైన అంశాలపై దృష్టి సారించింది. డిజిటల్ టీచింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టింది. కిరణ్‌ధామ్ భర్త సహకారంతో చిన్నారులకు వినూత్నంగా పాఠాలు చెప్పేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌లను రూపొందించింది. వీడియోలతోపాటు త్రీడి సైన్సుల్యాబ్‌లు, డిజిటల్ బోర్డులు రూపొందించింది. 'గ్లోబస్ ఇన్ఫోకామ్' పేరుతో డిజిటల్ సేవలందించే ఓ సంస్థను ప్రారంభించింది. మొదట కోల్‌కతాలోని కొన్ని స్కూళ్లకు ఆమె సేవలందించింది. ఆమె రూపొందించిన వినూత్న బోధనా పద్ధతులు చిన్నారులను ఆకట్టుకున్నాయి. ఢిల్లీతోపాటు బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లకు చెందిన 36 పాఠశాలలకు ఆమె ఉత్పత్తులను అందించింది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న అన్నిరకాల సిలబస్‌ను బొమ్మలు, వీడియోల రూపంలో రూపొందించింది. ఆమె అందించిన సిలబస్ విద్యార్థులకు సులభంగా అర్థమవ్వడంతో మరిన్ని విద్యా సంస్థలు ఆమె అందిస్తున్న ఉత్పత్తులూ, సేవలు అందుకోవడానికి ముందుకొచ్చాయి. దీంతో ధామ్ రెండేండ్లలోనే రూ.100 కోట్లు ఆర్జించగలిగింది.' మెట్రో నగరాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని బాగా ఉపయోగించుకుంటున్నాయి', కానీ గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలలు ఈ విషయంలో వెనుకపడుతున్నాయి. అటువంటి వాటికి అవగాహన కల్పిస్తూ విద్యా ప్రమాణాలను పెంచే ప్రయత్నం చేస్తున్నామని కిరణ్‌ధామ్ చెబుతున్నది. విద్యా వ్యవస్థను కొత్త పుంతలు తొక్కిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నది.



# తెల్లజుట్టును మార్చేయండిలా!

**పాతికేళ్లు నిండకముందే జుట్టు తెల్లబడడం సాధారణమైంది. దీంతో యుక్తవయసులోనే పెద్దవాళ్లుగా కనిపిస్తున్నారు. ఈ సమస్యకు ఇంట్లోనే చక్కటి పరిష్కారం ఉంది.**

- తెల్లజుట్టుకు రంగేయడమంటే వెంటనే గుర్తొచ్చేది హెన్నా. ఈ పౌడర్‌ను ఆముదంలో మరిగించాలి. చల్లబడ్డాక జుట్టు కుదుళ్లకు తాకేలా రాయాలి. రెండు గంటల తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి.
- రెండు టేబుల్ స్పూన్ల కాఫీపొడిని కప్పు నీటిలో మరిగించాలి. చల్లారక జుట్టుకు పట్టించి మసాజ్ చేయాలి. గంట తర్వాత తలస్నానం చేస్తే సరిపోతుంది.
- బ్లాక్ టీ పొడిని నీటిలో మరిగించి.. గోరువెచ్చగా అయ్యాక తలకు రాసుకోవాలి. ఓ గంట తర్వాత తలస్నానం చేయాలి.
- వాల్‌నట్లను నలిపి అరగంట సేపు నీటిలో మరిగించాలి. తర్వాత కాటన్‌బాల్ సాయంతో జుట్టు కుదుళ్లకు పట్టించాలి. ఓ గంట తర్వాత తలస్నానం చేయాలి.
- ఈ చిట్కాలన్నీ ఒక్కరోజులో చేస్తే సరిపోదూ.. దాదాపు ఓ నెలపాటు క్రమం తప్పకుండా వాడాలి. అప్పుడు మంచి ఫలితం ఉంటుంది.

# ఆరోగ్యానికి వేపనూనె



**కొందరు చిన్న చిన్న సమస్యలకూ డాక్టర్ దగ్గరికి పరిగెడుతుంటారు. మన పూర్వీకులందించిన ఔషధాల్ని మాత్రం పట్టించుకోరు. అలాంటి ఔషధాల్లో ముఖ్యమైంది వేపనూనె. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.**

- వేపనూనె దంతాల సమస్యల్ని తొలగిస్తుంది. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలతో పిప్పళ్లు, నోటి దుర్వాసన, పంటి నొప్పి సమస్యలు తొలగిపోతాయి. పై సమస్యలకు వేపనూనెను ఉపయోగించి సత్వర పరిష్కారం పొందవచ్చు.
- మలేరియాను నివారించడానికి వేపనూనెను ఉపయోగించవచ్చు. వేపనూనె మలేరియాను వ్యాప్తి చేసే దోమల నుంచి కాపాడుతుంది. వేపనూనెను చర్మంపై రాసుకొని నిద్రిస్తే దోమలు కుట్టవు. అనేక పురుగు మందుల్లో వేపనూనెను వాడుతుంటారు. ఇందులో క్రిమినాశక లక్షణాలు కూడా ఉన్నాయి. ఒక చిన్న గిన్నెలో వేపనూనెను ఉంచితే క్రిమికీటకాలు దరిచేరవు.
- వేపనూనెలో విటమిన్ ఇ, అమైనో ఆమ్లాలు, కొవ్వు ఆమ్లాలు వంటివి కొన్ని పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. తామర, సోరియాసిస్, చర్మ సమస్యలను తొలగించడంలో వేపనూనె ముఖ్యపాత్ర పోషిస్తుంది.
- గోరు చుట్టు నొప్పి సమస్య తొలగించడానికి వేపనూనె పనిచేస్తుంది వాస్తవానికి వేపనూనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీఫంగల్ లక్షణాలున్నాయి. ఇవి గోరు చుట్టు సమస్యను అధిగమించడానికి ఉపయోగపడుతాయి. వేపనూనెను కొద్దిగా వేడి చేసి గోరు చుట్టూ భాగంపై ఉంచాలి.
- పేను సమస్యను పూర్తిగా తొలగించడానికి వేపనూనె పని చేస్తుంది. రాత్రి పడుకునే ముందు జుట్టుకు వేప నూనెను పట్టించాలి. షవర్ క్యాప్‌తో జుట్టును కప్పి ఉంచాలి. మరుసటి రోజు తలస్నానం చేయాలి. ఇలా వారంలో మూడుసార్లు ప్రయత్నించవచ్చు. ఇలా చేస్తే పేను సమస్య పూర్తిగా తగ్గుతుంది.

# వీటికీ కాలపరిమితి ఉంది!

**చాలామంది అందంగా తయారయ్యేందుకు ఇష్టపడుతుంటారు. అందం కోసం కాస్మెటిక్స్ వాడుతున్నారు. కానీ చాలామందికి తెలియని విషయం ఏంటంటే ఒక సారి కొనుగోలు చేసిన వాటిని ఎన్ని రోజులు వాడొచ్చు? మనం రోజూ వాడే కొన్ని ఉత్పత్తులకు కాలపరిమితి ఉంటుందని తెలుసుకోవాలి.**


ఐబ్రో పెన్సిల్‌ను రెండు సంవత్సరాలకు మించి వాడకూడదు. తరచూ వాడే వారికి ఐబ్రో పెన్సిల్ రెండేళ్లు రాకపోవచ్చు. కానీ ఈ ఐబ్రో పెన్సిల్ తీసుకున్న రెండేళ్ల తర్వాత కూడా వాడితే కనుబొమ్మలు చిట్లిపోయే అవకాశం ఉంది.





లిప్‌స్టిక్ వాడకం సాధారణమైపోయింది. ఒక్కొక్కరు పలురకాల లిప్‌స్టిక్స్ వాడుతుంటారు. అయితే దీనివల్ల ఎక్కువ రోజులు లిప్‌స్టిక్‌ను నిల్వ ఉంచుకోవాల్సి వస్తుంది. కానీ ఏడాదికన్నా ఎక్కువ రోజులు లిప్‌స్టిక్‌ను నిల్వ ఉంచుకోకూడదు. ఏడాదికి మించిన లిప్‌స్టిక్ వాడితే పెదాలు నల్లగా మారుతాయి. పొడిబారి పగిలిపోయే సమస్యలు ఎక్కువ.

కనురెప్పలను పొడవుగా అందంగా కనిపించేలా చేసే మస్కారాను కూడా ఎక్కువ కాలం వాడొద్దు. ఒక్కసారి ఓపెన్ చేసిన మస్కారాని మూడు నెల లోపు మాత్రమే వాడాలి. వీటిని వేడిగా ఉన్న ప్రదేశాల్లో అస్సలు పెట్టకూడదు. అవి సహజత్వాన్ని కోల్పోతాయి.





చాలామంది ఎంతో ఇష్టంగా పర్‌ఫ్యూమ్‌ను వాడుతుంటారు. కొందరు దాచుకుని మరీ పండుగలకో, ఫంక్షన్లకో వాడుతుంటారు. కానీ పర్‌ఫ్యూమ్ అనేది రసాయన పదార్థాలతో తయారవుతుంది. దీన్ని సంవత్సరానికి మించి వాడొద్దు. వాడినా అందులోని గాఢత చాలావరకు తగ్గుతుంది.

నమస్తే తెలంగాణ

# జీవనరేఖ

[ కరీంనగర్ ]

మంగళవారం 10 డిసెంబర్ 2019



# వెన్నెముకకు సురక్షితమైన చికిత్స

# ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ

వెన్నుపాముకు సర్జరీ చేయడం అంటే కత్తి మీద సామే. ఒకప్పుడు వెన్నుకు ఆపరేషన్ అంటే భయంతో హడలిపోయే వాళ్లు. కాళ్లూ చేతులు పడిపోతాయేమోననే ఆందోళన ఉండేది. కొంతవరకు అలాంటి రిస్కు కూడా అప్పుడు ఉండేది. కాని ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీలు వెన్నుపాము చికిత్సల్లో విప్లవాత్మకమైన మార్పును తీసుకొచ్చాయి. ఎటువంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా, నరాలు దెబ్బతినకుండా సురక్షితమైన ఆపరేషన్ చేయడానికి మార్గం సుగమం అయింది.



**తెల్లవారు** జామున 4 గంటలకు నిద్ర లేవాలి... త్వరగా తయారై ప్రాక్టీస్‌కి వెళ్లాలి.. కనీసం మూడు నాలుగు గంటల వరకు ప్రాక్టీస్.. నువ్వు ఛాంపియన్ కావాలి.. కనీసం జాతీయ స్థాయిలో అయినా మెడల్స్ సాధించాలి.. మానసికమైన ఈ ఒత్తిడి ఒకవైపు.. సున్నితమైన శరీరంపై కఠినమైన క్రీడల ప్రాక్టీస్ మరొకవైపు.. వెరసి 14 ఏళ్ల ప్రాయంలోనే నడుము నొప్పి వచ్చేస్తుంది.

చాలామంది పిల్లలు ఎదుర్కొంటున్న సమస్య ఇది. ఇంతకు ముందు మధ్య వయసు వాళ్లలో, గర్భిణుల్లో ఎక్కువగా కనిపించే నడుమునొప్పి ఇప్పుడు పిల్లల్లో కూడా కనిపిస్తోంది. సాధారణంగా ఉద్యోగాలు చేసేవాళ్లలో అంటే 25 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు వాళ్లలో నడుము నొప్పి ఎక్కువగా ఉంటుంది. పదేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు నడుంనొప్పి కేసులు రెండు మూడు వంతులు ఎక్కువయ్యాయి. స్కూల్ కి వెళ్లే వయసు పిల్లలు, కాలేజీలకు వెళ్లే టీనేజర్లు, వృద్ధుల్లో కూడా ఈ సమస్య ఎక్కువ అవుతోంది.

### కారణాలేంటి?

నడుమునొప్పితో బాధపడేవాళ్లు పెరగడానికి ప్రధాన కారణం జీవనశైలి మారడమే. జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, సమయానికి తిండి, నిద్ర లేకపోవడం, పెరిగిన పని ఒత్తిడి లాంటి కారణాలు ఒకటైతే.., బరువు తగ్గడానికో, ఫిట్‌నెస్ అనో సడెన్‌గా క్రాష్ కోర్సులు మొదలుపెడుతుంటారు కొందరు. అప్పటి వరకు ఎటువంటి వ్యాయామాలూ చేయకుండా అప్పటికప్పుడు ఏ జుంబాకు వెళ్లడమో, అతిగా జిమ్ చేయడమో చేస్తుంటారు. నెలరోజుల్లోనే బరువు తగ్గించేస్తామన్న క్రాష్ కోర్సులకు ఆకర్షితులై తీవ్రమైన వ్యాయామాలు చేయడం కూడా నడుమునొప్పి సమస్యలు పెరగడానికి కారణమవుతున్నాయి.

### పిల్లల్లో ఎందుకు?

పిల్లలు నేర్చుకునే చదువు కన్నా వారి స్కూల్ బ్యాగుల్లో ఉండే మోత బరువే ఎక్కువ. దాదాపు 25 కిలోల పైన బరువు స్కూల్ బ్యాగుల రూపంలో రోజూ మోస్తున్నారు. దాంతో వాళ్ల వెన్నుపాముపై ఒత్తిడి ఎక్కువగా పడుతున్నది. పసి శరీరంపై అధిక ఒత్తిడి నడుము నొప్పి, వెన్నునొప్పి రూపంలో బాధపెడుతున్నది. వీటికి తోడు తమ పిల్లలను తమ పరువుకు సంకేతాలుగా భావించే తల్లిదండ్రులే ఎక్కువ. ఏదో ఒక విధంగా పిల్లలు అసాధారణ ప్రతిభతో తమకు పేరు తీసుకురావాలని కోరుకుంటున్నారు.



పిల్లలకు ఆటలు, చిన్నపాటి వ్యాయామాలు చేయించడం వారి ఆరోగ్యానికి మంచిదే. కానీ అదే క్రీడలో అప్రతిహతమైన ప్రతిభతో పేరు తెచ్చుకోవాలనుకోవడం అత్యాశ. క్రీడాకారులుగా ఎదిగేవాళ్లలో సహజంగానే వాళ్లకు ఆ స్టామినా ఉంటుంది. కాని సున్నితంగా ఉండే పిల్లల్ని కూడా తీవ్రస్థాయిలో ఆటలు ప్రాక్టీస్ చేయించి, ఛాంపియన్‌గా నిలబెటాలనుకోవడం తప్పు. ఇటీవలి తల్లిదండ్రుల్లో ఎక్కువమంది తమ పిల్లల్ని జిమ్నాస్టిక్స్‌లోనో, టెన్నిస్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ లాంటి క్రీడల్లో ఉంచడమో, తైక్వాండో, కరాటే లాంటివి నేర్పించడమో చేస్తున్నారు. ఒక పరిమితి వరకు పరవాలేదు గానీ.. అందులో ఛాంపియన్లుగా ఎదగాలని బలవంతంగా వాళ్లను ప్రాక్టీస్ చేయించడం కరెక్ట్ కాదు. ఒకవైపు చదువు ఒత్తిడి, మరోవైపు ఈ క్రీడల ప్రాక్టీస్ ఒత్తిడి పిల్లలపై చెడు ప్రభావం చూపే అవకాశం ఉంది. కొంతమంది పిల్లలు హాస్టల్‌లో ఉండి మరీ పొద్దుటి నుంచి, సాయంత్రం దాకా తల్లిదండ్రుల ప్రోద్బలంతో అదే పనిగా ప్రాక్టీస్ చేస్తూనే ఉంటారు. పిల్లలకు ఆసక్తి ఉండి, శరీరకంగా ఫిట్‌గా ఉంటే వాళ్లకా ప్రాక్టీస్ పెద్ద విషయం కాదు. కానీ బలవంతంగా వారిపై రుద్దకూడదు. ఒత్తిడి తీసుకురావొద్దు. దీనివల్ల సుకుమారమైన పిల్లల వెన్ను ఒత్తిడికి లోనవుతోంది. డిస్క్ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

### ఎండోస్కోపిక్ సర్జరీ

ఇది అత్యాధునికమైనది. 8 నుంచి 10 ఏళ్లుగా అందుబాటులోకి వచ్చింది. దీనికి చిన్న గాటు చాలు. 6 నుంచి 8 మి.మీ. గాటు పెట్టి, ఎండోస్కోప్ ద్వారా లోపలున్న సమస్యను తొలగించవచ్చు. డిస్క్ సమస్యలు, ఎముక సమస్యలు, స్టినోసిస్, లిస్థెసిస్ సమస్యలు వేటికైనా ఎండోస్కోపీ ద్వారా సర్జరీ చేయొచ్చు. ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీకి చిన్న



గాటు చాలు కాబట్టి దీనివల్ల రక్తస్రావం ఉండదు. అంతేగాక దీనికి జనరల్ అనెస్తీషియా ఇవ్వాల్సిన అవసరం లేదు. లోకల్ అనెస్తీషియా లేదా ఎపిడ్యూరల్ అనల్జీసియా ఇస్తారు. ఇది పూర్తిగా డే కేర్ ప్రాసిజర్. కాబట్టి సర్జరీ అయిన తరువాత అదేరోజు ఇంటికి వెళ్లిపోవచ్చు. లేదా ఒక్కరోజు ఉంటే సరిపోతుంది.

ఈ సర్జరీ చేసేటప్పుడు నరాలకు దెబ్బతగిలే ప్రమాదం ఉండదు. కండరాలు, ఎముకలు దెబ్బతినే అవకాశం ఉండదు. సర్జరీ తరువాత తొందరగా ఎప్పటిలా పనులు చేసుకోవచ్చు. వెంటనే పనిలో చేరొచ్చు. ఉద్యోగాలు చేసుకునేవాళ్లకు పనిదినాల నష్టం జరుగదు.

### ఎలా చేస్తారు?

ముందుగా ఎక్స్‌రే తీస్తారు. స్క్రీన్ మీద చూస్తూ డిస్క్ సమస్య ఉన్నచోటికి చిన్న నీడిల్‌ని పంపిస్తారు. తరువాత డైలేటర్ అనే ట్యూబులాంటి దాన్ని పంపుతారు. ఆపైన షీత్‌ని పంపిస్తారు. ఈ షీత్‌లోకి స్కోప్‌ను పంపిస్తారు. దీని ద్వారా జారిపోయిన డిస్క్‌ను కట్ చేసి తీసేస్తారు. డీజనరేషన్ సమస్య ఉంటే స్పైన్ ఫిక్సేషన్ చేయాలి. కాని అలా ఫిక్స్ చేసే అవకాశం లేకుండా ఎండోస్కోపీ ద్వారా సమస్యను తొలగించవచ్చు. వృద్ధుల్లో లంబార్ కెనాల్ స్టినోసిస్ ఉన్నప్పుడు స్పైనల్ ఫిక్సేషన్ చేయాల్సి వస్తుంది. సాధారణంగా లంబార్ కెనాల్ స్టినోసిస్‌కు స్క్రూలు, రాడ్స్ వేస్తే కాళ్లు పడిపోతాయనే భయం ఉంటుంది. ఎముకలు, నరాలకు దెబ్బ తగిలి డ్యామేజీ అయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులు లేకుండా ఎండోస్కోపీతో సమస్యకు చికిత్స అందించవచ్చు. కాబట్టి నడుమునొప్పితో బాధపడే వృద్ధులకు ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ వరం లాంటిది.

### కాలేజీ పిల్లలు.. తగ్గిన శారీరక శ్రమ

కాలేజిలో చేరిన తర్వాత పిల్లల చేతికి బైక్ వస్తుంది. లేదా కారు ఉంటుంది. నడక ఉండదు. దాంతో కనీస వ్యాయామం కూడా లేకపోవడం ఎముకలు, కండరాలను బలహీనం చేస్తుంది. ఇటీవలి పిల్లలు ఇండోర్ ఎనిమల్స్ అయిపోతున్నారు. మల్టీమీడియా, మొబైల్ వచ్చాక ఇండోర్ లైఫ్‌కి ఎక్కువ అలవాటు పడుతున్నారు. ఎంతసేపూ మొబైల్ చూస్తూ గడపడమే తప్ప మరో ధ్యాస లేదు. ఫిట్‌నెస్‌పై దృష్టి చాలామంది పిల్లలకు ఉండడం లేదు. దీనికితోడు జంక్ ఎక్కువగా తింటున్నారు. బరువు పెరుగుతున్నారు. ఇది కూడా నడుముపై భారం వేసి, నొప్పికి దారి తీస్తున్నది. సెడెంటరీ లైఫ్ స్టయిల్ ప్రభావం నడుమను బలహీనం చేస్తోంది. ఫిజికల్ యాక్టివిటీ ఉండక నడుము నొప్పి వచ్చే కాలేజీ పిల్లల సంఖ్య పెరుగుతోంది.

### ఉద్యోగినులు

ఉద్యోగాలు చేసేవాళ్లకు ఇటు ఇంటా, అటు బయటా డబుల్ వర్క్ అవుతోంది. ఒకవైపు ఆఫీసులో పని ఒత్తిడి, మరోవైపు ఇంట్లో పనుల హడావుడి. ఒకవైపు వర్క్ స్ట్రెస్ భరిస్తూనే ఇంట్లో పనులు చక్కబెట్టుకోవాలి. ఉదయం లేచి పిల్లల్ని స్కూల్‌కి పంపడం, టిఫిన్లు, లంచ్‌లు రెడీ చేయడం దగ్గరి నుంచి రాత్రి పడుకునే దాకా ఒక యంత్రంలా పనిచేయాలి. ఈ మధ్యలో ఆఫీసుపని ఉండనే ఉంటుంది. ఇంటికి ఎవరైనా గెస్టులు వచ్చారంటే మరింత పని. ఇంటి క్లీనింగ్ దగ్గరి నుంచి భోజనం తయారుచేసేదాకా హడావుడే. అతిథులు వచ్చి, వెళ్లిన తరువాత కూడా ఇల్లంతా సర్దుకోవడం, సరిచేసుకోవడంతో రోజులు గడుస్తాయి. ఇంట్లో ఈ పనులెన్ని ఉన్నా ఉద్యోగ బాధ్యతలను నిర్లక్ష్యం చేయడానికి వీలులేదు. దాంతో రెండు రకాల ఒత్తిడి నడుమ ఉద్యోగినుల నడుము బలహీనం అవుతోంది. నడుమునొప్పి రూపంలో బాధిస్తోంది.





### మధ్య వయసులో..

ఇటీవలి ఉద్యోగాలు ప్రశాంతతను మింగేస్తున్నాయి. ఎటుచూసినా ఉరుకులు పరుగులే. సాఫ్ట్‌వేర్ రంగం వచ్చిన తరువాత కూర్చుని చేసే ఉద్యోగాలు పెరిగాయి. మానసిక ఒత్తిడి, పని ఒత్తిడి ఒకదాంతో ఒకటి పోటీ పడుతూ పెరుగుతున్నాయి. టైం ప్రకారం లేకుండా అదనంగా పనులు చేయడం ఉద్యోగంలో భాగమైంది. వీటికి తోడు క్రమం తప్పిన ఆహారపు అలవాట్లు, జంక్ ఎక్కువగా తీసుకోవడం. దాంతో పనులు చేసే వయసు వాళ్లలో నడుమునొప్పి గతంలో కన్నా ఇప్పుడు రెండు మూడు వంతులు ఎక్కువ అయింది.

నేటి ఉద్యోగాల్లో లేట్ నైట్ వర్క్‌లు, నైట్ షిఫ్టులు సర్వసాధారణం. దాంతో తగినంత నిద్ర ఉండడం లేదు. ఒకరోజు, రెండు రోజులు కాదు.. కొన్ని రోజులుగా నిద్ర లేకపోయేసరికి శరీర సత్తువ సన్నగిల్లుతోంది. నిద్రలో శరీరంలో రిపేర్లు జరుగుతాయి. బాడీ రిలాక్స్ అవుతుంది. తరువాతి రోజు ఉత్సాహంగా పనిచేయడానికి శరీరం రెడీ అవుతుంది. నిద్ర లేకుంటే ఒళ్లు నొప్పులు మొదలవుతాయి. మజిల్ స్పాస్మ్, లిగమెంట్ స్ప్రెయిన్ వల్ల డిస్క్‌పై ఒత్తిడి పెరుగుతుంది. దాంతో నడుము నొప్పి వస్తుంది.

### గృహిణులు

ఉద్యోగాలు చేయని మహిళల్లో కూడా నడుము నొప్పి ఎక్కువగానే ఉంటోంది. ఒకప్పటితో పోలిస్తే వీళ్లకు శారీరక శ్రమ తగ్గింది. ఇంట్లో సౌకర్యాలు పెరిగాయి. వాషింగ్ మెషీన్లు, వాక్యూమ్ క్లీనర్లు వచ్చేశాయి. పనిమనుషులుంటున్నారు. ఇంట్లో పని అయిపోగానే మొబైల్, టీవీలకు అతుక్కుపోతున్నారు. శరీరానికి ఎటువంటి యాక్టివిటీ లేదు. బయటికి వెళ్లే పని లేదు. అన్నీ ఇంట్లోనే. దాంతో శరీరానికి ఫిట్‌నెస్ తగ్గుతోంది. కొంచెం బరువు ఎత్తినా సమస్యే అవుతుంది. వాటర్ క్యాన్ ఎత్తి నీళ్లు పెట్టినా, బకెట్ ఎత్తి నీళ్లు పోసినా, జిమ్‌కి సడెన్‌గా వెళ్లినా వెన్నుపాముపై ఒత్తిడి పడుతోంది. నడుము నొప్పి వస్తోంది.

### గర్భిణుల్లో..

గర్భంతో ఉన్నప్పుడు నడుముపై ఒత్తిడి పడి సహజంగానే నడుము నొప్పి ఉంటుంది. నడుము బలహీనంగా ఉన్నవాళ్లు గర్భిణులైతే నడుమునొప్పి వచ్చే అవకాశం మరింత ఎక్కువ. గర్భంతో ఉన్నప్పుడు ప్రొజెస్టిరాన్ అనే స్త్రీ లైంగిక హార్మోన్ విడుదలవుతుంది. దీనివల్ల లిగమెంట్లు వదులవుతాయి. అంతేగాక



వీళ్లు 13 నుంచి 15 కిలోల బరువు అదనంగా పెరుగుతారు. ఈ బరువంతా నడుముపై పడి ఒత్తిడికి లోనవుతుంది. దాంతో నడుమునొప్పి వచ్చేస్తుంది.

### వృద్ధులు

65 ఏళ్లు పైబడినవాళ్లలో మోకాళ్ల నొప్పులతో పాటు నడుము నొప్పి కూడా ఎక్కువగా కనిపిస్తోంది. సాధారణంగా వయసు పెరుగుతున్న కొద్దీ డిస్క్ డీజనరేట్ అవుతూ ఉంటుంది. ఇప్పుడు లైఫ్ ఎక్స్‌పెక్టెన్సీ పెరిగింది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. మరింత వయసు పెరుగుతుంటే డిస్కులు ఇంకా అరుగుతుంటాయి. దీనికి తోడు వృద్ధుల్లో విటమిన్ డి, కాల్షియం లోపం, ఆడవాళ్లలో అయితే ఆస్టియోపోరోసిస్ రిస్కు ఎక్కువ. దీనివల్ల ఎముకలు పలుచబడిపోతాయి. దాంతో నడుము నొప్పి సంబంధిత సమస్యలు మొదలవుతాయి. వృద్ధాప్యంలో మోకాళ్లనొప్పులు రావడం సహజం. ఇప్పుడు వాటికి నడుమునొప్పి కూడా తోడవుతుంది.

### కారణాలను ఎలా నిర్ధారించాలి?

ఎక్స్‌రే, సిటి స్కాన్ లేదా ఎంఆర్‌ఐల ద్వారా వెన్నుపాములో సమస్య ఏ స్థాయిలో, ఎంత తీవ్రంగా ఉందో తెలుసుకోవచ్చు. ఎముకల అమరిక, ఆర్థరైటిస్ లేదా విరిగిన ఎముకలకు సంబంధించిన అంశాలను ఎక్స్‌రేలో తెలుసుకోవచ్చు. కాని కండరాలు, నరాలు, డిస్కులు ఎంతవరకు డ్యామేజీ అయ్యాయనేది తెలియదు. ఎంఆర్‌ఐ లేదా సిటి స్కాన్ ద్వారా జారిన డిస్కులు, టెండాన్ సమస్యలు, నరాలు, లిగమెంట్లు, రక్తనాళాలు, కండరాలు, ఎముకల గురించి తెలుస్తుంది. బోన్ స్కాన్ ద్వారా ట్యూమర్లు, ఆస్టియోపోరోసిస్ ఫ్రాక్చర్లను కనిపెట్టవచ్చు. ఎలక్ట్రోమయోగ్రఫీ లేదా ఇఎంజి ద్వారా నరాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవచ్చు.

### చికిత్స ఏమిటి?

వెన్నుపాము సమస్యలకు మూడు దశల్లో చికిత్స ఇస్తారు. మొదట మెడికల్ మేనేజ్‌మెంట్. అంటే ఓటిసి పెయిన్ కిల్లర్లు, వాటి వల్ల తగ్గకుంటే ఎన్ఎస్ఎఐడి మందులు ఇస్తారు. మజిల్ రిలాక్సెంట్స్ కూడా ఇస్తారు. కొన్నిసార్లు యాంటి డిప్రెసెంట్లు కూడా ఇస్తారు.

**ఫిజికల్ థెరపీ** – వేడి, ఐస్, అల్ట్రాసౌండ్, ఎలక్ట్రికల్ స్టిమ్యులేషన్ లాంటి వాటి ద్వారా నొప్పి తగ్గించే ప్రయత్నం చేస్తారు. ఫిజియోథెరపిస్టు సూచనల మేరకు నడుము, పొట్ట కండరాలకు ఫ్లెక్సిబిలిటీ, స్ట్రెంత్ ఎక్సర్‌సైజ్‌లు చేయాల్సి ఉంటుంది. మెరుగైన పోశ్చర్లను కూడా సూచిస్తారు. ఫిజియోథెరపీ వ్యాయామాలను నొప్పి తగ్గిన తరువాత కూడా ఫిజియోథెరపిస్టు చెప్పినన్ని రోజులు చేస్తే మళ్లీ నడుము నొప్పి రాకుండా నివారించవచ్చు.


**కార్టిసాన్ ఇంజెక్షన్స్** – మందులు, ఫిజియోథెరపీ వల్ల ఫలితం లేకపోతే స్పైనల్ కార్డ్ చుట్టూ ఉన్న ఎపిడ్యూరల్ స్పేస్‌లోకి ఈ ఇంజెక్షన్లను ఇస్తారు. ఇది యాంటి ఇన్‌ఫ్లమేటరీ మందు. కాబట్టి నరాల మూలాల చుట్టూ ఉన్న ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది.

**సర్జరీ** – పేషెంట్‌కి అన్ని విధాలుగా అంటే మెడికల్ మేనేజ్‌మెంట్, ఫిజియోథెరపీ వల్ల కూడా ఫలితం లేకున్నా, లేక ఎమర్జెన్సీ సమస్య వచ్చినా అంటే కాళ్లు బలహీనం కావడం, కాళ్లు పడిపోవడం లాంటి సమస్యలుంటే సర్జరీ చేయాలని నిర్ధారిస్తారు.

### నివారణ ఎలా?

- పిల్లలకు బరువైన స్కూల్ బ్యాగ్స్ లేకుండా చూసుకోవాలి.
- చాలా తీవ్రమైన క్రీడల కోసం పిల్లలపై ఒత్తిడి తేవొద్దు.
- అలాగని ఆటలు మానొద్దు. సాధారణ ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి.
- కాల్షియం, ప్రొటీన్ తగినంత ఉండే ఆహారం పెట్టాలి.
- టీనేజ్‌లో ఉన్న పిల్లలు శారీరకంగా యాక్టివ్‌గా ఉండేలా ప్రోత్సహించాలి. మొబైల్స్‌కి అతుక్కుపోకుండా ఫిట్‌నెస్‌పై అవగాహన పెంచాలి.
- మధ్యవయసు పెద్దవాళ్లు పద్ధతిగా కూర్చోవడం, లేవడం, వంగడం చేయాలి. పని మధ్యలో బ్రేక్ తీసుకోవడం అలవాటు చేసుకోవాలి.
- బ్యాక్ స్ట్రెంతనింగ్ ఎక్సర్‌సైజులు చేయాలి. తీవ్రమైన శారీరక శ్రమ వద్దు
- ఉద్యోగంలో పనివేళలు, తీసుకునే ఆహారం ఆరోగ్యకరంగా ఉండేలా ప్రయత్నించాలి.
- ఒత్తిడి తగ్గించుకునే ప్రయత్నాలు మొదలుపెట్టాలి.
- గృహిణులు వంగి పనిచేయడం వీలైనంతవరకు అవాయిడ్ చేయాలి. సడెన్‌గా బరువులు ఎత్తకూడదు. క్రమం తప్పకుండా నడుముకు బలం ఇచ్చే వ్యాయామాలు చేస్తే ఇబ్బంది ఉండదు.
- పెద్ద వయసు మహిళల్లో ఆస్టియోపోరోసిస్ రాకుండా నివారించాలి.
- సింపుల్ ఎక్సర్‌సైజులు క్రమం తప్పకుండా చేయాలి.
- తరచుగా కిందపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కాల్షియం సప్లిమెంట్లు వాడాలి.







**డాక్టర్ సుకుమార్ సూర**
సీనియర్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్
యశోద హాస్పిటల్స్, హైదరాబాద్
8121022333

## నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

**ఉత్తరప్రదేశ్ మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (యూపీఎం ఆర్సీఎల్) వివిధ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

### ఐసీహెచ్‌ఆర్‌లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్

**న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసెర్చ్ (ఐసీహెచ్ఆర్) 2020-21 విద్యాసంవత్సరానికి గాను ఎస్‌ఏఎఫ్, పీడీఎఫ్ ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- **మొత్తం సీట్లు:** 20 (సీనియర్ అకడమిక్ ఫెలోషిప్ -10, పోస్టుగ్రాడ్యుయేట్ ఫెలోషిప్ -10)
- **అర్హతలు:** ఎస్‌ఏఎఫ్‌కు కనీసం 10 ఏండ్లు బోధనానుభవం లేదా రిసెర్చ్ చేసిన అనుభవంతోపాటు 45 ఏండ్లు నిండి ఉండాలి. పీడీఎఫ్‌కు సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ పూర్తిచేసి ఉండాలి.
- **ఫెలోషిప్:** ఎస్‌ఏఎఫ్‌కు నెలకు రూ.44వేలు, పీడీఎఫ్‌కు నెలకు రూ.30800/-
- **ఎపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఈ-మెయిల్ ద్వారా
- **చివరితేదీ:** డిసెంబర్ 27
- **వెబ్‌సైట్:** www.ichr.ac.in

### యూపీఎంఆర్సీఎల్‌లో 183 ఉద్యోగాలు



- **మొత్తం పోస్టులు:** 183
- **పోస్టులవారీగా ఖాళీలు:**
- **ఎగ్జిక్యూటివ్:** అసిస్టెంట్ మేనేజర్ (సివిల్)-28, అసిస్టెంట్ మేనేజర్ (ఎలక్ట్రికల్)-18, అసిస్టెంట్ మేనేజర్ (ఎస్ అండ్ టీ)-8, అసిస్టెంట్ మేనేజర్ (అకౌంట్స్)-6, అసిస్టెంట్ మేనేజర్ (హెచ్‌ఆర్)-2, అసిస్టెంట్ మేనేజర్ (పబ్లిక్ రిలేషన్స్)-2
- **నాన్ ఎగ్జిక్యూటివ్:** జూనియర్ ఇంజినీర్ (సివిల్)-58, జూనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్)-40, జూనియర్ ఇంజినీర్ (ఎస్ అండ్ టీ)-17, పబ్లిక్ రిలేషన్స్ అసిస్టెంట్-4
- **అర్హతలు:** ఒక్కో పోస్టుకు ఒక్కో విధంగా ఉన్నాయి. 21 నుంచి 28 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 23
- రాతపరీక్ష: 2020, జనవరి 13
- **వెబ్‌సైట్:** www.upmetrorail.com

### సీఎస్ఐఆర్-నీస్ట్‌లో

**సీఎస్ఐఆర్- నార్త్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (నీస్ట్) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **పోస్టు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
- **మొత్తం ఖాళీలు:** 5
- **విభాగాలు:** జనరల్, స్టోర్, ఫైనాన్స్&అకౌంట్స్
- **అర్హతలు:** పోస్టుని బట్టి ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత, కంప్యూటర్ స్కిల్స్.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, టైపింగ్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 6
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** 2020, జనవరి 16
- **వెబ్‌సైట్:** http://www.neist.res.in

### సీయూఎస్‌బీలో ప్రొఫెసర్ పోస్టులు

**సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ బీహార్ (సీయూఎస్‌బీ)లో వివిధ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న కింది ఫ్యాకల్టీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది.**

- **మొత్తం పోస్టులు:** 60
- **ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్**
- **విభాగాలు:** ఆర్ట్స్, కామర్స్, ఎడ్యుకేషన్, లా, సోషల్ సైన్సెస్, లాంగ్వేజెస్, ఎంసీజే, ఫార్మసీ, ఎడ్యుకేషన్ (పెడగాగీ ఆఫ్ మ్యాథ్స్, సైన్సెస్, పర్‌స్పెక్టివ్ ఆఫ్ ఎడ్యుకేషన్), ఫిజికల్ ఎడ్యుకేషన్, విజువల్ ఆర్ట్స్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీతోపాటు అనుభవం
- **ఎంపిక:** రాతపరీక్ష / ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ /స్పీడ్ పోస్ట్
- **చివరితేదీ:** డిసెంబర్ 18
- **వెబ్‌సైట్:** https://www.cusb.ac.in

# సింగరేణిలో పర్యావరణ పద్ధతులు భేష్

అమెరికన్ రీజినల్ ఎన్విరాన్‌మెంట్ అధికారుల బృందం ప్రశంస

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణి సంస్థ అమలుచేస్తున్న పర్యావరణ పద్ధతులు బాగున్నాయని అమెరికన్ రీజినల్ ఎన్విరాన్‌మెంట్ అధికారుల బృందం ప్రశంసించింది. సోమవారం సింగరేణిభవన్‌లో దక్షిణాసియా దేశాల రీజినల్ ఎన్విరాన్‌మెంట్, సైన్స్, టెక్నాలజీ అండ్ హెల్త్ విభాగం అధికారి సారా లిట్కే నేతృత్వంలోని అమెరికా బృందం సింగరేణి సీఎండీ శ్రీధర్‌తో సమావేశమై సింగరేణిలో అమలు చేస్తున్న పర్యావరణహిత మైనింగ్ పద్ధతులపై చర్చించింది. బొగ్గుఉత్పత్తిలో అనుసరిస్తున్న పద్ధతులు, మొక్కలపెంపకం తదితర అంశాల గురించి సీఎండీ బృందానికి వివరించారు. ఓపెన్ కాస్ట్ మైనింగ్ విధానంలో రిక్లేమేషన్ (మైనింగ్ తర్వాత యథాపూర్వస్థితికి తీసుకువచ్చే పద్ధతి) ఓబీ డంపులపై పెంచుతున్న కృత్రిమ వనాలు, హరితహారంలో భాగంగా నాటుతున్న మొక్కల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో సారా లిట్కేతోపాటు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్‌కు చెందిన అన్నె డీ సిల్వా, సింగరేణి జీఎం ఆంటోనిరాజా పాల్గొన్నారు.

# గిరిజన వైభవం చాటేలా మేడారం జాతర

- ప్రత్యేక కార్యాచరణ చేపట్టిన ప్రభుత్వం
- పదిమంది దేవతలతో ఊరేగింపు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 2020 ఫిబ్రవరిలో నిర్వహించనున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా గిరిజనుల సాంస్కృతిక వైభవాన్ని మరోసారి దేశవ్యాప్తంగా చాటిచెప్పేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. మేడారం జాతరలో ఈసారి గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఆ ప్రాంతంలోని 3, 4, 5, 6, 7 గట్టుల వేల్పుల సమ్మేళనం నిర్వహించనున్నారు. మేడారం జాతరలో మొదటిసారి పదిమంది దేవతలతో ఊరేగింపు, సంబురాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో కోయ చిత్రలేఖనాలు (పెయింటింగ్స్) ప్రదర్శించి, వాటిని విక్రయించనున్నారు. నాయక్‌పోడ్ మాస్కులు కూడా అందుబాటులో ఉంచనున్నారు. మేడారం జాతరలో వారంరోజులపాటు ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు గిరిజన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అక్కడి ఆంఫి థియేటర్‌లో ప్రదర్శిస్తారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ముఖ్య అతిథులకు కోయ పెయింటింగ్‌లు, నాయక్ పోడ్ మాస్కులు, మేడారం చరిత్ర, సావనీర్ పుస్తకాలను బహుకరించనున్నారు. మేడారం ప్రాంగణంలోని మ్యూజియం ఆధునీకరణ, అలంకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో సమ్మక్క, సారలమ్మ కాలంనాటి పరిస్థితులు, సంస్కృతి, సామాజిక, ఆర్థికస్థితి తదితర అంశాలు ప్రతిబింబించేలా 15 కోయ గ్రామాల్లో సేకరించిన కళాకృతులను ఏర్పాటు చేశారు. సమ్మక్క, సారలమ్మ చరిత్ర సులభంగా అర్థమయ్యేలా శిల్ప రూప ప్రదర్శనలున్నాయి. మేడారం జాతరను పురస్కరించుకొని ఈ మ్యూజియంను మరింత ఆధునీకరించి సందర్శకులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని నిర్ణయించారు.



# స్నేహబంధమూ ఎంత మధురమూ..

- ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి స్నేహితుడిని కలిసిన రాష్ట్రపతి
- మాజీ ఎంపీ వీరభద్రసింగ్‌కు కోవింద్ ఆత్మీయ పలకరింపు
- ఉత్కళ్ విశ్వవిద్యాలయం సమావేశంలో అరుదైన సన్నివేశం




స్నేహితుడు వీరభద్రసింగ్‌తో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

**భువనేశ్వర్, డిసెంబర్ 9:** ఎంత ఎత్తుకు ఎదిగినా స్నేహితులను మరువరాదని చాటిచెప్పారు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్. ఒడిశాలోని ఉత్కల్ విశ్వవిద్యాలయం ప్లాటినం జూబ్లీ ఉత్సవాల ముగింపు సమావేశం సందర్భంగా ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి మరీ తన స్నేహితుడిని కలుసుకొన్నారు. రామ్‌నాథ్ కోవింద్ అంతగా ప్రాధాన్యం ఇచ్చిన వ్యక్తి మరెవరో కాదు.. రాజ్యసభ మాజీ సభ్యుడు వీరభద్రసింగ్. ఉత్కళ్ విశ్వవిద్యాలయం ఉత్సవాలకు హాజరై ప్రేక్షకుల సీట్లో కూర్చున్న తెల్లటి తలపాగతో ఉన్న వ్యక్తిని చూడగానే ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్రపతి ఆనందంతో పొంగిపోయారు. సమావేశం పూర్తవుతుండగా తలపాగాతో ఉన్న వ్యక్తిని స్టేజీపైకి తీసుకురమ్మని పక్కనున్న కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కోరారు. వీరభద్రసింగ్ స్టేజీపైకి రాగానే కోవింద్ ఆయనను ఆప్యాయంగా పలుకరించారు. ఆయన ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు ఇద్దరూ జ్ఞాపకాలు నెమరేసుకొన్నారు. స్నేహితుడితో కలిసి రాష్ట్రపతి ఫొటోలు దిగారు.

**ఆశ్చర్యపోయా: వీరభద్రసింగ్**

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తనను స్టేజీపైకి రమ్మంటూ సంజ్ఞలు చేస్తూ కేంద్ర మంత్రిని పంపడం చూసి ఆశ్చర్యానికి గురయ్యానని వీరభద్రసింగ్ చెప్పారు. 12 ఏండ్ల తర్వాత కోవింద్‌ను కలిశానని, 2000 నుంచి 2006 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఆయనతో కలిసి పనిచేసే అద్భుత అవకాశం తనకు లభించిందన్నారు. పార్లమెంట్ ఎస్సీ, ఎస్టీ కమిటీలో సభ్యులుగా రెండేండ్లపాటు ఇద్దరం కలిసి పనిచేశామని గుర్తుచేసుకొన్నారు. వీలుచూసుకొని ఒకసారి రాష్ట్రపతి భవన్‌కు రావాల్సిందిగా కోవింద్ తనను ఆహ్వానించారని చెప్పారు. ఒడిశా రాష్ట్ర మంత్రిగా కూడా పనిచేసిన వీరభద్రసింగ్.. ఉత్కళ్ విశ్వవిద్యాలయంలో 1965–67 మధ్య విద్యాభ్యాసం చేశారు.

# గుడ్డిలో మెల్ల



## మానవాభివృద్ధిలో ఒకస్థానం పైకి ఎగబాకిన భారత్

- 182 దేశాల్లో మనది 129వ స్థానం
- 2005-15లో 27 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి
- పెరిగిన సగటు ఆయుర్దాయం
- యూఎన్‌డీపీ నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:**

మానవాభివృద్ధి సూచి (హెచ్‌డీఐ)లో భారత్ ఇంకా అధమ స్థానంలోనే కొనసాగుతున్నది. దశాబ్ద కాలంలో 27 కోట్లమందికి పైగా ప్రజలు దేశంలో పేదరికం నుంచి బయటపడినట్టు పేర్కొంటున్నప్పటికీ మానవాభివృద్ధిలో మాత్రం మన దేశం ఇంకా 128 దేశాలకన్నా కిందనే ఉన్నది. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఒక స్థానాన్ని మెరుగుపరచుకుంది. మొత్తం 189 దేశాలకుగాను.. గత ఏడాది 130వ స్థానంలో ఉన్న భారత్ ఈసారి 129వ స్థానానికి చేరింది. 'ఆదాయం, సగటులు, వర్తమానం.. అన్నింటినీ దాటుకొని 21వ శతాబ్దంలోనూ మానవాభివృద్ధిలో అసమానతలు' పేరిట ఐక్యరాజ్య సమితి అభివృద్ధి పథకం (యూఎన్‌డీపీ) నివేదిక–2019ని సోమవారం ఢిల్లీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా యూఎన్‌డీపీ భారత ప్రతినిధి షోకో నోడా మాట్లాడుతూ, భారత్‌లో 2005–06 నుంచి 2015–16 మధ్య కాలంలో 27.1 కోట్ల మంది పేదరికం నుంచి బయటకొచ్చారని తెలిపారు. భారత్‌లో పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి కీలక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. గత మూడు దశాబ్దాల నుంచి వేగంగా జరుగుతున్న అభివృద్ధి కారణంగానే దేశంలో స్థిరమైన పురోగతి కనిపిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కాలంలోనే పేదరికం తగ్గుముఖం పట్టిందని, ఆయుర్దాయం పెరిగిందని, విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. మానవాభివృద్ధి సూచి ప్రకారం..ప్రపంచంలోని ఏ ఇతర ప్రాంతం కూడా ఇంత వేగవంతమైన పురోగతిని నమోదు చేయలేదని తెలిపారు. మరోవైపు అనేక దేశాలలో పేదరికం వివిధ రూపాల్లో మరింత దుర్భరంగా ఉందని నోడా పేర్కొన్నారు. భారత్‌లో ఓవైపు పురోగతి కనిపిస్తున్నప్పటికీ మరోవైపు వర్గ ఆధారిత అసమానతలు కొనసాగుతున్నాయని, ఆ ప్రభావం మహిళలు, బాలికలపై పడుతున్నదని తెలిపారు. పేదరికం, ఆకలి, వ్యాధులు తగ్గుతున్నప్పటికీ కొత్త తరం అసమానతలు ముందుకొస్తున్నట్టు ఆ నివేదిక పేర్కొంది. సాంకేతికత, విద్య, పర్యావరణ సంక్షోభం ఈ అసమానతలకు కారణమవుతున్నాయని తెలిపింది. 2030 నాటికి స్థిరమైన అభివృద్ధిని సాధించాలన్న లక్ష్యానికి ఇవి అవరోధంగా మారే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది.

### హెచ్‌డీఐ-2019లోని మరిన్ని ముఖ్యాంశాలు..

- మానవాభివృద్ధిలో దక్షిణాసియా మొదటిస్థానంలో, తూర్పు ఆసియా రెండోస్థానంలో, పసిఫిక్ మూడో స్థానంలో ఉన్నాయి.
- భారత్ పరిస్థితి హెచ్‌డీఐ విలువ క్రితం ఏడాది కంటే 50 శాతం (0.431 నుంచి 0.647కు) పెరిగింది.
- భారత్‌తోపాటు ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ కూడా మానవాభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి.
- భారత్‌వంటి దేశాల్లో వాస్తవ పేదరికం తగ్గినప్పటికీ అసమానతలు, మౌలిక సదుపాయాల కొరత కొనసాగుతున్నాయి.
- స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు మౌలిక సదుపాయాలైన గృహ వసతి, నాణ్యమైన యూనివర్సిటీ విద్య వంటివి కీలకం.
- దక్షిణాసియాలో ఆయుర్దాయం, పాఠశాలలో విద్యార్థులు చదువుకొనే సగటు విద్యా సంవత్సరాలు పెరిగాయి.
- భారత్‌లో 1990 నుంచి 2018 మధ్య సగటు ఆయుర్దాయం 11.6 ఏండ్లు పెరిగింది.
- అదేకాలంలో పాఠశాలలో చదువుకొనే విద్యార్థుల సగటు విద్యా సంవత్సరాలు 3.5 ఏండ్లు పెరిగాయి.
- 250 శాతం పెరిగిన తలసరి ఆదాయం.
- ప్రపంచంలోని 101 దేశాలలో మొత్తం 130 కోట్లమంది పేదలు ఉండగా, వారిలో 66.1 కోట్ల మంది (41శాతం) ఆసియా, పసిఫిక్ ప్రాంతంలోనే ఉన్నారు.
- జీవిత భాగస్వామి చేతిలో హింసను ఎదుర్కొనే మహిళలు దక్షిణాసియాలో 31 శాతం ఉండగా, సింగపూర్‌లో వారి సంఖ్య అత్యంత తక్కువగా ఉన్నది.
- లింగ అభివృద్ధి సూచిలో 162 దేశాలలో భారత్ 122వ స్థానంలో ఉన్నది.

# 3డీ లేజర్ టెక్నాలజీతో 'అనాజ్‌మండీ'పై దర్యాప్తు

- భవన యజమాని, మేనేజర్‌లకు 14 రోజుల పోలీస్ కస్టడీ
- ఆధారాలు సేకరించిన ఫోరెన్సిక్ ల్యాబ్ అధికారులు
- ఢిల్లీ క్రైం బ్రాంచ్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు
- సోమవారం అదే భవనంలో మళ్లీ మంటలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** ఉత్తర ఢిల్లీలోని అనాజ్ మండీ ప్రాంతంలో నాలుగంతస్తుల భవనంలో సంభవించిన అగ్ని ప్రమాదంపై ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం తీరు తెన్నులను తెలుసుకోవడం (రీ కన్‌స్ట్రక్షన్) కోసం '3డీ' లేజర్ టెక్నాలజీని ఉపయోగించి సోమవారం ఆధారాలను సేకరించారు. ఢిల్లీ పోలీసులు ఒక కేసు దర్యాప్తులో '3డీ' లేజర్ టెక్నాలజీని ఉపయోగించడం ఇది రెండోసారి. ఈ ఏడాది ఫిబ్రవరిలో కరోల్‌బాగ్ ప్రాంతంలోని హోటల్ అర్పిత్ ప్యాలెస్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాద ఘటన దర్యాప్తులో తొలిసారి ఢిల్లీ పోలీసులు '3డీ' లేజర్ టెక్నాలజీని వినియోగించారు. ఆదివారం జరిగిన ప్రమాదంలో 43 మంది కార్మికులు మృత్యువాత పడగా, 16 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో సహాయ సిబ్బంది 63 మందిని కాపాడారు. ఫోరెన్సిక్ ల్యాబ్ (ఎఫ్‌ఎస్‌ఎల్) అధికారుల బృందం ఆ భవనాన్ని సందర్శించి ఆధారాలను సేకరించింది. మరోవైపు ఈ కేసులో భవనం యజమాని రెహాన్‌ను, భవనం మేనేజర్ ఫుర్కాన్‌ను ఢిల్లీ పోలీసులు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ మనోజ్‌కుమార్ ముందు సోమవారం హాజరు పరిచారు. నిందితులను విచారించేందుకు 14 రోజులు తమ కస్టడీకి అప్పగించాలన్న పోలీసుల అభ్యర్థనను మేజిస్ట్రేట్ మనోజ్‌కుమార్ ఆమోదించారు. నిందితులపై పోలీసులు ఐపీసీలోని 304, 285 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తదుపరి ఈ కేసు దర్యాప్తును క్రైం బ్రాంచ్‌కు అప్పగించారు. ఆదివారం అగ్ని ప్రమాదం జరిగిన నాలుగంతస్తుల భవనంలోనే మరోసారి మంటలు ఎగసిపడ్డాయి. సోమవారం ఉదయం 7.50 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించినట్లు సమాచారం అందుకున్న అగ్ని మాపక దళ సిబ్బంది నాలుగు ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని 20 నిమిషాల్లో మంటలను ఆర్పివేశారు. భవనం లోపల కొంత సామగ్రి నిల్వ ఉండటం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చునని భావిస్తున్నారు.



న్యూజిలాండ్‌లోని వైట్ ద్వీపంలో అగ్ని పర్వతం పేలిన దృశ్యం

# పేలిన అగ్ని పర్వతం

- ఐదుగురు మృతి, 18 మందికి గాయాలు
- పదుల సంఖ్యలో చిక్కుకున్న పర్యాటకులు
- న్యూజిలాండ్‌లోని వైట్ ద్వీపంలో ఘటన

**వెల్లింగ్టన్, డిసెంబర్ 9:** న్యూజిలాండ్‌లోని వైట్ ద్వీపంలో అగ్ని పర్వతం పేలింది. సోమవారం మధ్యాహ్నం 2.11 గంటలకు ఈ ఘటన జరుగగా ఆ సమయంలో అక్కడున్న పర్యాటకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్ని పర్వతం నుంచి దట్టమైన తెల్లటి ధూళి సుమారు 3.6 కిలోమీటర్ల ఎత్తున ఆకాశంలోకి ఎగసిపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అగ్ని పర్వతం నుంచి వచ్చిన ధూళి, రాళ్లు పడిన ఘటనల్లో ఐదుగురు మృతి చెందగా, 18 మంది గాయపడినట్లు డిప్యూటీ కమిషనర్ జాన్ టైమ్స్ తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే సహాయక బృందాలు హెలికాప్టర్లలో అక్కడికి వెళ్లాయని, 23 మందిని ఆ ద్వీపం నుంచి బయటకు తీసుకువచ్చాయని చెప్పారు. వీరిలో ఐదుగురు మృతులతోపాటు 18 మంది గాయపడిన వారు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు పదుల సంఖ్యలో పర్యాటకులు ఆ ద్వీపంలో చిక్కుకున్నారని, వారిని రక్షించేందుకు అక్కడి పరిస్థితులు అనుకూలంగా లేవన్నారు. ఆ దేశ ప్రధాని జెసిండా అర్డెర్న్ కూడా ధ్రువీకరించారు. గల్లంతైన వారిలో పలు దేశాలకు చెందిన పర్యాటకులున్నట్లు ఆమె చెప్పారు. న్యూజిలాండ్ ప్రధాన ద్వీపానికి 50 కి.మీ దూరంలో ఉన్న వైట్ ద్వీపంలోని ఈ అగ్ని పర్వతాన్ని ప్రతి ఏటా సుమారు పది వేల మందికిపైగా పర్యాటకులు సందర్శిస్తుంటారు. అగ్ని పర్వతం పరిస్థితిపై భౌగోళిక శాస్త్రవేత్తలు అందించే సమాచారం మేరకు న్యూజిలాండ్ నుంచి క్రూయిజ్ నౌకలను నడుపుతుంటారు. మరోవైపు అగ్ని పర్వతం ఓ మోస్తరుగా పేలే అవకాశమున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరించినా వినకుండా ప్రయాణికుల నౌకలు ఈ ద్వీపానికి వెళ్లాయని తెలుస్తున్నది. అగ్ని పర్వతం పేలిన సమయంలో ఈ ద్వీపంలో సుమారు 50 నుంచి వంద మంది వరకు పర్యాటకులు ఉంటారని అనుమానిస్తున్నారు.

# ఇంటివద్దే సర్వేనంబర్లు సరిచేస్తాం

- రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు
- వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం
- బెల్లంపల్లి సబ్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- సర్వేనంబర్ల మాయంపై విచారణ
- ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసిన కలెక్టర్
- ధర్మగంట కథనంతో కదిలిన యంత్రాంగం



రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన బెల్లంపల్లి సబ్ కలెక్టర్ రాహుల్‌రాజ్



రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

ధర్మగంట నమస్తే ఎఫెక్ట్ DHARMA GANTA

**నెన్నెల:** 'రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు.. రెవెన్యూ సిబ్బంది రైతుల ఇండ్ల వద్దకే వచ్చి పహాణీలో సర్వేనంబర్లు సరిచేస్తారు' అని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. 'మూడువేల సర్వేనంబర్లు మాయం' శీర్షికతో సోమవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంతో మంచిర్యాల రెవెన్యూ యంత్రాంగం కదిలింది. గల్లంతయిన సర్వేనంబర్లను వెంటనే సరిచేయాలంటూ మంచిర్యాల జిల్లా కలెక్టర్ ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దింపారు. బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ రాహుల్‌రాజ్ నేతృత్వంలోని బృందం సోమవారం నెన్నెల తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బందితో నాలుగు గంటలపాటు చర్చించారు. కార్యాలయంలోని రికార్డులు, ఆన్‌లైన్‌లో ఉన్న సర్వేనంబర్ల వివరాలను తనిఖీ చేశారు. ఇన్ని సర్వేనంబర్లు ఎలా గల్లంతయ్యాయంటూ సిబ్బందిని ప్రశ్నించారు. గతంలో భూరికార్డుల ప్రక్షాళనలో సరిచేసిన వాటిని కూడా ఇందులో చేర్చడంపై అసహనం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ ఆన్‌లైన్ పహాణీలో నమోదు కానీ సర్వే నంబర్లను వెంటనే సరిచేస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇతర మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బందితోపాటు స్థానిక వీఆర్వోలు, వీఆర్‌ఏలు గ్రామంలో తిరిగి సర్వేచేస్తారని చెప్పారు. తమ దగ్గర ఉన్న ఓవర్‌ల్యాప్ రికార్డు ప్రకారం రైతుల ఇంటికెళ్లి వారివద్ద ఉన్న కొత్త పాస్‌పుస్తకాలు, ఇతర పహాణీలు, వన్‌బీలు పరిశీలించి అక్కడే ఫొటోతీసి తమ సర్వర్‌లో అప్‌లోడ్ చేస్తారని పేర్కొన్నారు. సర్వే అనంతరం వాటిని డిజిటల్ సైన్‌చేసి ఆన్‌లైన్‌లో వచ్చేలా చూస్తామని చెప్పారు. సర్వేనంబర్లలో కొన్ని వివాదాస్పదంగా ఉన్నాయని, మరి కొన్ని కోర్టు కేసుల్లో ఉన్నాయని చెప్పారు. ఇందులో కొత్త పాస్‌పుస్తకాలు ఉన్న రైతులకు చెందిన వాటిలో ఎలాంటి పొరపాట్లు ఉన్నాయో తెలుసుకుంటామని తెలిపారు. నాన్ అగ్రికల్చర్ సర్వేనంబర్లు, అగ్రికల్చర్ సర్వేనంబర్లకు ఒకే ఖాతా ఉండడం వల్ల కూడా ఇబ్బందులు తలెత్తాయని, కేవలం పాస్‌పుస్తకాల్లో అగ్రికల్చర్ ల్యాండ్ సర్వేనంబర్లనే నమోదు చేశారన్నారు. నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ నంబర్లను పక్కకు పెట్టి అగ్రికల్చర్ నంబర్లను డిజిటలైజేషన్ చేయాల్సి ఉండగా సిబ్బంది నిర్లక్ష్యం వలన రైతుకు చెందిన ఖాతానంబర్‌ను నాన్‌డీఎస్‌లో వెళ్లిందని తెలిపారు. రైతుబంధు, రైతు బీమాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వ్యవసాయ అధికారులతో మాట్లాడినట్టు రాహుల్‌రాజ్ చెప్పారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎవరూ కార్యాలయాలకు రావాల్సిన అవసరంలేదన్నారు. సర్వేనంబర్ల మిస్సింగ్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరించినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## యూపీలో 218 ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు

**లక్నో, డిసెంబర్ 9:** లైంగిక దాడుల కేసులపై, బాలలకు వ్యతిరేకంగా జరిగే నేరాలపై త్వరితగతిన విచారణ జరిపేందుకు కొత్తగా 218 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలో సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వీటిలో 144 కోర్టులు లైంగికదాడుల కేసులను, 74 కోర్టులు.. పోక్సో చట్టం కింద నమోదైన కేసులను విచారిస్తాయని యూపీ న్యాయశాఖ మంత్రి బ్రజేశ్ పాఠక్ మీడియాతో అన్నారు. ప్రస్తుతం 81 ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఉన్నాయని, అవి మహిళల కేసులనే విచారిస్తున్నాయని చెప్పారు. ఇకపై లైంగికదాడి కేసులను కొత్త ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీచేస్తారని తెలిపారు. ఈ కోర్టుల కోసం 218 అదనపు సెషన్స్ జడ్జిలను, సిబ్బందిని నియమిస్తామన్నారు. కోర్టుల నిర్వహణలో 60 శాతం వ్యయం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయని బ్రజేశ్ పాఠక్ తెలిపారు. ఒక్కో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు నిర్వహణకు ఏటా రూ.75 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. ప్రస్తుతం యూపీలో బాలలకు వ్యతిరేకంగా జరిగిన నేరాలలో 42 వేలకు పైగా కేసులు, మహిళలపై లైంగిక దాడులు, వేధింపుల కేసులు 25 వేలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి.క్యాబినెట్ సమావేశంలో సీఎం యోగి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై నేరాలు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తంచేశారని బ్రజేశ్ చెప్పారు.

# ఎన్బీఎఫ్ అధ్యక్షుడిగా అర్ణబ్ గోస్వామి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** దేశంలో అతిపెద్ద న్యూస్ చానల్స్ అసోసియేషన్ అయిన న్యూస్ బ్రాడ్ కాస్టర్స్ ఫెడరేషన్ (ఎన్బీఎఫ్) అధ్యక్షుడిగా రిపబ్లిక్ టీవీ చానల్ చీఫ్ ఎడిటర్ అర్ణబ్ గోస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో నలుగురిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. చానళ్లలో ప్రసారంచేసే కార్యక్రమాల విషయంలో స్వీయ నియంత్రణకు సంబంధించిన విధివిధానాలు ఖరారుచేసేందుకు శనివారం సమావేశమైన అసోసియేషన్ గవర్నింగ్‌బాడీని ఎన్నుకున్నది. ఎన్బీఎఫ్‌లో 25 రాష్ట్రాల్లోని 14 భాషలకు చెందిన 78 న్యూస్ చానల్స్ ఉన్నాయి. 2020 చివరినాటికి ఈ స్వీయ నియంత్రణ సంస్థను అధికారికంగా ప్రకటించనున్నారు. ఎంతో నమ్మకంతో తనను ఎన్నుకున్నందుకు సభ్యులకు అర్ణబ్ గోస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఎన్నికైనవారిలో జేఎం పాండా (ఆర్టెల్ కమ్యూనికేషన్స్), శంకర్ బాలా (ఫోర్త్ డైమెన్షన్ మీడియా), సంజీవ్ నారియన్ (ప్రాగా న్యూస్), కార్తికేయ శర్మ (ఐటీవీ నెట్‌వర్క్) ఉన్నారు. వీరితోపాటు మాజీ పాత్రికేయుడు జై కృష్ణను సెక్రటరీ జనరల్‌గా ఎన్నుకున్నారు. ఎన్బీఎఫ్ వ్యవస్థాపకసభ్యులలో రిపబ్లిక్ టీవీ, టీవీ 9 భారత్‌వర్ష, న్యూస్‌లైవ్ అండ్ నార్త్ ఈస్ట్ లైవ్, పుథియథలైమురయ్, పాలిమర్ న్యూస్ (తమిళనాడు), ఒరిస్సాటీవీ (ఒడిశా), ఐబీసీ (మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్), ఫస్ట్‌ఇండియా న్యూస్ (రాజస్థాన్), కోల్‌కతా టీవీ (పశ్చిమబెంగాల్), వీ6 న్యూస్ (తెలంగాణ), సీవీఆర్ న్యూస్ (ఏపీ, తెలంగాణ) తదితర చానళ్లు ఉన్నాయి.

# నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత

- సొత్తు విలువ రూ.12 లక్షలుగా గుర్తింపు
- నలుగురు నిందితులు రిమాండ్‌కు తరలింపు



మిర్యాలగూడలో గుట్కా సంచులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

**మిర్యాలగూడ టౌన్:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో కారులో తరలిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడ డీఎస్పీ వై వెంకటేశ్వరరావు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం మిర్యాలగూడ మండలం చిల్లాపురం క్రాస్‌రోడ్డువద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మిర్యాలగూడ నుంచి నాగార్జునసాగర్ వైపు కారులో అతివేగంగా వెళ్తున్న కొందరు తప్పించుకునే ప్రయత్నంచేశారు. టూటౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కారును వెంబడించి పట్టుకున్నారు. తనిఖీ చేయగా నిషేధిత గుట్కా, తంబాకు ప్యాకెట్లు లభించాయి. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అనుముల మండలం నాయుడుపాలెంకు చెందిన రమావత్ రవి, ఇబ్రహీంపట్నానికి చెందిన సయ్యద్‌ఖాదర్, గుంటూరు జిల్లాకు చెందిన మంచి లక్ష్మయ్య, సత్యం కలిసి గుట్కావ్యాపారం కొనసాగిస్తున్నారని తెలిపాడు. కారులో మొత్తం 106 సంచుల గుట్కా, తంబాకు ప్యాకెట్లు లభించాయి. వీటి విలువ సుమారు రూ.12లక్షలు ఉంటుందని డీఎస్పీ పేర్కొన్నారు. నలుగురు నిందితులను సోమవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని, ఈ దందాతో సంబంధం ఉన్న మరి కొందరు నిందితులు పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు.

### సూర్యాపేటలో లక్ష విలువైన గుట్కా ప్యాకెట్ల పట్టివేత

**నడిగూడెం:** లక్ష రూపాయల విలువైన గుట్కా ప్యాకెట్లను సూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై నరేశ్ వివరాలు వెల్లడించారు. నడిగూడెం మండలం వల్లాపురం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీచేస్తుండగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ధర్మతండాకు చెందిన వడ్త్య ప్రసాద్ ద్విచక్రవాహనంపై గుట్కాలను తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఖమ్మం పట్టణానికి చెందిన వ్యాపారి వాసుదేవరావు వద్ద కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. దీంతో వాసుదేవరావు ఇంట్లో, కిరాణ షాపులో సోదాలు చేయగా రూ.లక్ష విలువైన గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. అతడిని కూడా అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై వివరించారు.



సోమవారం మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు కారం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్, రేచల్ తదితరులు

# గ్రంథాలయాల అభివృద్ధికి కమిటీలు

టీఎన్జీవో ఉద్యోగులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి హామీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక కమిటీ వేస్తామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హామీఇచ్చారు. టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కారం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్ ఆధ్వర్యంలో సోమవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా గ్రంథాలయాల ఉద్యోగులకు 010 పద్దు కింద ట్రెజరీ నుంచి వేతనాలు చెల్లించాలని కోరారు. ఆయా గ్రంథాలయాల్లో నూతనపోస్టులు మంజూరుచేయాలని, ఏపీకి వెళ్లిన కొన్ని పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తిచేశారు. దీనిపై మంత్రి హామీ ఇచ్చినట్టు రవీందర్‌రెడ్డి చెప్పారు. త్వరలోనే గ్రంథాలయాల కోసం కమిటీ వేస్తామని, ఉద్యోగ సంఘాల నేతలకు అవకాశం కల్పిస్తామన్నారని తెలిపారు. జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షురాలు రేచల్, సెంట్రల్ యూనియన్ అనుబంధ తెలంగాణ గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కే దేవేందర్, ఆయోధ్య తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 10 డిసెంబర్ 2019



విజయ్‌దేవరకొండ

# అనుబంధాల హరివిల్లు



'అల వైకుంఠపురములో' అల్లు అర్జున్

**అ**ల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'అల వైకుంఠపురములో'. గీతా ఆర్ట్స్, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకాలపై అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకులముందుకు రానుంది. ఈ చిత్ర టీజర్‌ను ఈ నెల 11న విడుదల చేయబోతున్నారు. 'కుటుంబ అనుబంధాలు కలబోసిన ప్రేమకథా చిత్రమిది. త్రివిక్రమ్ శైలి సంభాషణలు, వినోదం ప్రధానాకర్షణగా నిలుస్తాయి. అల్లు అర్జున్ పాత్ర చిత్రణ నవ్యరీతిలో సాగుతుంది. తమన్ స్వరపరచిన గీతాలు సంగీతప్రియుల్ని అలరిస్తున్నాయి' అని చిత్ర బృందం తెలిపింది. టబు, రాజేంద్రప్రసాద్, సచిన్‌ఖేడేకర్, తనికెళ్ల భరణి, మురళీశర్మ, సముద్రఖని, జయరాం, సునీల్, నవదీప్, సుశాంత్, నివేథా పేతురాజ్, గోవిందాపద్మసూర్య, కల్యాణి నటరాజన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: పీఎస్ వినోద్, సంగీతం: తమన్, ఎడిటర్: నవీన్ నూలి, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: పీడీవీ ప్రసాద్, రచన-దర్శకత్వం: త్రివిక్రమ్.

**'నా కుటుంబ సభ్యులైన వెంకటేష్, నాగచైతన్యతో చేసిన సినిమా ఆడకపోతే విమర్శలు వస్తాయనే సంశయం ఉండేది. రషెస్ చూసిన తర్వాత ఆ భయాలన్నీ తొలగిపోయాయి. కథలోని ఎమోషన్స్ నన్ను కదిలించాయి' అని అన్నారు సురేష్‌బాబు. టీజీ విశ్వప్రసాద్‌తో కలిసి ఆయన నిర్మించిన చిత్రం 'వెంకీమామ'. వెంకటేష్, నాగచైతన్య కథానాయకులుగా నటించిన ఈ చిత్రానికి బాబీ దర్శకుడు. ఈ నెల 13న విడుదలకానుంది. ఈసందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో సురేష్‌బాబు, విశ్వప్రసాద్ పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి...**



టీజీ విశ్వప్రసాద్, సురేష్‌బాబు

# హీరోలు ఇమేజ్ గురించి ఆలోచించొద్దు!

**చా**లా రోజుల క్రితం రచయిత జనార్ధన మహర్షి ఓ కథ చెప్పారు. ఐడియా బాగున్నా దానిలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందనిపించింది. ఈ పాయింట్‌ను తొలుత కోన వెంకట్, దర్శకుడు కల్యాణ్‌కృష్ణ డెవలప్ చేసే ప్రయత్నాలు చేశారు. చివరకు ఈ సినిమాలోకి దర్శకుడు బాబీ వచ్చారు. నాగచైతన్య బాధ్యతల్ని వెంకటేష్ తీసుకునే సన్నివేశాన్ని అతడు రాసిన తీరు వినగానే కన్నీళ్లువచ్చాయి. చాలా రోజుల తర్వాత అసలైన తెలుగు సినిమా చూసిన అనుభూతిని పంచే చిత్రమిది. విధి, జ్యోతిషం నేపథ్యంలో ఎమోషన్స్, ప్రేమ, వినోదం, యాక్షన్, విలువల కలబోతగా ఉంటుంది. జీవితాన్ని సానుకూల దృక్పథంతో ఎలా కొనసాగించాలి? మానవ సంబంధాల గొప్పతనమేమిటో తెలియజేప్పే సినిమా ఇది. వెంకటేష్, నాగచైతన్య కలిసి చేస్తున్న తొలి సినిమా కావడంతో పెద్ద చిత్రంగా తీర్చిదిద్దాం. కశ్మీర్‌లో 27 రోజుల పాటు తెరకెక్కించిన యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకుంటుంది. వాస్తవికత కనిపించాలనే ఆలోచనతోనే రిస్క్ అయినా కశ్మీర్‌లో తెరకెక్కించాం.

**పోటీ ఆలోచన లేదు**

నా కెరీర్‌లో తొలిసారి ఈ సినిమా విడుదల విషయంలో కన్ఫ్యూజ్ అయ్యాను. తొలుత సినిమాను అక్టోబర్‌లో విడుదలచేయాలనుకున్నాం. కానీ వెంకటేష్ కాలు బెణకడంతో షూటింగ్ ఆలస్యమైంది. ఆ తర్వాత మేము సంక్రాంతి రేసులో ఉన్నామంటూ ప్రచారం జరిగింది. సంక్రాంతికి విడుదలయ్యే సినిమాలు ముందుగానే నిర్ణయమయ్యాయి. వారితో పోటీపడే ఆలోచన మాకు లేదు. గొడవలు పడి సినిమాలు విడుదల చేయడం సరికాదనిపించింది. అందుకే డిసెంబర్‌లో వస్తున్నాం. 'సురేష్ బాబుకు కథ చెప్పి ఒప్పించడం కష్టం, ఊరికే కథలను విని బాగాలేదంటాడు' అని చాలా మంది అంటుంటారు. సినిమా అనే డబ్బుతో ముడిపడిన వ్యాపారం. నేను ఇండస్ట్రీలోకి వచ్చి ముప్పై ఏడేళ్లు అవుతున్నది. నాకున్న అనుభవం, అమితమైన పరిజ్ఞానం కారణంగా సినిమాకు సంబంధించిన అన్ని అంశాల్లో ఎక్కువగా తప్పులే కనిపిస్తుంటాయి. వాటన్నింటికి సమాధానాలు దొరికిన తర్వాత సంతృప్తి కలిగితేనే సినిమాను మొదలుపెడతాను.

> **ప్రేక్షకులకు చక్కటి థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడంలో విఫలమవుతున్నాం. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో సినిమాల్ని తెరకెక్కించే ప్రయత్నాలు చేయాలి. థియేటర్ల కోసమే కాకుండా డిజిటల్, శాటిలైట్ హక్కుల వల్ల సినిమాలకు లాభం ఉంటుందనేది అందరూ అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుంది.**

**జనవరిలో అసురన్ రీమేక్**

కొన్నేళ్ల క్రితం బాలీవుడ్‌లో ముగ్గురు ఖాన్‌ల సినిమాలు తప్ప మిగతా వారి సినిమాలు వంద కోట్ల మైలురాయిని దాటడం కష్టమన్నారు. ప్రస్తుతం అక్షయ్‌కుమార్, ఆయుష్మాన్‌ఖురానా లాంటి హీరోలు వైవిధ్యమైన కథలతో విజయాల్ని అందుకుంటున్నారు. ఇమేజ్ కోసం ఆలోచించకుండా తెలుగు హీరోలు అలాంటి భిన్నమైన కథాంశాలతో సినిమాలు చేయాలి. ప్రస్తుతం రానాతో 'హిరణ్య' సినిమా చేస్తున్నాం. వెంకటేష్ కథానాయకుడిగా కలైపులి థానుతో కలిసి నిర్మించనున్న 'అసురన్' రీమేక్ జనవరిలో సెట్స్‌పైకి రానుంది. ఈ సినిమాలో నా తనయుడు అభిరామ్ నటిస్తాడని వస్తున్న వార్తల్లో నిజం లేదు.

**చాలా నేర్చుకున్నా-విశ్వప్రసాద్**

రెండేళ్ల క్రితం చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టాం. సురేష్‌ప్రొడక్షన్స్‌తో కలిసి ఈ సినిమాను నిర్మించడం ఆనందంగా ఉంది. కథ, కథనాల్లోని నవ్యత నచ్చి ఈ సినిమాలో భాగస్వామిగా చేరాను. సినిమా చూడగానే విజయంపై నమ్మకం పెరిగింది. ఈ ప్రయాణంలో సురేష్‌బాబు నుంచి చాలా విషయాల్ని నేర్చుకున్నాను. భవిష్యత్తులో ఇతర సంస్థలతో కలిసి సినిమాలు నిర్మిస్తాం. ప్రస్తుతం మా సంస్థలో పలు సినిమాలు నిర్మాణంలో ఉన్నాయి.

# పాన్ ఇండియా మూవీగా 'ఫైటర్'

**వి**జయ్‌దేవరకొండ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'ఫైటర్' పేరుతో ఓ చిత్రం రూపొందబోతున్న విషయం తెలిసిందే. త్వరలో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ పతాకాలపై పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మించనున్నారు. ఈ సినిమాలో విజయ్‌దేవరకొండ బాక్సర్‌గా శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్ర నిర్మాణంలో ప్రముఖ బాలీవుడ్ నిర్మాత కరణ్‌జోహార్ భాగస్వామిగా చేరబోతున్నట్లు తెలిసింది. స్వీయ నిర్మాణ సంస్థ ధర్మప్రొడక్షన్స్ పతాకంపై ఆయన 'ఫైటర్' నిర్మాణంలో పాలుపంచుకోబోతున్నట్లు సమాచారం. కరణ్‌జోహార్ చేరికతో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా మూవీగా తెరకెక్కించబోతున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రానికి రూపకల్పన చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దక్షిణాదిలో విజయ్ దేవరకొండ ఫాలోయింగ్, అందరికి చేరువయ్యే క్రీడా నేపథ్య కథాంశం కావడంతో ఈ సినిమా ప్రొడక్షన్స్‌లో భాగస్వామం తీసుకోవడానికి కరణ్‌జోహార్ ఆసక్తిచూపించారని చెబుతున్నారు. ఈ సినిమా ద్వారా విజయ్‌దేవరకొండ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. ప్రస్తుతం విజయ్‌దేవరకొండ 'వరల్డ్ ఫేమస్ లవర్' చిత్రంలో నటిస్తున్నారు. క్రాంతిమాధవ్ దర్శకుడు. చిత్రీకరణ చివరిదశలో ఉంది. ప్రేమికులరోజు కానుకగా ఫిబ్రవరి 14న ప్రేక్షకులముందుకురానుంది.



కీర్తి సురేష్

# రజనీకాంత్ సరసన

**అ**గ్రహీరో రజనీకాంత్‌తో ఒక్కసినిమాలోనైనా నటించాలని దక్షిణాదిలోని కథానాయికలంతా కలలు కంటుంటారు. ఆ అవకాశం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. తాజాగా ఆ లక్కీఛాన్స్ కీర్తి సురేష్‌ను వరించింది. 'మహానటి' తర్వాత వైవిధ్యతకు ప్రాముఖ్యతనిస్తూ సినిమాలు అంగీకరిస్తున్న ఆమె తాజాగా రజనీకాంత్‌కు జోడీగా నటించనున్నది. వివరాల్లోకి వెళితే.. రజనీకాంత్ కథానాయకుడి శివ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్నది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్ సంస్థ నిర్మించనున్నది. ఈ సినిమాలో కీర్తిసురేష్ కథానాయికగా నటించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 'నా సినీ ప్రయాణంలో మ్యాజికల్ మైల్‌స్టోన్ ఇది. రజనీకాంత్‌తో కలిసి నటించనుండటం ఆనందంగా ఉంది. ఈ సినిమా నా కెరీర్‌లో మధురజ్ఞాపకంగా నిలిచిపోతుందనే నమ్మకముంది' అంటూ కీర్తిసురేష్ ట్విట్టర్ ద్వారా సంతోషాన్ని వ్యక్తంచేసింది. రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 168వ చిత్రమిది. రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభంకానుంది.

# డీటీఎస్ ప్రారంభం



'డీటీఎస్' చిత్ర ప్రారంభోత్సవ దృశ్యం

**ఇ**ప్పటివరకూ తెలుగు తెరపై ఎవరూ స్పృశించని కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నామన్నారు అభిరామ్ పిల్లా. ఆయన దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'డీటీఎస్'. ఆశిష్‌గాంధీ, పూజాజవేరి జంటగా నటిస్తున్నారు. గంగారెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర ప్రారంభమైంది. హీరో ఆశిష్‌గాంధీ మాట్లాడుతూ ''నాటకం' తర్వాత కొత్త కాన్సెప్ట్‌ల కోసం ఎదురుచూస్తున్న నాలో ఈ కథ ఆసక్తిని రేకెత్తించింది. రొటీన్‌కు భిన్నంగా ఉంటుంది' అని తెలిపారు. 'డిసెంబర్ చివరి వారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. రెండు షెడ్యూల్స్‌లో సినిమాను పూర్తిచేస్తాం. మిగతా నటీనటులు సాంకేతికనిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం' అని నిర్మాత పేర్కొన్నారు. 'డీటీఎస్' టైటిల్ కొత్త ఫీల్‌ను కలిగించిందని సంగీత దర్శకుడు సాయికార్తిక్ అన్నారు. పూజాజవేరి మాట్లాడుతూ 'అభిరామ్ చెప్పిన కాన్సెప్ట్ నచ్చి సినిమాను అంగీకరించాను' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం:సాయికార్తిక్, కెమెరా:ముత్యాల సతీష్.



# సిద్ధార్థ్ టక్కర్

**సి**ద్ధార్థ్, దివ్యాంశ కౌశిక్ జంటగా నటిస్తున్న తాజా చిత్రానికి 'టక్కర్' అనే పేరును ఖరారుచేశారు. ఫ్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్‌సుందరం, జయరాం నిర్మిస్తున్నారు. కార్తిక్ జీ క్రిష్ దర్శకుడు. ఈ చిత్ర టైటిల్ పోస్టర్‌ను హీరో వరుణ్‌తేజ్ సోమవారం విడుదలచేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'యాక్షన్ అంశాలు మిళితమైన ప్రేమకథా చిత్రమిది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. సిద్ధార్థ్ పాత్ర నవ్య పంథాలో సాగుతుంది. కథానుగుణంగా టైటిల్ కుదిరింది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రమిది. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం. 2020 ఫిబ్రవరిలో సినిమాను విడుదలచేస్తాం' అని తెలిపారు. అభిమన్యుసింగ్, యోగిబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: నివాస్ కె ప్రసన్న.



రష్మిక మందన్న



కాజల్ అగర్వాల్

# కొరియన్ రీమేక్‌లో..

**ప్ర**స్తుతం తెలుగులో రీమేక్ చిత్రాల ట్రెండ్ కొనసాగుతున్నది. వివిధ భాషల్లో విజయవంతమైన చిత్రాల్ని టాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు అగ్రనాయకానాయికలు సిద్ధపడుతున్నారు. తాజాగా ఓ కొరియన్ రీమేక్‌లో కాజల్ అగర్వాల్ నటించనున్నట్లు సమాచారం. అండర్‌వరల్డ్ డ్రగ్ మాఫియా నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు తెలిసింది. ఇందులో కాజల్ అగర్వాల్ పోలీస్ పాత్రలో కనిపించనున్నట్లు చెబుతున్నారు. తొలుత కథానాయికగా నయనతారను తీసుకోవాలని చిత్రబృందం భావించింది. ఆమె డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో కాజల్‌ను కథానాయికగా ఎంపికచేసినట్లు తెలిసింది. ఈ చిత్రానికి హీరో రానా ఓ నిర్మాతగా వ్యవహరించనున్నట్లు సమాచారం.

# పొరపాటు చేయకూడదు!

**'ఛ**లో' 'గీత గోవిందం' చిత్రాలతో యువతరం హృదయాల్ని దోచుకుంది కన్నడకస్తూరి రష్మిక మందన్న. చూడముచ్చటైన రూపలావణ్యంతో ఈ అమ్మడు కుర్రకారు కలల రాకుమారిగా భాసిల్లుతోంది. కథాంశాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉండే ఈ భామ తాజాగా 'జెర్సీ' చిత్ర హిందీ రీమేక్‌లో నటించడానికి నో చెప్పింది. రెమ్యునరేషన్ తక్కువగా ఆఫర్ చేయడం వల్లనే ఆ సినిమాను తిరస్కరించిందని వార్తలొచ్చాయి. దీనిపై రష్మిక మందన్న స్పందించింది. ఆ సినిమాను వద్దనుకోవడానికి కారణం పారితోషికం కాదని వివరణ ఇచ్చింది. ''జెర్సీ' చిత్రంలో కథానాయిక పాత్ర బలమైన ఉద్వేగాలతో సాగుతుంది. ఆ పాత్రకు నేను న్యాయం చేయలేనని అనిపించింది. ఆ క్యారెక్టర్‌తో సహానుభూతి చెందుతూ అభినయించగల నేర్పు కావాలి. అది కష్టమనిపించింది. సినిమా విజయంలో నాయకనాయికల పాత్ర కీలకంగా ఉంటుంది. తెలిసి పొరపాటు చేయకూడదు. అందుకే ఈ సినిమా నుంచి తప్పుకున్నా. డబ్బుకంటే మన పాత్రకు ఎంతవరకు న్యాయం చేశామన్నదే ఎక్కువ సంతృప్తినిస్తుంది' అని చెప్పింది రష్మిక. ప్రస్తుతం ఆమె తెలుగులో 'సరిలేరు నీకెవ్వరూ' 'భీష్మ' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది.